VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

రిజిస్టర్డు నెం. 6097. 8 పేజీలు : రెండణాలు

విశాలాంధ్ర

సంపుటి 3 ★ విజయవాడ: ఆదివారం; జూన్ 6; 1954 ★ సంచిక 62

జపాన్ దిగువశాసనసభ అధ్యక్ష ఉపాధ్యక్షుల ఖైదు

టోకియో, జూన్ 5

పోలీసుబలగాన్ని కేంద్రీకృత అధికారం క్రిందికి తెచ్చే బిల్లుపై రేగిన దుమారంలో నేడు జపాన్ పార్లమెంటు సోషలిస్టు సభ్యులు దిగువశాసన సభ అధ్యక్షుని, ఉపాధ్యక్షుని వారి గదులలో పెట్టి తాళాలు వేశారు. ఆవిధంగా వారు పార్లమెంటు సమావేశాన్ని ప్రారంభించడానికి వీలులేకుండా చేశారు. వీరిని విడిపించడానికి ప్రభుత్వపక్ష సభ్యులు ఎట్టి ప్రయత్నమూ చేయలేదు. పార్లమెంటు భవనం వెలుపల పోలీసులు లోపలికి ప్రవేశించడానికి సిద్ధంగా నిలబడివున్నారు.

ఆంధ్ర స్టేట్ హోటల్
మిలిటరీ భోజన హోటల్
ప్రకాశంరోడ్డు - విజయవాడ-2
భోజనం 1 కి రు. 0-10-0 మాత్రమే!
రుచి, శుచికరమైన పదార్థములకు మా ప్రత్యేకత !
ఒకసారి దయచేసిన మీకే తెలియగలదు.
ప్రొప్రయిటరు : ఎ. మల్లిఖార్జునరావు
మేనేజరు : కె. కోటేశ్వరరావు B. A., MNA

స్త్రీలు సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలి

ప్రథమ జాతీయ మహిళామహాసభలో శ్రీమతి ఊర్మిళాదేవి ఉద్ఘాటన

ఒకే భాషగల అనేక రాష్ట్రాల నిర్మాణం

భాషారాష్ట్ర సిద్ధాంతానికే గొడ్డలిపెట్టు కాగలదని శ్రీ రామానందతీర్థ ఉద్ఘాటన

హైదరాబాదు, జూన్ 5

ఒకే భాషగల ప్రాంతాలతో అనేకరాష్ట్రాలను నిర్మించినట్లయితే దానివల్ల నూతన రాష్ట్రాల పటుత్వం దెబ్బతినడమే కాకుండా వాటి అభివృద్ధి కూడా కుంటుపడుతుందని హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెసు మాజీ అధ్యక్షుడు స్వామీ రామానందతీర్థ నేడిక్కడ పత్రికలవారితో పసంగిస్తూ ఉద్ఘాటించారు.

ఒకే భాషగల అనేక రాష్ట్రాలను నిర్మిస్తే అలాంటి రాష్ట్రాలు భారతదేశంలో 30 కి మించగలవని, అటువంటి రాష్ట్రాలవల్ల ఫలితం అనుమానాస్పదమేనని కూడా ఆయన అన్నారు.

ఏక భాష, ఏక సంస్కృతీ గల ప్రదేశాన్నంతనీ ఒకే పరిపాలన ప్రాంతముగా చేయాలన్న ఆశయానికి ఒకే భాషగల అనేక రాష్ట్రాల నిర్మాణం గొడ్డలిపెట్టులాంటిదనీ, భారత దక్షిణ ప్రాంతాల్లో హైదరాబాదు రాజధానిగా విశాలాంధ్ర, బొంబాయి రాజధానిగా సంయుక్త మహారాష్ట్ర, బెంగుళూరు రాజధానిగా సంయుక్త కర్నాటక, బలీయమైన ప్రాంతాలుగా తయారు కాగలవనీ శ్రీ రామానందతీర్థ అన్నారు.

రాష్ట్రాలను మాటిమాటికీ పునర్నిర్మించడం సాధ్యంకాదని, అటువంటప్పుడు జరిగే పునర్నిర్మాణం అందరికీ ఆమోదయోగ్యంగా వుండాలనీ ఆయన అన్నారు.

ఆయనింకా ఇలా అన్నారు :

ఒకే భాషమాట్లాడే విభిన్న ప్రాంతాలవారు ఒకచోటచేరి ఒకరినొకరు అర్థంచేసుకొని ఈ సమస్యను పరిష్కరించుకొని ఒక నిర్ణయానికి రావాలని నేను ఆదినుంచీ చెప్తూనే వున్నాను. మహారాష్ట్ర కర్నాటకాలలో ఈ పని జరిగింది. ఆంధ్రుల విషయంలో ఇదింకా జరగవలసివుంది.

భాషా సంస్కృతుల ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్నిర్మించిన తర్వాత ఏరాష్ట్రమూకూడా లోటురాష్ట్రంగా వుండదనే నావిశ్వాసం. ఒకవేళ అలాంటి రాష్ట్రం ఏదైనా వుంటే దానికి కేంద్రం బాగా సహాయం చేయవలసి వుంటుంది.

రాష్ట్రం కలుపలా [illegible] గల ప్రజా సంఘాలవారంతా ఒక్కగొంతుతో హైదరాబాదు రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని కోరారు. ఈ ఐక్యవాంఛ ప్రాధాన్యాన్ని కించపరచడంవల్ల కలిగే లాభం ఏమీలేదు.

హైదరాబాదురాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన తర్వాత న్యాయంగా జరగవలసిన పని విశాల ఆంధ్రమహారాష్ట్ర కర్నాటక రాష్ట్రాల నిర్మాణం. అని ఆయన వాకొన్నారు.

గ్రీసు, యుగోస్లావియా, టర్కీల సైనికసంధి

గ్రీసు ప్రధాని ప్రకటన

ఏథెన్సు, జూన్ 4

ప్రస్తుతం గ్రీసులో వున్న యుగోస్లావియా అధ్యక్షుడు టిటో, తాను కలిసి చర్చించి ఇదివరకు అంకారాలో గ్రీసు, యుగోస్లావియా, టర్కీలమధ్య జరిగిన స్నేహసంధిని సైన్యసహకార ఒడంబడికనుగా మార్చడానికి నిశ్చయించినట్లు నేడు గ్రీసు ప్రధాని మార్షల్ అలెగ్జాండర్ పాపాగోస్ ప్రకటించాడు.

ఈసంధి ఆత్మరక్షణకేగాని, ఎవ్వరికీ వ్యతిరేకంగా వుద్దేశించినది కాదని ఆయన చెప్పాడు.

గూర్ఖా పరిషత్తుకు అమెరికానుంచి యుద్ధ పరికరాలు

ఖాట్మండు, జూన్, 4

అమెరికను సైన్యాలలో వుపయోగించే వైర్లెసు, స్పీకర్లు ట్రాన్స్‌మీటర్లు నాలుగువున్న ఒక పార్శిలును నేడు నేపాల్ పోలీసులు స్వాధీనపరచుకొన్నారు. ఇవి ఒక గూర్ఖా పరిషత్తు నాయకుని పేరవచ్చాయి. ఈపార్శిలు అమెరికానుంచి పంపబడింది.

గూర్ఖాపరిషత్తు జమీందార్ల, రాణాలసంస్థ. వారంక్రితం కొందరు భారత పార్లమెంటు సభ్యులు ఖాట్మండూ వెళ్ళినప్పుడు భారత వ్యతిరేక ప్రదర్శనలు చేయించినదని, ఈ పత్రిక వ్రాస్తోంది.

పుదుచ్చేరిలో గూండా చర్యలు

భారతకాన్సల్ జనరల్‌పై రౌడీల తిట్లవర్షం

పుదుచ్చేరి, జూన్ 4

ఇక్కడ భారత కాన్సలేట్ గ్రంథాలయం వున్న వీధిలో నిన్న కొంతమంది గూండాలుచేరి భారతీయ కాన్సల్ జనరల్ శ్రీ కేవల్ సింగ్‌ను అసభ్యమైన తిట్లు తిట్టారు.

రాత్రి తొమ్మిదిన్నర గంటలకు గూండాలు గ్రంథాలయ ద్వారాన్ని తట్టి కాన్సల్ జనరల్‌ను తిట్టడం ప్రారంభించారు. అయితే లోపలివారు బయటికి వచ్చేటప్పటికి వీరు పారిపోయారు.

దీనిపై వ్యాఖ్యానిస్తూ, ఒక జాతీయ నాయకుడు, కాన్సల్ జనరల్‌కు వ్యతిరేకంగా, ఫ్రెంచి అధికారుల మద్దతుతో కొంతమంది సాగిస్తున్న నీచ ప్రచారంలో ఇది భాగమన్నారు. వీధులలో పహరాయిస్తున్న ఫ్రెంచి ఇండియా పోలీసులకు ఈ సంఘటనలు తెలియకపోవడం సాధ్యంకాదన్నారు.

గతరాత్రి జరిగిన సంఘటనపైనా, మే 31 వ తేదీన భారత సమాచార శాఖోద్యోగి శ్రీ పి. జె. రావును, ఆయన సతీమణిని ఫ్రెంచి ఇండియా అధికారులు అటకాయించడంపైన కాన్సల్ జనరల్ ఫ్రెంచి ఇండియా ప్రభుత్వానికి తీవ్రనిరసన తెలియజేశారు.

ఫ్రెంచిస్థావరాల సమస్యపై పారిస్ చర్చల వైఫల్యం

వాటిని భారత ప్రభుత్వానికి అప్పచెప్పటకు ఫ్రాన్సు నిరాకరణ

పారిస్, జూన్ 4

భారతదేశంలోని ఫ్రెంచి స్థావరాల భవిష్యత్తుపై పారిస్‌లో జరుగుతున్న ఇండియా-ఫ్రెంచి చర్చలు నేడు విఫలమైనట్లు ప్రకటించబడింది. భారతదేశంలోని తమ స్థావరాలను వెంటనే భారత ప్రభుత్వానికి వప్పగింతపెట్టడానికి ఫ్రాన్సు నిరాకరించడంచేత చర్చలు విఫలం అయాయి. ఫ్రాన్సు వుండగా ఆ ప్రాంతాలలో జరిగే ఎన్నికలలో స్వేచ్ఛ వుండదనీ, ముందుగా ఆ ప్రదేశాలను భారతప్రభుత్వానికి వప్పచెప్పితే, దాని రాజకీయ భవిష్యత్తును గురించిన నిర్ణయాలు తర్వాత చేసుకోవచ్చుననీ భారత ప్రభుత్వం సూచన. జనవాక్య నిర్ధారణ ద్వారా ఆ ప్రాంతాల భవిష్యత్తును ముందే నిర్ణయించాలని ఫ్రాన్సు ఆలోచన.

ఉభయ ప్రభుత్వాల మధ్య చర్చలు విఫలం కావడానికి గల చరిత్రను వివరిస్తూ ఫ్రెంచి ప్రభుత్వం నేడు ఒక ప్రకటన చేసింది. దానిలో ఫ్రాన్సు ఇంతకూ ముందు రెండు మార్గాలను చూపినట్లు వుంది.

ఒకటి : వి. రా. స. పెత్తనంక్రింద వెంటనే జనవాక్య నిర్ధారణ.

రెండు : వెంటనే ఉభయ ప్రభుత్వోద్యోగులతో తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించాలి. ఫ్రెంచివారి సాంస్కృతిక, ఆర్థిక స్వార్థాలకు ఇబ్బందికలగకుండా, ఆ స్థావరాలు భారతదేశంలో చేరిపోయే విధంగా ఒడంబడికను తయారుచేయాలి. ప్రజలతో సంప్రదించి ఆ ఒడంబడికను స్థిరపరచాలి.

ఇండియా ప్రతినిధివర్గం వీటిలో దేనికీ అంగీకరించక పోవడంచేత సంప్రదింపులు విఫలమయాయని అది తెలుపుతూంది.

భారత రాయబారవర్గ నాయకుడు శ్రీ ఆర్. కె. నెహ్రూ సంభాషణల వైఫల్యం బాధ్యతను ఫ్రెంచిప్రభుత్వానిదని నిరూపిస్తూ ఈ విధంగా ప్రకటన చేశారు: "ఫ్రెంచిస్థావరాలను వెంటనే భారతదేశంలో కలిపివేయాలని ఆ స్థావరాలలోనే ఒక బలీయమయిన ప్రజావుద్యమం వుంది. ఆస్థావరాలలోని ప్రజలలో నూటికి తొంభయిమందిఎన్నుకొన్న ప్రతినిధులు జనవాక్య నిర్ధారణతో నిమిత్తం లేకుండా వానిని ఇండియాలో కలిపివేయాలని డిమాండు చేశారు. ఇప్పటికప్పుడే ఫ్రెంచిస్థావరాలలో అయిదోవంతు భాగం ఫ్రెంచిపాలనను వదల్చుకొన్నాయి.

"వెంటనే పోలీసు, న్యాయశాఖ, ఆర్థికశాఖలను భారతప్రభుత్వానికి అప్పచెప్పేటందుకు కార్యక్రమాన్ని మా ప్రతినిధివర్గం సూచించింది. తర్వాత మూడు నాలుగు నెలలలో వానిపై రాజకీయ అధికారాన్ని వప్పచెప్పడం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవచ్చునన్నాం. "ఫ్రెంచిరాజ్యాంగ చట్టంప్రకారం ప్రజలకు స్వయం నిర్ణయాధికారం వున్నదంటూ ఫ్రెంచి అధికారులు మా సూచనలను త్రోసిపుచ్చారు.

"ఫ్రెంచివారు చివరలో జనవాక్య నిర్ధారణ ఆ పాటను వదులుకొన్నా, ప్రజలతో సలహా చెయ్యాలనే కొత్త విషయాన్ని తీసుకొచ్చారు. మాచేతులోకి అధికారం మారి, ధృవపడడం జరిగాకనే ఆ విషయాన్ని మేము ఆలోచిస్తాము."

దేశం నలుమూలలనుంచీ 850 మంది ప్రతినిధుల ఆగమనం

[విశాలాంధ్ర విలేఖరి]

కలకత్తా, జూన్ 5

"మహిళలు తమ హక్కుల కొరకు ప్రభుత్వం మీద శాసనాలమీద మాత్రమే ఆధారపడగూడదు. మహిళలువారి హక్కుల కొరకు సుసంఘటితులై స్వయంగా పోరాటం సాగించాలి" అని నిన్న సాయంకాలం యిక్కడ ప్రారంభమైన ప్రథమ జాతీయ మహిళా మహాసభ సమావేశంలో శ్రీమతి ఊర్మిళాదేవి ఉద్ఘాటించారు.

మహిళా మహాసభను ప్రారంభించుతూ శ్రీమతి ఊర్మిళాదేవిగారు సమాజంలో సమాన భాగస్వాములుగా గాకుండా పరిచారికలుగా, అనుయాయులుగా పరిగణించ బడుతూ శతాబ్దాల తరబడి అణగద్రొక్కబడ్డ స్త్రీలు ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని సాధించుకోవాలన్నారు. స్త్రీలు ఆత్మగౌరవంతోను, ఆత్మవిశ్వాసంతోను పనిచేయాలని చెప్పారు. శ్రీమతి ఊర్మిళాదేవి దేశబంధు చిత్తరంజన్ దాసు సోదరి.

మూడురోజులపాటు జరిగే భారత జాతీయ మహిళా మహాసభ నిన్న ఇక్కడ ప్రారంభమైంది. "స్త్రీలకు పురుషులతోపాటు సమాన ఆర్థిక, సాంఘిక హక్కులు ఉండాలి", "సమానమైన పనికి స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన వేతనాలివ్వాలి", "ప్రపంచశాంతి వర్ధిల్లాలి", అనే నినాదాలు వ్రాయబడిన అట్టలతో మహాసభ జరుగుతున్న యూనివర్సిటీ హాల్ అలంకరించబడింది.

మహాసభకు 18 రాష్ట్రాలనుండి 850 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నేపాల్, తూర్పు పాకిస్తాన్, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలనుండి, ప్రపంచ ప్రజాస్వామిక మహిళాసంఘం నుండి మొత్తం 32 మంది సౌహార్ద ప్రతినిధులు, పదిమంది పరిశీలకులు హాజరయ్యారు.

సందేశాలు

భారత ఆరోగ్యశాఖామంత్రిణి శ్రీమతి రాజకుమారీ అమృతకౌర్, శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ, శ్రీమతి శారదాబెన్, బెంగాల్ కాంగ్రెసు శాసన సభ్యుడు నిహారేందుదత్తగుప్తా, శాంతి ఉద్యమనాయకుడు డాక్టర్ ప్రఫుల్ల ఘోష్, పండిట్ సుందర్‌లాల్ గార్లనుండి, చైనా, సోవియట్ యూనియన్, జెకోస్లావేకియా, ఆస్ట్రియా, ఇటలీ మొదలైన దేశాలలోని ప్రముఖ ప్రజాసంస్థలనుండి మహాసభ జయప్రదం కావాలని సందేశాలు వచ్చాయి.

యూనిఫారాలు ధరించిన మహిళా వలంటీర్లు, స్థానిక ఝాన్సీరాణీ దళంవారు ప్రతినిధులకు, నాయకురాండ్రకు సైనిక వందనంతో స్వాగతమిచ్చారు. ప్రముఖ గాయకురాండ్రు, విద్యార్థినుల పాటలతో సభ ప్రారంభమైనది.

అధ్యక్షవర్గం

మహాసభకు అధ్యక్షత వహించవలసిన శ్రీమతి అక్కమ్మా చెరియన్ వారు తనబిడ్డకు జబ్బుగావున్నందున మహాసభకు హాజరు కాలేకపోయింది. ఆమె స్థానంలో శ్రీమతులు అనసూయాగ్యాన్ చంద్, మనోరమాబోస్, సుశీలా గోపాలన్‌తో కూడిన అధ్యక్షవర్గం ఎన్నుకోబడింది.

తూర్పు పాకిస్తాన్ సౌహార్ద ప్రతినిధి యిచ్చిన సౌహార్ద సందేశం ప్రతినిధులను ఉత్సాహపరచింది. భారత - పాకిస్తాన్ ప్రజల శాంతి రక్షణకొరకు ఐక్యంగా సాగిస్తున్న పోరాటాన్ని సామ్రాజ్యవాదులు ఎవ్వరూ విచ్ఛిన్నం చెయ్యలేరు అని ఆమె చెప్పినప్పుడు హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

బ్రిటిషు మహిళాసంఘ ప్రతినిధి శ్రీమతి డోరా రస్సెల్ బ్రిటిషు మహిళల సౌహార్ద అభినందనలు అందజేసింది.

స్త్రీల ఓటుహక్కు, ప్రసూతికేంద్రాలు, సమానవేతనాలు మొదలైన వాటి కొరకు పోరాటం సల్పడంతో తృప్తి పడకూడదు అన్నారు. ప్రపంచ ప్రజానీకంలో సగభాగంగావున్న మహిళలు మానవజాతిని ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిపైన వారి అభిప్రాయాలను ప్రపంచానికి చాటాలిఅని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో శాంతి పోరాటం అతి ప్రధానమైన పోరాటమని పేర్కొన్నారు.

ప్రపంచ ప్రజాస్వామిక మహిళా సంస్థ సహాయకార్యదర్శి శ్రీమతి బెట్టీ రెయిలీ (ఆస్ట్రేలియా) శాంతి, స్వాతంత్ర్యాల కొరకు పోరాడుతున్న భారత మహిళలను అభినందించారు. హైడ్రోజన్ బాంబు పాటవ పరిశీలన ప్రయోగాలను నిలుపుదల చెయ్యాలని, అణు ఆయుధాలను నిషేధించాలని, ఆస్ట్రేలియా మహిళలు ఆ దేశ ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తిపత్రాన్ని సమర్పించారనిచెప్పి, శాంతి పోరాటంలో ఆస్ట్రేలియా మహిళలు ఏవిధంగా పాల్గొంటున్నదీ వివరించారు.

అందరూ సంఘంలో చేరాలి

మహాసభ అధ్యక్షవర్గంలో ఒకరైన శ్రీమతి అనసూయాబాయిగ్యాన్ చంద్ యిలా ప్రసంగించారు:

అనేక సమస్యలను గూర్చి స్త్రీలకు తెలియకపోవచ్చు. కాని స్త్రీలకు శాంతికీ - యుద్ధానికీ, ఆకలిమంటలకు నిండుకడుపులకూ మధ్య, మనబిడ్డలకు హైడ్రోజన్ బాంబులవల్ల రక్షణ వుండేదీ లేనీ శాంతివల్ల రక్షణ వుండేదీ తెలుసు.

మహిళామహాసభ కమ్యూనిస్టు సభ అనడం శుద్ధ అబద్ధం. స్త్రీలు యే రాజకీయ అభిప్రాయాలకు చెందిన వారైనప్పటికీ, వారి కష్టాలను తొలగించుకోడానికి, యుద్ధప్రమాదాన్ని పారద్రోలి, శాంతిని సుస్థిరం చేసేందుకు, బిడ్డల శ్రేయస్సుకోసం ఐక్యంగా పోరాడాలి. ఐక్యసంఘటనగా యేర్పడాలి. దేశంలోని అన్ని వర్గాలకు చెందినవారు సంఘంలోచేరి మహిళాసంస్థను పటిష్ఠం చేసుకోవాలి.

మహాసభ ప్రారంభం కావడానికి ముందు ప్రతినిధులు విషయనిర్ణయ సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సంఘంలో వివిధ ప్రాంతాల మహిళా సంస్థల ప్రతినిధులు వున్నారు. జాతీయ మహిళా సమన్వయ సంఘ కార్యదర్శి శ్రీమతి హజ్రాబేగమ్ సమన్వయ సంఘ కార్యకలాపాలను గూర్చి యిచ్చిన నివేదికను, జమాఖర్చుల ప్రతినిధులు అంగీకరించారు.

పాముకరిస్తే ప్రథమ చికిత్సకు కూడా ఏర్పాట్లుచేయని పోలీసుల కర్కశత్వం

శ్రీ అన్నే వెంకటేశ్వరరావుగారి ప్రస్తుత స్థితిపై ఆయనతో ఇంటర్వ్యూ చేసి వచ్చిన శ్రీ ఉద్దరాజు రామంగారి ప్రకటన

విజయవాడ, జూన్ 5

పశ్చిమ గోదావరిజిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ అన్నే వెంకటేశ్వరరావుగారిని పోలీసులు దుర్మార్గులైన భూస్వాముల ప్రోత్సాహంతో ఎట్టి హింసాకాండకు గురిచేసి, వారి ప్రాణాలపట్ల ఎంత నిర్లక్ష్యంతో ప్రవర్తించిందీ ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘ కోశాధికారి శ్రీ ఉద్దరాజు రామంగారి ద్వారా తెలియవస్తున్నది.

శ్రీ ఉద్దరాజు రామంగారు నిన్న నే శ్రీ వెంకటేశ్వరరావుగారిని ఇంటర్వ్యూ చేసి, ఈ దిగువ వివరాలు తెలియజేస్తున్నారు :

శ్రీ వెంకటేశ్వర్రావుగారిని రిజర్వు పోలీసులు 31 వ తేదీ పగలు నాలుగు గంటలకు అరెస్టుచేసి, రాత్రి పన్నెండు గంటలవేళ ఆవురు దుబ్బులతో జీబురుమంటున్న ప్రాంతంలో నిర్లక్ష్యంగా నడిపించుకొని తీసుకువెళ్ళారు. తుపాకి మడమలతో ఘోరంగా కొట్టారు. లోము ఫుల్ బూట్లుతో దుమ్ముకొని తమ స్వాధీనంలో వున్న ఖైదీ ప్రాణాలను లెక్కచేయకుండా నడిపించడం వల్ల మార్గమధ్యంలో ఆయనను పాము కరిచి స్పృహతప్పి పడిపోవడం జరిగింది.

పాము కరిచిన తర్వాతైనా పోలీసులు ప్రథమ చికిత్సకు ఏర్పాట్లు చేయలేదు. వెంటనే ఆసుపత్రికి చేర్చమని వెంకటేశ్వర్రావుగారెంత చెప్పినా, పోలీసులు వినిపించుకోలేదు. తన జేబులో ఉన్న మూడురూపాయలతో డోలీ కట్టించి ఆసుపత్రికి చేర్చమని వెంకటేశ్వర్రావుగారు మరొకసారి హెచ్చరించారు. కాని పోలీసులు ఆ హెచ్చరికను ఖాతరు చేయలేదు.

దీన్నిబట్టి, గారపాటి చినకనకయ్యలాంటి దుర్మార్గులైన భూస్వాముల ప్రోత్సాహంతోనే యిదంతా జరిగియుండాలనిపిస్తూంది.

వెంకటేశ్వరరావుగారి ప్రస్తుత పరిస్థితి

పాము కరిచినప్పటినుంచీ శ్రీ వెంకటేశ్వర్రావుగారు దాని విషంవల్ల విపరీతంగా బాధపడుతున్నారు. రోజురోజుకు వాపు పైకి వ్యాపిస్తోంది. వాపుతోబాటు బాధకూడా పైకి వ్యాపిస్తోంది. నిన్నటికి తొడవరకూ వాపు, బాధ వ్యాపించాయి. పాము కుడికాలు మడమ పైభాగంలో ప్రక్కగా కాటువేసింది. వాడ పాము సంబంధమై వుంటుందని అనుకొంటున్నారు. కాలంతా వేడి మంటలతో బాధపడుతున్నారు. మొదటినుండీ ఆహారం తీసుకోనామంటే హితవు లేదు. వాంతులు, వికారం లక్షణంగా ఉంది. పాదంపైన కాలిన బొబ్బలవలె బొబ్బలు లేచినవి.

జామీనుపై విడుదల

నిన్నటి వరకూ వెంకటేశ్వర్రావుగారు పోలీసు కస్టడీలో ఏలూరు గవర్నమెంటు ఆసుపత్రిలో ఉంచబడ్డారు. నిన్న సాయంకాలం జమీను మీద విడుదలచేయబడ్డారు. వెంటనే పీపుల్స్ క్లినిక్ (ప్రైవేట్ ఆసుపత్రి)లో చేర్చబడ్డారు.

ప్రభుత్వ కర్తవ్యం

25ఏండ్లుగా జాతీయోద్యమంలోను, ప్రజాసేవలోను రాటు దేరిన శ్రీ అన్నే వెంకటేశ్వర్రావు గారిని దుర్మార్గులైన భూస్వాముల ప్రోత్సాహంతో అరెస్టు చేసి కొట్టడం, పాము కరిచినప్పటికీ వెంటనే చికిత్స చేయించక పోవడం అమానుషమనీ, యీహింసాకాండకు కారకులైన పోలీసుల్నీ, వారిని ప్రోత్సహించిన వారినీ ప్రభుత్వం తగు విధంగా శిక్షించాలని శ్రీ రామంగారు హెచ్చరిస్తున్నారు. రైతు సేవకులూ, రైతుసంఘాలూ పైదుర్మార్గాలకు కారకులైన వారిని విచారించి శిక్షించవలసిందిగా పోలీసు మంత్రి సంజీవయ్యగారిని డిమాండుచేయమని విజ్ఞప్తిచేస్తున్నారు.

జాగీర్ల రద్దు బిల్లు

జైపూర్, జూన్ 4

రాజస్థాన్ అసెంబ్లీలో జాగీర్దార్ సభ్యులు రాజస్థాన్ జాగీర్లరద్దు బిల్లులో నష్టపరిహారానికి, స్వంత వ్యవసాయానికి సంబంధించిన క్లాజులపై వోటు చేయరాదని డిప్యూటీ స్పీకర్ శ్రీలాల్ సింగ్ సక్తావత్ నేడు రూలింగ్ ఇచ్చారు. ఈ క్లాజులలో జాగీర్దారులకు స్వప్రయోజనం వుండటమే తమనిర్ణయానికి కారణమని చెప్పారు. అయితే బిల్లుపై సాధారణ చర్చ ఓటింగులో వారు పాల్గొనవచ్చున్నారు.

ఇండియాకుచేసే సాయం అమెరికా లాభం కోసమే!

అమెరికన్ విదేశాంగమంత్రి విస్పష్టప్రకటన

వాషింగ్టన్, జూన్ 4

అమెరికా ఇండియాకుచేసే సహాయం అమెరికా లాభం కోసమేనని అమెరికన్ విదేశాంగమంత్రి డల్లస్ నేడు స్పష్టం చేశాడు.

విదేశ వ్యవహారాల విషయం అభిప్రాయ భేదాలున్నా ఇండియాకు ఆర్థిక సహాయం ఇవ్వాలని నేడు డల్లస్ సెనేటునియమించిన విదేశ వ్యవహారాల సంఘంముందు చెపుతూ ఇల్లా అన్నాడు :

"పండిట్ నెహ్రూ ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానానికే కట్టుబడి వుంటున్నాడు. విదేశ వ్యవహారాలపై ఇండియా కొన్ని సందర్భాలలో మనతో భేదించవచ్చు. కాని ప్రధాన సూత్రాలలో మనకూ, వారికీ భేదంలేదు.

"కమ్యూనిస్టు చైనాలోని పరిణామాలతో పోల్చి చూస్తే ఇండియా కార్య విధానం చాలా అద్భుతంగావుంది."

"స్వతంత్ర" దేశాలమధ్య విభిన్నాభిప్రాయాలుండడానికి అవకాశాలున్నాయంటూ డల్లెసు ఇల్లా అన్నాడు.

"ప్రధాన సమస్యలపై తాత్కాలికంగా అభిప్రాయ భేదాలు కలిగినా ఇండియా ప్రజలు తమదేశాభివృద్ధికి చేసే ప్రయత్నాలలో మనం సహాయం ఇవ్వడానికి నిరాకరించరాదు.

"ఏది ఎట్లావున్నా అధమం మన స్వార్థంచూసియైనా ఆ సహాయం ఇవ్వాలి.

"ఇండియా ప్రజలకు ప్రజా తంత్ర వ్యవస్థమీద విశ్వాసంలోపించడం జరిగితే మనకే నష్టం."

ఇండోచైనా పరిస్థితిపై అమెరికా ఆదుర్దా

తమకూ, మిత్రరాజ్యాలకూ ప్రమాదమని డలెస్ ప్రకటన

వాషింగ్టన్, జూన్ 4

అమెరికన్ సెనేట్ నియమించినవిదేశ వ్యవహారాల సంఘం ముందు సాక్ష్యం ఇస్తూ ఇండోచైనా పరిస్థితులు ప్రమాదంలోనే వున్నా, చేయిదాటి పోలేదని అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ నేడు అన్నాడు.

విదేశాలకు సైనిక, ఆర్థిక, సాంకేతిక సహాయాల నందచేయడం కొరకై 49 కోట్ల, 77 లక్షల డాలర్లను కేటాయించాలని అధ్యక్షుడు తెచ్చిన బిల్లును సమర్థిస్తూ డల్లెస్ ఇల్లా అన్నాడు.

"ఇండోచైనాలోని పరిస్థితులు ఒక్క ఆగ్నేయాసియాకే గాక పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు, మన మిత్ర రాజ్యాలకు కూడ చాల ప్రమాదకరంగా తయారవుతూంది.

"వియత్మిన్ సైన్యాలకు ఆయుధాలను, సైనిక సరఫరాలను చైనా ఎంతగానో పంపుతూంది. సోవియటు యూనియను కూడా ఇండోచైనాలో కమ్యూనిస్టు సైన్యాలకు ఆయుధాలను అధికాధికంగా పంపుతూందని చెప్పడానికి మావద్ద ఆధారాలున్నాయి."

ఇండోచైనాలో యుద్ధాన్ని ముగింపచేసి, అక్కడి ప్రజలకు స్వాతంత్ర్యం ఇప్పించడానికి అమెరికా, దాని మిత్ర రాజ్యాలూ జెనీవాలో ప్రయత్నాలు చేస్తున్నాయనీ, అయినా చర్చలలో కమ్యూనిస్టులు అవలంబిస్తున్న ధోరణి అంత ఉత్సాహజనకంగా లేదని డల్లెసు చెప్పాడు. భవిష్యత్తు ఎల్లా వుంటుందో చెప్పలేనన్నాడు.

కర్నూలు కలెక్టరు ఆంక్షలు

దేశముఖ్ దంపతులను కార్మికులు కలుసుకొనరాదట

కర్నూలు, జూన్ 5

తుంగభద్ర ఇండస్ట్రీస్ కార్మికులు కాని, వారి ప్రతినిధులు కాని శ్రీ దేశముఖ్ దంపతులను కలుసుకొనడానికి వీలులేదని కర్నూలు కలెక్టరు ఆంక్ష పెట్టాడు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశముఖ్, ఆయన సతీ శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ఇక్కడకు వచ్చి ప్రస్తుతం బిల్లా అతిథి గృహంలో బసచేసివున్నారు.

వారికి తమ కష్టనిష్ఠూరాలను విన్నవించుకొంటూ ఒక మెమొరాండం సమర్పించుకొనడానికి నేడో రేపో

(మిగతాది 4 వ పేజీలో)

తీరు - తెన్నులు

ఫ్రెంచి ఇండియా విముక్తి పోరాటానికి నాయకత్వం వహించవలసివున్న కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ వి. సుబ్బయ్యగారికి అభినందనాలు తెలుపుతూ ఫ్రాన్సుదేశపు కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యాలయంనుండి లేఖ వచ్చింది. ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం సాగించుతున్న భారత దేశభక్తులను ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ బలపరుస్తుందని ఆ లేఖలో స్పష్టపరచబడింది.

ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ దినపత్రిక "లాహ్యూమనైట్" కార్యదర్శి మిస్సెస్ జాయుక్ శ్రీ సుబ్బయ్యగారి లేఖకు జవాబువ్రాస్తూ ఫ్రెంచి ఇండియా విముక్తి పోరాటవార్తలను తమపత్రిక పూర్తిగా ప్రకటించుతూందని తెలియజేశారు. ఫ్రెంచి ఇండియా ప్రజల జాతీయ ఆకాంక్షలను తమపత్రిక నిరంతరం బలపరుస్తుందని తెలుపుతూ, ఫ్రెంచి ప్రజలతరఫున అభివందనాలను అందజేశారు.

ఈ లేఖలు ఫ్రాన్సుదేశపు కార్మికవర్గపార్టీ అయిన కమ్యూనిస్టుపార్టీ అంతర్జాతీయ వైఖరికి నిదర్శనం. ఫ్రెంచి సామ్రాజ్యవాదులు వలసదేశాల ప్రజలపై సాగించే దోపిడీకి వ్యతిరేకంగా ఫ్రెంచి కార్మికుల వ్యతిరేకతను యిది సూచిస్తుంది. ఫ్రెంచి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలసదేశ ప్రజలు సాగించే విముక్తి పోరాటాన్ని ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ ఎలా బలపరుస్తూందో ఈ లేఖలు నిరూపించుతాయి.

ఫ్రాన్సుదేశంలోని తక్కిన పార్టీలన్నిటి వైఖరిని పరిశీలించండి! డిగాలిస్టులు కానీయండి, రాడికల్సు కానీయండి, సోషలిస్టులు కానీయండి, మరే యితర పార్టీలైనా కానీయండి! అందరిదీ ఒకటే లక్ష్యం! ఫ్రెంచి సామ్రాజ్యాన్ని ఏదో విధంగా రక్షించుకోవాలనే అవి తహతహలాడుతున్నాయి. కారణం ఏమిటి?

అవన్నీ ఫ్రెంచి సామ్రాజ్యంలోని వలస ప్రజలను దోచుకోవడం ద్వారా లాభం పొందే వర్గాలకు ప్రాతినిధ్యం వహించుతున్నాయి. అందుచేత ఫ్రెంచి సామ్రాజ్యాన్ని ఏదో ఒక మిషతో రక్షించుకోవాలని చూస్తున్నాయి. వలసదేశాల ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను రక్తపుటేరులలో ముంచివేసి, గుత్త వ్యాపారుల దోపిడిని కొనసాగించడానికి తమ దేశ ప్రభుత్వానికి సాయపడుతున్నాయి.

ఫ్రెంచి కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టుపార్టీ అలా కాదు. తమ దేశ గుత్తవ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా అది పోరాడుతోంది. వలసదేశాల స్వాతంత్ర్య పోరాటానికి తోడ్పడుతోంది. వలస దేశాల ప్రజల జాతీయ స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరచడంపైనే కార్మికవర్గ విముక్తి ఆధారపడి వుందనే సత్యాన్ని చైతన్యవంతులైన కార్మికులు ఎరుగుదురు. అందుచేతనే వారు వలసదేశ ప్రజలయెడల సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శించగలుగుతున్నారు.

ఇండోచైనా స్వాతంత్ర్య పోరాటం యెడల కూడా ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ యిదే వైఖరి అవలంబించుతోంది.

అదేవిధంగా బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ కూడా తమ దేశ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వలస దేశాల ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను బలపరుస్తూంది. మలయాలో, బ్రిటిష్ గయానాలో, కెన్యాలో వలసదేశాల ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను అణచివేయడానికి చర్చిల్ ప్రభుత్వం సాగించే దారుణ హింసాకాండను బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ నిరసించుతోంది. వలసదేశాల ప్రజల వీరోచిత పోరాటాలను అభినందించుతోంది.

ఏ సామ్రాజ్యవాద దేశంలోనైనా సరే ఆ దేశపు కమ్యూనిస్టుపార్టీ తన పాలకవర్గానికి వ్యతిరేకంగా వలసదేశాల స్వాతంత్ర్యపోరాటాన్ని బలపరుస్తుంది. దీనికి కారణం ఏమిటి?

సామ్రాజ్యవాద దోపిడి [illegible] నియమం చేసి, ఆ స్థానే ప్రజలందరికీ తిండి, బట్ట, విశ్రాంతి, విద్యావైద్యాలనిచ్చి, సుఖప్రదమైన జీవితాన్ని కలుగజేసే సోషలిస్టు ఆర్థిక విధానాన్ని నిర్మించే విప్లవశక్తి కార్మికవర్గం. సామ్రాజ్యవాదుల దోపిడీనుండి విమోచనం పొందడానికి వలసదేశాల ప్రజలు పోరాడుతున్నారు. అందుచేతనే ప్రధాన కార్మికవర్గం – వలస ప్రజల మధ్య స్నేహం, సౌభ్రాతృత్వం వుంటవి. కార్మికవర్గం యొక్క అంతర్జాతీయతకు అది నిదర్శనం.

◆ ◆ ◆

ఫ్రెంచి ప్రభుత్వానికి ఇండియా ప్రభుత్వానికి మధ్య సాగుతూ వచ్చిన రాయబారాలు విఫలమయ్యాయని తాజా వార్తలు తెలుపుతున్నాయి. ఇండియాలోని ఫ్రెంచి స్థావరాలను భారత యూనియన్‌లో విలీనం చేయడానికి ఫ్రెంచి సామ్రాజ్యవాదులు నిరాకరించారు.

ఫ్రెంచి పెత్తనం సాగుతుండగానే జనవాక్య నిర్ధారణ (రిఫరెండం) తీసుకోవాలని ఫ్రెంచి ప్రభుత్వం పట్టుబట్టింది. ముందు భారతదేశంలో కలిపివేయాలనీ, తరువాత ఇతర సంగతులు ఆలోచించాలని ఇండియా ప్రభుత్వం డిమాండు చేసింది. రాజీకుదరనందున రాయబారాలు విఫలమయ్యాయని ఉభయులూ ప్రకటించారు.

గత మునిసిపల్ ఎన్నికలలో జరిగిన దౌర్జన్యాలను, గూండా చర్యలను గుర్తుంచుకున్నపుడు ఫ్రెంచి ప్రభుత్వపు ఆధిపత్యం వుండగా జనవాక్య నిర్ధారణ సాధ్యం కాదు. అందుచేత ఫ్రెంచి స్థావరాలను ముందు భారత యూనియన్‌లో విలీనీకరణ చేయాలనే ఇండియా ప్రభుత్వపు డిమాండు న్యాయమైనది. దీనిని నిరాకరించడమంటే ఫ్రెంచి సామ్రాజ్యవాదులు 200 యేండ్లుగా సాగించుతున్న తమ దోపిడీని కొనసాగించాలనే దురాశే తప్ప మరేమీ కాదు.

నేడు ఫ్రెంచి సామ్రాజ్యం తూట్లు పడిపోయిన బోటువలెవుంది. అయినప్పటికీ మునిగేవాడు గడ్డిపోచను పట్టుకు వేలాడినట్లుగా తమ సామ్రాజ్యాన్ని రక్షించుకోవాలని ఫ్రెంచిపాలక వర్గం తాపత్రయ పడుతూంది.

శిథిలమై నశించిపోయే గతివుందని చరిత్ర నిర్ణయించిన ఏపాలకవర్గమూ తన పెత్తనాన్ని తనంతటతానే వదులుకోదు. అలాగే ఫ్రెంచి సామ్రాజ్యవాదులు కూడ తమ వలస రాజ్యాలలో ఒక అంగుళాన్ని కూడ వదలుకోడానికి సిద్ధంగాలేరని, ఫ్రెంచి ఇండియా స్థావరాలను గురించి వారి మూర్ఖపు పట్టుదల రుజువుచేస్తూంది.

విప్లవశక్తులు చరిత్రలో అన్ని పాలకవర్గాలనూ నాశనం చేసినట్లుగానే ఫ్రెంచి సామ్రాజ్యాన్ని కూడ నాశనంచేయాలిసివుంది. ఇండో-చైనా, మొరాకో వగైరా ఫ్రెంచి వలసదేశాల ప్రజల విమోచన పోరాటాలు ఒకవైపు నుండి ఫ్రెంచి సామ్రాజ్యపు సంకెళ్ళను బ్రద్దలు చేస్తున్నాయి. రెండో వైపున ఫ్రెంచి కార్మికవర్గం తన పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడుతూ వలసప్రజల స్వాతంత్ర్య పోరాటాలను బలపరుస్తూంది.

అందుచేత ఫ్రెంచి ఇండియా స్థావరాలను భారతదేశంలో విలీనం చేసుకోడానికి ఇదేమంచి తరుణం. ఇండియా ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెడుతూ ఆలస్యం చేయరాదు. ఫ్రెంచిఇండియా ప్రజల పోరాటానికి సహాయపడాలి. నేడున్న అరాచక పరిస్థితిని వెంటనే తొలగించాలి. ఫ్రెంచి సామ్రాజ్యవాదుల దౌర్జన్యాలను యిక కొనసాగనివ్వరాదు. వెన్వెంటనే ఆ స్థానాలన్నిటినీ భారతదేశంలో కలిపివేసి, ఆసియా ప్రజలను విముక్తి చేయాలి. తద్వారా శిథిలమైపోతున్న ఫ్రెంచిసామ్రాజ్యాన్ని ఆఖరుదెబ్బకొట్టి వలసప్రజల విముక్తి పోరాటానికి తోడ్పడాలి.

— కిశోర్

కాంగ్రెసుమార్కుప్రజాస్వామ్యాన్ని బహిర్గతమొనర్చిన ఆంధ్ర శాసనసభ వాల్తేరు సమావేశం

ఏ సమస్యపైనా ఏకాభిప్రాయం లేని మంత్రివర్యుల భంగపాటు

కర్నూలు వేడిని తప్పించుకుందాంగదా అని యీసారి ఆంధ్రశాసనసభ సమావేశం వాల్తేరులో వేసుకున్నాం. వాల్తేరు వేసవిని మరిపించినమాట వాస్తవం. కాని రాజకీయంగా మా సమావేశానికి తీవ్రమైన వేడిగాలి విసురుతూనే వచ్చింది. చివరికి వడదెబ్బతిన్న మంత్రివర్యులు వెంటనే పరిష్కారం కావలసిన సమస్యలపై ఒక దారికిరాలేక తలకొక దారిగా ఛిన్నాభిన్నమై వాల్తేరు విడిచి వెళ్ళిపోయారు.

ఈ సమావేశంలో ప్రజలపక్షాన నిర్విరామంగా నిలబడి పోరాడుతున్న ప్రతిపక్షంముందు ఆంధ్రమంత్రివర్గం నీళ్లుగారిపోయింది. కాంగ్రెసు మార్కు ప్రజాస్వామ్యం పస బయటపడింది.

"అనుగు దండాలతోనూ అపర మొక్కులతోనూ" ఎంతోకాలం [illegible] గడపటం ప్రకాశం మంత్రివర్గానికైనా అసాధ్యమైన పనే. మొక్కుబళ్లూ, ముఖమాటాలూ తీర్చవలసివచ్చేసరికి తడిసి మోపెడై మంత్రివర్గం విరగబడి కూర్చున్నది. చుక్కాని లేని నావవలె ఆంధ్ర ప్రభుత్వం దిక్కు తెలియక కొట్టుకొంటోంది.

ఓం ప్రథమంగా రాజాజీ తలపెట్టిన పన్నులనే ఆయనపాట్లుగానని ప్రకాశం మంత్రివర్గం తలపెట్టింది. క్రిందటిసారి బడ్జెటు సమావేశంలోనే ఆ నిర్ణయాలను బయటపెట్టింది. కాని యీ సమావేశంలో అనుకున్న రూపంలో అవి రానూలేదు; వచ్చిన రూపంలో ఆమోదం పొందనూలేదు.

అహర్నిశలూ "నిర్మాణ కార్యక్రమం నిర్మాణకార్యక్రమం" అని కలవరించే కాంగ్రెసు ప్రభుత్వం, "ఆగస్టు స్వరాజ్యం" వచ్చింది తరువాత కలిగించిన నీటిసదుపాయాలే బహు స్వల్పం. వాటికి ప్రస్తుతం వడ్డించే నీటితీరువ చాలక ఆ భూమిపై అభివృద్ధిపన్ను వేయాలని ప్రభుత్వం తలపెట్టింది. రెవెన్యూమంత్రి ఆ బిల్లును ప్రవేశపెట్టి సెలెక్టు కమిటీకి పంపాలనిప్రతిపాదించాడు. కమ్యూనిస్టుపార్టీ యీ బిల్లును ప్రతిఘటించింది. ప్రస్తుతానికి యీ బిల్లుపై చర్చకూడా లేకుండా వాయిదాపడ్డది.

బస్సుప్రయాణీకులపై పన్ను ఉపసంహారం

బస్సుప్రయాణీకులపై పన్ను వేయటానికి సమకట్టిన రాజాజీ మంత్రివర్గం ప్రజాందోళనకు తట్టుకోలేక ప్రతిపక్షం పోరు పడలేక ఆ పన్నును బస్సుయజమానులమీదికి మళ్ళించింది. ఆ పన్ను చట్టం చెల్లదని హైకోర్టు తీర్పు యిచ్చింది. అయినా యజమానులపై పనికిరాని పన్నును యిప్పటికే ఆంధ్ర ప్రభుత్వం ప్రయాణీకులపై రుద్దుతోంది. ఈ అక్రమ వసూలును చట్టబద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఒకబిల్లును ప్రకటించింది. కాని ప్రవేశపెట్టలేకపోయింది.

అమ్మకం పన్ను బిల్లు

కమీషను ఏజంట్లను సహితం వ్యాపారస్థుల్నిగా జమకట్టి వారికిచ్చే అమ్మకంపన్ను వసూలు చేయాలనే సూచనతో మరొక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఒకే వస్తువుపై అనేకచోట్ల అమ్మకంపన్ను పడుతోంది. మరొకసారి అమ్మకపు పన్ను వేయటానికీ, కొనుక్కునేధర యింకా పెరగటానికీ యిది దోహదమిస్తుంది. పెట్టుబడి ఏమీలేక కమీషనుదారీ వృత్తిలో వున్న వారందరికి యిది చిక్కు కల్పిస్తుంది. కనుకనే యీ అంశాన్ని ప్రతిపక్షం పూర్తిగా వ్యతిరేకించింది. ప్రభుత్వము ఆ అంశాన్ని బిల్లునుండి తొలగించినందునే ఇతర అంశాలతో నున్న అమ్మకంపన్ను సవరణ బిల్లు శాసనసభ ఆమోదం పొందింది.

దేవస్థాన సవరణ బిల్లు

ఈ బిల్లుమీద చర్చకు వచ్చిన దేవస్థానాలకు సంబంధించిన సవరణ బిల్లులోనూ, పంచాయితీ చట్టం సవరణ బిల్లులోనూ ప్రతిపక్షం కొన్ని ముఖ్యాంశాలను మార్పుచేయ కలిగింది. ఉన్న ఏరియా కమిటీలను సహితం తొలగించి అంతా కమీషనరు చేతుల్లో పెట్టాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం వదులుకోవలసివచ్చింది.

పంచాయితీ – బళ్ళపై పన్ను

మేజరు పంచాయితీలు బళ్ళపైపన్ను వేయాలనే నియమాన్ని తొలగిస్తూ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టింది. ప్రతిపక్షం పట్టుపట్టిన మీదట, మేజరు పంచాయితీలతో సహితం బళ్ళపైపన్ను వేసే నియమం పోగొట్టి యిష్టాయిష్టాలకు వదలాలనే సవరణ చేర్చబడ్డది.

తిరుపతి విశ్వవిద్యాలయ బిల్లు

ప్రాంతీయ దురభిమానాలను పెంపోషించి, తద్వారా తమ మనుగడను నిలుపుకోవాలనే తలంపుతో మంత్రులు తిరుపతిలో గురుకుల విద్యాలయంగాక అనుబంధవిశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని సంకల్పించారు. పవిత్ర పదజాలం చాటున యీ సత్యాన్ని మరుగుపరచటానికి మంత్రులెంత ప్రయత్నించినా వ్యర్థమైనది. చివరికి యిటు కాంగ్రెసు పార్టీలోనూ, అటు ప్రజాపార్టీలోనూ ప్రభుత్వ అనుచరుల్లో కొందరిలోనూ యీ సమస్యపై తీవ్ర వాదోపవాదాలు విభిన్నాభిప్రాయాలు చెలరేగాయి. చిత్తూరు నుంచి శ్రీ [illegible] వరకు అనేకమంది కాంగ్రెసువాదులు అనుబంధ విశ్వవిద్యాలయ స్థాపనకు విముఖత చూపారు. పరస్పర వైరుధ్యాలతో కూడిన రంగధామరావుగారి (వీరే నూతన విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలరవుతారని వినికిడి) రిపోర్టూ, ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలరుగారి అభిప్రాయాలూ ఎవరికీ భ్రమలు కొల్ప లేకపోయాయి. ఈ సమస్యపై ప్రభుత్వ ఓటమి ఖాయం అని తేలిపోయింది.

ఇంతలో పానకంలో పుడకలా సాక్షాత్కరించారు, ప్రజాసోషలిస్టులు. రెండు సంవత్సరాల అనంతరం తిరుపతి విశ్వవిద్యాలయాన్ని అనుబంధ విశ్వవిద్యాలయం చేద్దామనేది వీరి ప్రతిపాదన. ఈలోపుగా రాయలసీమ కళాశాలలు మద్రాసు విశ్వవిద్యాలయానికే అనుబంధంగా వుంటాయి. ఈప్రతిపాదనకు అవకాశవాదం మినహా ఏసూత్రమూ ఆధారంలేదు. ఆచరణలో అనిశ్చిత వాతావరణానికి, అనవసర కష్టాలకూ దారితీస్తుంది. అయినా నాటిగా ఓటమి యెదుర్కొనబోతున్న మంత్రులకు చివరకు యీ అవకాశవాద ప్రతిపాదనే శరణ్యమైనది. రాజీ పేరుతో తమపార్టీలో భేదాభిప్రాయాలున్న వారి నోరు నొక్కి, ఓటు వేయించుకున్నారు. ప్రతిపక్షాన్ని వెన్నుపోటుపొడిచి ఆపత్కాలంలో తమను ఆదుకున్న ప్రజాసోషలిస్టుల సాయంతో 4 ఓట్లు మెజారిటీ తెచ్చుకొని చచ్చి చెడి [illegible] మంత్రివర్గం బయటపడ్డది.

ఒకవైపు ప్రజాసోషలిస్టులు కల్పించే అవరోధాల నెదుర్కొంటూ మరో వైపు వెంకటేశ్వర విద్యాలయ చట్టాన్ని సాధ్యమైనంత ప్రజాస్వామిక పద్ధతిలో రూపొందించటానికి కమ్యూనిస్టుపార్టీ సెలెక్టు కమిటీలోనూ, శాసనసభలోనూ తీవ్ర కృషి చేసింది. మంత్రివర్గానికి మనస్సులో ఏమీ యిష్టం లేకపోయినా రాయలసీమ కళాశాలలను వెంటనే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధ శాఖలుగా చేయటానికి ఒప్పుకోనక తప్పిందిగాదు. గవర్నరు స్థానంలో ప్రధాన న్యాయమూర్తి ఛాన్సలరుగా వుండాలనే ప్రతిపాదన నూటిగా నెగ్గటంతో పాలకులకు తలవంపులైనది. తిరుపతి విశ్వవిద్యాలయ నిర్వహణాను, ఎన్నికలను మంత్రివర్గం వేసిన ప్రాంతీయ పునాదుల్ని తొలగించి అఖిలాంధ్ర స్వరూపం యివ్వటానికి ప్రతిపక్షం కృషి చేసింది.

మద్యపాన నిషేధం

మద్యపాన నిషేధ సమస్యను చర్చించి రామమూర్తి కమిటీ సిఫార్సులపై ఒక నిర్ణయానికి రావటానికి శాసనసభకు వచ్చేసమావేశంలో అవకాశమిస్తామని కర్నూలు సమావేశంలో మంత్రివర్గం వాగ్దానం చేసింది. ఈ సమస్యపై అంతర్గత ప్రతిష్టంభనను తొలగించుకోలేని ప్రకాశం మంత్రివర్గం రామమూర్తి కమిటీ నివేదికను వాల్తేరులో చర్చకు రానీయకుండా చేయటానికి అనేకవిధాల టలాయించింది. అదే సమస్యపై కమ్యూనిస్టుపార్టీ విశ్వాసరాహిత్య తీర్మానాన్ని రంగం మీదకు తేవటంతో తప్పనిసరై మే 27 వ తేదీన రామమూర్తి కమిటీ నివేదికను చర్చించేందుకు అంగీకరించింది.

ఆ రోజు అనధికార దినం. ముఖ్యమంత్రి దానిని అధికారదినంగా మార్చాలని ప్రతిపాదించారు. దానికి సభ అంగీకరించింది. మద్యనిషేధ మంత్రి రామమూర్తి కమిటీ నివేదికను చర్చించమని అధికార తీర్మానం తెచ్చారు. ఆ సూచనలో దానిని ఆమోదించినా, తిరస్కరించినా ప్రభుత్వానికి ఏమీ పట్టవట్టు కూడావచ్చేదేవారి పన్నాగం. కాని శాసనసభ్యుల పుణ్యమా అంటూ "చర్చించిన మీదట ఆ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు జరపాలని తీర్మానించవలసినది" అనే ప్రతిపక్ష సవరణతో సహా తీర్మానం అత్యధిక మెజారిటీతో నెగ్గింది. దీనినుబట్టి పట్టుబడితే తమ బలహీనత ఎక్కడ బజారున పడిపోతుందోనని గాభరాపడి మంత్రివర్గం ఆప్రయత్నం విరమించుకుంది.

"స్వరాజ్యం" వచ్చింతరువాత "ఏం చేశారని" అడిగితే చెప్పుకోటానికి "మద్యపాన నిషేధం" అయినా దొరికేది. ఇప్పుడదీ ఎత్తివేయమనితీర్మానిస్తే చిక్కువచ్చింది. శ్రీ సంజీవరెడ్డి బృందానికి తీర్మానాన్ని అమలు పరచటానికి యిష్టంలేదు. అధికారాన్ని వదిలి పెట్టటానికీ మనస్కరించదు. గట్టిగా అమలు పరచాలంటే ముఖ్యమంత్రిత్వానికే మోసం వస్తుందనుకుంటున్నారు ప్రకాశం పంతులుగారు. కనుకనే ముఖ్యమంత్రీ, ఉపముఖ్యమంత్రీ యిద్దరూకలిసి బుకాయించి అధికారతీర్మానాన్ని అనధికారతీర్మానంగా వ్యాఖ్యానించారు. ఆచరించ గలమో లేదో ఆలోచిస్తామన్నారు. ప్రజల్ని మోసగించటానికే తప్ప, తాము ఆరాధించే "పార్లమెంటరీ ప్రజాస్వామికంలో" వీరికున్న విశ్వాసం శూన్యం అని విదితం చేశారు.

ప్రశ్నోత్తరాలు

ప్రశ్నోత్తరాల సమయంలో ప్రజలు ఆందోళన చెందుతున్న అనేక సమస్యలు వేదికమీదకి వచ్చాయి. కదిరి, జుర్జుకరం పంచాయితీ బోర్డులను గురించి వచ్చిన ప్రశ్నోత్తరాలవలన ప్రభుత్వం, ప్రతిపక్షాలవారు ముఖ్యంగా కమ్యూనిస్టులు ఎన్నికైన పంచాయితీ బోర్డులను రద్దు చేయటానికి ఎట్టి కుంటిసాకుల్ని వెతుకుతున్నదో విదితం అయింది. రెండోవైపు తమ అనుచరులు పంచాయితీ బోర్డుల్లో చేసే అవకతవకలను, అఘాయిత్యాలనూ ఎలాకప్పిపుచ్చుతుందో స్పష్టంగా బయటపడ్డది.

మంత్రులిచ్చే సమాధానాలకూ, వాస్తవాలకూ యేమీ సంబంధం లేదని అనేక సందర్భాలలో విదితమైనది. ప్రజాపార్టీ అభ్యర్థిగా పార్లమెంటు స్థానానికి పోటీచేసి ఓడిపోయిన తులసీరాంగారిని జాతీయాభివృద్ధి బ్లాకు డైరెక్టరుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తరువు యిచ్చింది. కాని సంజీవరెడ్డిగారు లేదని శాసనసభలో సమాధానమిస్తారు. నెల్లూరు మోటారు రవాణా కార్మికుల్ని గురించీ, బీడీ కార్మికుల్ని గురించీ జరిగే దౌర్జన్యాలపైతే సంజీవయ్య గారు చెప్పే సమాధానం వేరొకటిగా వుంటుంది.

ప్రతి జిల్లాలోనూ ఉపాధ్యాయులకు ఉద్వాసన నోటీసులుజారీచేస్తున్న విషయం పదేపదే వాయిదా తీర్మానాల రూపంలో సభావేదికకు వచ్చింది.

శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బంజరు తీర్మానం, రాజకీయ బాధితులకు భూములిచ్చి తెచ్చిన పోరూ, పెన్షన్లూ, యిళ్ళస్థలాలూ, కౌలుదారీ రక్షణచట్టం ఎన్నిసార్లు చర్చకు వచ్చినా "ఆలోచిస్తాం" అనే సమాధానంతో మంత్రులు దాటవేస్తూ వచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రులిచ్చే వాగ్దానాలకూ, "ఆలోచిస్తాం"అనేమాటలకూ బొత్తుగావిలువ లేకుండా పోయింది.

శాసనసభ్యులకు అందచేసిన బిల్లులలో రైతులకు అత్యవసరమైన దేదైనా వున్నదీ అంటే అది ఎస్టేటు సవరణబిల్లు. జమీందారులు అన్యాయంగా ఆక్రమణ చేసుకున్న ప్రభుత్వ భూమికి యిది విముక్తి కలిగిస్తుంది. కాని మంత్రివర్గం చివరినిమిషం వరకూ దీనిని ప్రవేశపెడతాం అని చెబుతూ, వెనక ఏ జమీందారుల పట్టు యిమిడివున్నదో ఏమోగాని, చివరకు శాసనసభలో ప్రవేశపెట్టకుండా కాలం తప్పించింది.

స్పీకరుపై విశ్వాసరాహిత్య తీర్మానం

కర్నూలు సమావేశంలో స్పీకరుపై కమ్యూనిస్టు సభ్యులు విశ్వాసరాహిత్య తీర్మానం యిచ్చారు. అది యీ సమావేశంలో చర్చించవలసింది. 375 మంది వుండగా మద్రాసు శాసనసభలోవున్న నిబంధనలనే మార్చకుండా యిక్కడా వర్తింపచేయటంచేత చర్చకు అంగీకరిస్తూ 50 మంది నిలబడవలసి వచ్చింది. నిబంధనలను స్పీకరు మార్చలేదు. 140 మంది వున్న సభలో బలమైన ప్రతిపక్షంగానున్న కమ్యూనిస్టులూ, స్వతంత్రులూ 44 మంది స్పీకరు ప్రస్తావన

(మిగతా 7 వ పేజీలో)

శ్రీ మోటూరు హనుమంతరావు

తిరువాంకూర్ లేఖ

భూముల తొలగింపుకు వ్యతిరేకంగా రైతుల పోరాటం

జీడిమామిడి తోట కార్మికుల విజయం

తిరువాంకూర్ – కొచ్చిను రాష్ట్రంలో భూస్వాములు రైతులపై దాడి చేస్తున్నకొద్దీ రైతులు సుసంఘటితమౌతున్నారు. కర్షక సంఘంలో రైతులు సభ్యులుగా చేరుతున్నారు. ప్రజా సోషలిస్టుపార్టీ నాయకత్వం వహించే ప్రజా సంఘాలే రైతుల సత్యాగ్రహాన్ని నడుపుతున్నాయి.

భూములనుండి రైతులను తొలగించే ప్రతి ప్రయత్నాన్ని రైతులు ప్రతిఘటిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయం యెదుటనే రైతులు సత్యాగ్రహం చేస్తున్నారు. ఈ పోరాటానికి తిరువాంకూర్ – కొచ్చిన్ కుడియన్ సంఘం నాయకత్వం వహిస్తోంది. ఈ సంఘానికి నాయకుడు ప్రజాసోషలిస్టుపార్టీ సభ్యుడు శ్రీ ఎ. ఎ. [illegible] ఇతను ఆ సంఘం నుంచి రాజీనామా యిచ్చాడు. కారణం ప్రజాసోషలిస్టుపార్టీ అతనిపై ఒత్తిడి తేవడమే!

ప్రజాసోషలిస్టుపార్టీ నాయకత్వం వహిస్తున్న ప్రజాసంఘాల కోర్కెలను కూడా ప్రజాసోషలిస్టుపార్టీ ప్రభుత్వం తృణీకరించడమనేది ఎంతో శోచనీయమైన విషయమని కుడియన్ సంఘ ఉపాధ్యక్షుడు ఎన్. డేనియల్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ప్రజాసోషలిస్టుపార్టీ కార్యాలయం ఎదుట కూడా సత్యాగ్రహం ప్రారంభించగలనని శ్రీ డేనియల్ తన ప్రకటనలో హెచ్చరించాడు. అయితే ప్రజాసోషలిస్టుపార్టీ ప్రముఖుని యీ ప్రకటనను ప్రజాసోషలిస్టుపార్టీ ప్రభుత్వం ఖాతరు చేయటంలేదు. ప్రజాసోషలిస్టుపార్టీ నాయకత్వంక్రిందవున్న కుడియన్ సంఘం సత్యాగ్రహాన్ని నడిపిస్తున్నది. ఈ సంఘం నాలాకాలంనుంచి రైతులను భూములనుండితొలగించరాదనీ, న్యాయమైన కౌలురేట్లను నిర్ణయించాలనీ, పంటభూములనుండి తొలగించబడ్డ కౌలుదార్లకు పరిహారం యివ్వాలనీ నిర్ణయించే ఆర్డినెన్సును ప్రభుత్వంమోదించాలని ఆందోళనచేస్తూ వచ్చింది. ప్రభుత్వ నిరాకరణవల్ల రైతులలో అసంతృప్తి చెలరేగి సత్యాగ్రహంగా పరిణమించింది.

18 వ తేదీన శ్రీ శంకరపిళ్ళె అనే రైతు ప్రభుత్వ భవనంముందు నిరశనవ్రతం ప్రారంభించాడు.

రైతుల విస్తృత పోరాటం

కొట్టారకర [illegible] కర్షక సమ్మేళనం మే 21 వ తేదీన దిగ్విజయంగా సాగింది. పలువురు ప్రతినిధులు సమ్మేళనానికి విచ్చేశారు. సాయంకాలం సైకిళ్ళపై ఊరేగింపు జరిగింది. తిరువల్ల తాలూకాలో మే 23 న బ్రహ్మాండమైన సభ జరిగింది. సత్యాగ్రహం చేస్తున్న రైతు సోదరులకు సహాయం చేయగలమని సభలో తీర్మానం చేయబడింది. నిధి వసూలయింది.

"నెడుమంగడపకుతీ"లో కర్షక సమ్మేళనం శ్రీ కె. బాలకృష్ణ పిళ్ళె అధ్యక్షతన జరిగింది. వివిధ గ్రామాలలోనూ, తాలూకాలలోనూ కర్షక సమ్మేళనములు ప్రారంభింపబడ్డాయి. "మన్నత్తూర్"లో మే 18 న కిసాన్ సమ్మేళనం జరిగింది. వెను వెంటనే రైతులకు కావలసిన అత్యవసర కోరికలను ప్రభుత్వానికి తెలిపి ఒత్తిడి తేవాలని నిర్ణయించబడింది. రైతుల సత్యాగ్రహాన్ని బలపరుస్తూ రైతులపైవున్న కేసులను యెత్తివేయాలని సభలో తీర్మానం చేశారు. కర్షక సమ్మేళన ప్రతినిధులు ప్రధాన మంత్రికి ఒక మెమోరాండం సమర్పించారు. భూస్వాములు రైతులను భూముల నుండి తొలగిస్తున్నారని, దీన్ని వెంటనే అరికట్టాలని వీరు కోరారు. 5 రూపాయల నుంచి 25 రూపాయల వరకు పెంచిన అభివృద్ధి పన్నును రద్దుచేయాలని కోరారు. అడవి భూములకు రైతులు 25 రూపాయలు డిపాజిట్టు కట్టాలనే నిబంధనను సడలించాలని కోరారు.

కర్షక సమ్మేళనం ముందంజ

బ్రహ్మమంగళంలో కర్షక సమ్మేళనం అధ్వర్యాన మహాసభ జరిగింది. తాలూకాలో రైతులపై పోలీసులు కావిస్తున్న దౌర్జన్యాలను అరికట్టాలని, మహాసభ ప్రభుత్వాన్ని కోరింది. పోలీసులు అక్రమంగా 30 మందిపై దొంగ కేసులు బనాయించారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని మహాసభ తీర్మానం కావించబడింది. మార్కెట్టు పన్నులను రద్దు చేయాలని కోరారు.

రైతులను సంఘటితపరచడానికై కిసాన్ కార్యకర్తలు ఒక లక్ష సంతకాలను సేకరించ ప్రయత్నిస్తున్నారు.

చిరయింకీల్ తాలూకాలో మే 18 న జరిగిన కిసాన్ సమ్మేళనం ఒక తిరునాళ్ళవలె సాగింది. శాసనసభ్యులు మాధవన్, మజీద్ ప్రభృతులు మహాసభకు హాజరయారు. శ్రీ ఐ. గోపాలకృష్ణమీనన్ అధ్యక్షత వహించాడు. సాయంకాలం పౌరసభ జరిగింది. సభకు ముందు పెద్ద ఊరేగింపు జరిగింది.

జీడిమామిడితోట కార్మికుల విజయం

క్విలన్‌లోను, చుట్టుపక్కల ప్రాంతాలలోను జరుగుతున్న జీడిమామిడి తోట కార్మికుల పోరాటం జయప్రదమవుతున్నది. అనేక మంది ఫ్యాక్టరీ యజమానులు కార్మికుల కోరికలను అంగీకరించక తప్పలేదు. అందువలన ఆ యా ఫ్యాక్టరీల కార్మికులు తమపోరాటాన్ని ఉపసంహరించుకున్నారు. కొన్ని ఫ్యాక్టరీల యజమానులు కార్మికుల కోరికలు అంగీకరించేందుకు యిష్టపడడంలేదు. తత్ఫలితంగా ఆ ఫ్యాక్టరీలలో పోరాటం యింకా సాగుతూనే వుంది.

ఇత్తికార ఫ్యాక్టరీ కార్మికులు మే 19 వ తేదీన ఫ్యాక్టరీ కార్యాలయంముందు సత్యాగ్రహం ప్రారంభించారు. కిల్లికొల్లూరు అనేచోట మహిళలు సైతం సత్యాగ్రహం ప్రారంభించారు.

మే 21 వ తేదీన కార్మికుల, కార్మిక ప్రతినిధులకూ, ఫ్యాక్టరీ యజమానులకూ మధ్య సంప్రదింపులు ఆరంభ మయాయి. ఈ సమావేశానికి లేబరు ఆఫీసరు కూడా హాజరయాడు. కె. యమ్. కె. ఫ్యాక్టరీ యజమానులు తమ ఫ్యాక్టరీని జూను మొదటి తేదీనుంచి తెరిచేందుకు అంగీకరించారు. జూను మొదటివారంలోపుగానే కార్మికుల కీయవలసిన బాకీలను చెల్లించ ఇత్తికార ఫ్యాక్టరీ యజమానులు అంగీకరించారు. కనుక జీడిగింజలు రాగానే వెంటనే ఒక నెలలోపున తమ ఫ్యాక్టరీ తెరవగలమని కిల్లికొల్లూరు ఫ్యాక్టరీ యజమానులు వొప్పుకున్నారు. ఈవిధంగా రాజీకుదుటంవల్ల ఫ్యాక్టరీ కార్మికులు తమ సత్యాగ్రహాన్ని విరమించారు.

ఇదే రోజున ఇ. సి. జి. ఫ్యాక్టరీ యజమానులకూ జీడిమామిడి తోటల కార్మికులకూ రాజీకుదిరింది. తమకు గల 8 మిల్లులను తెరవగలమని యజమానులు అంగీకరించారు. కార్మికులకు బకాయి పడ్డ భత్యాన్ని వెంటనే యజమానులు చెల్లించే షరతుపై అంగీకారం కుదిరింది.

కొన్నిచోట్ల యజమానుల నిరాకరణ

కాని, కొన్ని ఫ్యాక్టరీలలో యింకా యజమానులు కార్మికుల కోర్కెలను అంగీకరించడంలేదు. అందువల్ల మిగతా [illegible] ఫ్యాక్టరీల కార్మికులు సత్యాగ్రహం చేస్తున్నారు. కొన్నిచోట్ల జీడి కార్మికుల సత్యాగ్రహం యింకా సాగుతూనే వుంది.

కొబ్బరిపీచు కార్మికుల పోరాటం కూడా ప్రారంభమైంది. కొబ్బరిపీచు కార్మికులు తమ కోరికలను యజమానులు వినిపించుకోనందున పోరాటం ఆరంభించారు. మే 19 న 200 మహిళా కార్మికులు [illegible] ప్రదర్శన జరిపారు. ఈ సమ్మె నేటి 28 రోజులనుంచి సాగుతోంది.

మా ప్రత్యేక విలేఖరి

రాజమండ్రి పేపరు మిల్లులో తిరిగి పని ప్రారంభం

రాజమండ్రి, జూన్ 3

ఆంధ్రపేపరు మిల్లులో టర్బైన్ వాల్వులు చెడిపోవటం వలన లోగడ మూసివేయబడింది. తిరిగి ఇప్పుడు యథాప్రకారంగా పనిచేస్తోంది.

విపరీతంగా నిల్వ పడిపోయిన కాగితాన్ని విడుదల చేయుటకు ప్రభుత్వం శ్రద్ధతీసుకోవాలని, లేని యెడల మిల్లు కట్టివేసే ప్రమాదం కలదని కార్మికులు తెలుపుతున్నారు.

వరంగలు జిల్లా ఆంధ్ర మహాసభ సమావేశం

ఖమ్మం, మే 31

ప్రభుత్వ నిర్బంధవిధానానికి గురియై 7 సంవత్సరాల అనంతరం ఆంధ్ర మహాసభ వరంగలు జిల్లా కమిటీ శ్రీ రావిళ్ళ జానకిరామయ్యగారి అధ్యక్షతన నేడు సమావేశమయింది.

వరంగలు జిల్లాను ఖమ్మం, వరంగలు జిల్లాలుగా విభజించుటచేత రెండు కమిటీలు ఏర్పరచి జిల్లా సదస్సులు, ఇతర కార్యకలాపాలు కొనసాగించుటకు అధ్యక్ష ఉపాధ్యక్షులకు అధికారం ఇస్తూతీర్మానించబడింది.

హైదరాబాదులో జూన్ 13, 14 తేదీల్లో జరుగబోవు విశాలాంధ్ర సదస్సును జయప్రదం చేయాలని అన్ని వర్గాలవారికి విజ్ఞప్తి చేయబడింది.

వరంగలు జిల్లా ఆంధ్ర మహాసభ కార్యదర్శి శ్రీ కట్టికొండ నాగేశ్వరరావు, ఖమ్మం మునిసిపల్ చైర్మన్ శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్య పార్లమెంటు సభ్యులు శ్రీ పీసమాదవేని ప్రసాదు, పెండ్యాల రాఘవరావు, శాసనసభ్యులు కర్నాటి క్రిష్టయ్య, కె. యల్. నరసింహారావుగారలు, శ్రీ కొణిదెన సత్యనారాయణ, తెలంగాణా రైతుసంఘ సహాయ కార్యదర్శి శ్రీ మంచికంటి రామకృష్ణారావుగారలు సమావేశానికి హాజరయ్యారు.

ఉప్పర్లపల్లె గ్రామ భూస్వాముల కొంటెఎత్తు

శ్రీ నానే నాయక్‌పై ఎదురు నేరం మోపడానికి కుట్రలు

కర్నూలు, జూన్ 4

కర్నూలుజిల్లా పత్తికొండతాలూకా ఉప్పర్లపల్లె గ్రామ భూస్వాములచే చిత్రహింసలకు గురియైన శ్రీ నానే నాయక్ లేవలేని స్థితిలో హాస్పిటల్లో పడివున్నారు. వారి కుడిచేతి ఎముక విరిగిపోయింది.

నిద్రలోనున్న శ్రీ నానే నాయక్‌ను భూస్వాములు తమ రౌడీలచే ఎత్తించుకుపోయి చితక కొట్టించారనే విషయం విశాలాంధ్ర పాఠకులకు విదితమే.

పైగా యీ భూస్వాములు శ్రీ నానేనాయక్ తమ గొర్రెలను ఎత్తుకు పోయినాడని దొంగకేసు ఒకటి బనాయించడానికి కుట్రలు సాగిస్తున్నారని ప్రజలలో వదంతిగా వుంది.

కృష్ణాసిమెంటు కార్మికసమ్మె నిధి

పలుచోట్ల నుండి విరాళాలు

మంగళగిరి, జూన్ 3

తమ న్యాయమైన కోర్కెలకోసం సమ్మెసాగిస్తున్న కృష్ణా సిమెంటు కార్మికులను బలపరుస్తూ ఈదిగువ విరాళాలు యివ్వబడినవని కార్యదర్శి శ్రీ ఆకుల శివరామకృష్ణయ్యగారు వ్రాస్తున్నారు.

సీతారాంపురం క్వారీ కార్మికులు రు. 116-0-0 శ్రీ పిడికిటి సీతారామయ్యగారు (గుండిమెడ) రు 10-0-0; శ్రీరాములు (కె. సి. వర్కర్సు) 5-0-0; కాజ క్వారీ కార్మికులు (ఎ. సి. సి. లిమిటెడ్) రు 30-0-0; కాజ ఆంజనేయులు రు 10-0-0; చిర్రావూరినుండి 20-0-0; విజయవాడ మహిళాసంఘం రు 5-0-0; కుంచనపల్లి గ్రామంనుండి రు 16-6-0; ఐ. ఎల్. టి. డి. కంపెనీ (మంగళగిరి) నుండి రు 33-0-0.

1954 జూన్ 6 ఆదివారం
జయ సంవత్సర
జ్యేష్ఠ శుద్ధ
షష్ఠి తె. 3 – 40
ఆశ్లేష రా. 7 – 37

జీవితచిత్రీకరణపట్ల రచయితల బాధ్యతలు

నూతన కథావస్తువులకు నూతన సాహిత్య రూపకల్పన

ప్రామాణిక రచయితల నుండి అలవర్చుకోదగు శిల్పపద్ధతులు

కార్మిక సమస్యలకు చెందిన కథావస్తువును పరిగ్రహించి దానికి అక్షరరూపమివ్వడం ఎంతో బాధ్యతాయుతమైన కార్యమనీ, పాత్రలనువాటి వ్యక్తిగత జీవితంనుంచి విడదీసి సృష్టించడంవల్ల ప్రయోజనం శూన్యమనీ, పాత్రను మాంసలంగా సృష్టించడమంటే ఆపాత్రను ఆకాశానికెత్తడం కాదనీ, సుప్రసిద్ధ సోవియటు సాహిత్యవేత్త ఇల్యాఎహ్రెన్‌బర్గ్ పేర్కొంటూ, నూతన కథావస్తువుకు నూతన కావ్య రూపాలు అవసరమని స్పష్టీకరిస్తున్నాడు.

బూర్జువా ఫ్రాన్సుకు చెందిన ఆధునిక నవలలను చదువుతుంటే, ఒక కోణంద్వారానే పాత్రలను ప్రదర్శించుటద్వారా రచయితలు వాటిని ఎలా నాశనం చేస్తున్నదీ మనకి స్పష్టమవుతుంది.

జయప్రదంకాని సోవియటు నవలలో- నేనిదివరకే ప్రస్తావించిన ఆ నవలలో - (అయితే ఈ నవల ప్రచురించబడలేదు) రచయిత వెంటనే నాయికానాయకుల వృత్తిని బయటపెడతాడు. (సమాజంగానే ఇందులో మూడో వ్యక్తి లేడు.) కథానాయికా నాయకులిద్దరూ ఒక ఉక్కు పరిశ్రమాగారం (ఫౌండ్రీ)లో పనిచేస్తారు. కథానాయిక మంచి సాహసంగల వ్యక్తి, నూతన విధానాలను కనిపెట్టే వారికి ప్రతిబింబం. కథానాయకుడు చిత్తశుద్ధి గలవాడే కాని కొంత వెనుకంజ వేసేవాడు. 100కి అరుపాళ్లు ఖర్చును తగ్గించే కొత్త ఉత్పత్తి విధానాన్ని కథానాయిక ఆలోచించుతుంది. కథానాయకునికి అందులో విశ్వాసంలేదు. ఉత్పత్తి విషయమై జరిగిన సమావేశాన్ని రచయిత విపులంగా వర్ణించుతాడు. కథానాయిక చొరవను ఒకముసలి ఫోర్మన్ ప్రశంసించుతాడు. నిరాశావాదియైన ఇంజనీర్ మాత్రం, ఈ కొత్త పద్ధతి సరియైందేనా అని సందేహించుతాడు. రాజధానీ నగరంనుండి ఒక ఉపసంఘం వస్తుంది. ప్రాంతీయ కమిటీ ఒక సమావేశంజరుపుతుంది. చివరకు కథానాయిక కొత్తపద్ధతిని అంగీకరించుతారు - ఇవన్నీ రచయిత వివరంగా వర్ణించుతాడు. ఈ ఘటనలతో ఉత్సాహ పడిన కథానాయకుడు, కథానాయికను అభినందించుతాడు. కథానాయిక సిగ్గుపడుతూ: ఇలా అన్నట్లు రచయిత తెలియ జేస్తాడు.

"గ్రిషా! మనం ఇంకా కొంతకష్టపడి పని చేయాలి." తర్వాతి అధ్యాయంలో, వీరిద్దరూ తమ వంతు పనిని పూర్తి చేయడమేగాక ఇంకా ఎక్కువ కూడా చేస్తారు. రెండో విషయం వీరికో కొడుకు పుడతాడు.

ఈ కథానాయిక నాయకు లిద్దరూ మొదట ప్రేమించు కొంటారు. కథానాయిక సూచించిన నూతన ఉత్పత్తి విధానంపై విభేదాలు సమసిపోగానే, వారిద్దరూ పెళ్ళిచేసుకొంటారు.

పాత్రలను జీవితం నుంచి దూరం చేయరాదు

కార్మిక సమస్యలకు సంబంధించిన ఇతివృత్తాన్ని (థీమ్) తీసుకోడం చాలా బాధ్యతాయుతమైనపని. పైగా కొత్త ఇతివృత్తం కూడా. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులను పీడగా చూస్తారు. రోజూ పనిచేసే గంటలు తగ్గించాలని ఆశించే స్వాప్నికులుగా మాత్రమే అక్కడచూస్తారు. మన సమాజంలో శ్రమను హర్షించుతారు. నిర్మాణాత్మక కృషిగా ఎంచుతారు. పనిచేయడం తమజీవితంలో ఒక నిరుత్సాహకరమైన విషయంగా చూసే పాత్రలతో మనసమాజాన్ని చిత్రించే నవలలను మనం ఊహించలేము. అందుచేత పైన నేనుచెప్పిన నవలాకారుని తప్పులు ఉక్కుఫౌండరీని, నూతన పద్ధతులను, నాయికీనాయకుల అభిప్రాయభేదాలను వర్ణించడంవల్ల కలగలేదు. అదంతా వర్ణించాల్సిందే.

కాని రచయిత తన పాత్రలను వాటి వ్యక్తిగత జీవితాలనుంచి దూరంచేశాడు. కథానాయకునికి నాయిక పట్లగల ప్రేమను ఏదో యాదాలాపంగా సూచిస్తాడు. ఒక అధ్యాయంలో నూతనంగా జనించిన శిశువు ఏడుపును మనం హఠాత్తుగా గమనించుతాం. నిష్కపటంగా చెప్పాలంటే ఆ నవలలో మనన్ని కొద్దిగా విభ్రాంతుల్ని చేస్తుంది శిశు ఆక్రందన. తన పాత్రలను ఔన్నత్యానికి కొనిపోతున్నానని రచయిత భావించాడు. వాస్తవానికి అలాగా పాత్రలను కొంచబరిచాడు. ఆ పాత్రలలో గంభీరత, క్లిష్టభావాలు లేకుండా చేశాడు. ఉద్వేగభావాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయలేదు కూడా.

పాత్ర సృష్టిలో యోచన: విస్తీర్ణత

అలాంటి నవలలు ప్రచురితమయ్యాయి. కొన్ని అనేక ముద్రణలు కూడా వెలువడ్డాయి.

బొగ్గు, ఉక్కు, రాలిలో మొదలైన విషయాలను చర్చించే ఉన్న విగ్రహాల పాత్రలను నటకులు ధరించవలసి వచ్చే నాటకాలు కూడా కొన్ని వున్నాయి. అలాంటి నాటకాలను నీచంగా) క్రింది చూపు (చూచేవారు ప్రేక్షకులు. (ప్రేక్షకుల స్థానాలు రంగస్థలం కంటె క్రిందిగా వున్నప్పటికీ) ఆ రంగంలో ప్రదర్శించబడిన ప్రజలను అనాగరిక (ప్రిమిటివ్) ప్రజలుగా ఎంచేవారు.

సోవియట్ ప్రభుత్వం ఏర్పడిన 33 ఏండ్ల ఈ కాలంలో మన అత్యుత్తమ రచయితలు, అనేక సజీవ పాత్రలను నూతన సమాజంకోసం పోరాడిన వారనీ, లేక ఆ సమాజాన్ని నిర్మించుటలో తోడ్పడినవారినీ, సృష్టించారు. మన సమకాలికులను-వారి అంతరంగిక ప్రపంచం చుట్టూ ఒక పరిధి చుట్టి-చిత్రించిన నవలలు, చిన్న కథలూ అనేకం ఎందువలన ఉంటున్నాయి?

ఈ తప్పుకు కొంతవరకు బాధ్యత కొందరు విమర్శకులు, సమీక్షాకారుల, సంపాదకుల (దురదృష్టవశాత్తు అనేకమంది!) పైన వుంది. ఒక పాత్రనుసరళంగా సృష్టించడం అంటే, అతనిని ఆకాశానికి ఎత్తాలనేవారు. ఇతివృత్తాన్ని లోతుగానూ, విశదంగానూ వర్ణించితే దానిని నిందించేవారు. ఇప్పటి దాకా వారికి ఇది అలవాటయింది.

ప్రేమ: గేయకవిత

మన పత్రికలు ప్రేమ కవితను చాల సంవత్సరాలుగా దాదాపు అచ్చువేయలేదనే చెప్పవచ్చు. బాలబాలికలు పెరిగారు. వయస్కులయ్యారు. ప్రేమించుకొన్నారు. బాసలుపడ్డారు సుఖాన్ని పొందారు. కాని ఇది కవితలో ప్రతిబింబించలేదు. పునర్నిర్మాణ సమయంలో, వీరోచితకృషి జరుగుతున్న సమయంలో మరో ఇతివృత్తానికి తావులేదని మీరనవచ్చు.

"దానినిగురించి" ("About that") అనే కవితను మాయకోవస్కీ వ్రాసినప్పుడు అదేమంత మామూలు సమయంకాదు. ప్రేమ ఇతివృత్తాన్ని కూడా ఉన్నత స్థాయికి కొనిపోవచ్చుననీ, భవిష్యత్తును గురించే కనే కలలతో దానిని జోడించవచ్చుననీ మాయకోవస్కీ నిరూపించాడు.

మన ప్రచురణాలయాలు, పత్రికలు గేయకవితను (లిరిసిజమ్) వదలి వేసినపుడు మన రేడియో తరచుగా పుష్కిన్, లెర్మొంటోవ్ ల ప్రేమకవిత్వం నుండి, ఎ. కె. టాల్‌స్టాయ్, ఫెట్, రాట్ గోసెల గేయాలను తీసుకొని ప్రసారం చేయడం గమనించవలసిన విషయం. రాట్ గోస్ గేయాలలో నేగాని ఆధునిక కవితలో తమ మనోభావాలను మన ప్రేమికులు ఎందుకు చూడలేక పోయారు? ఇలా నేనింకా ప్రశ్నించుకొంటూపోవచ్చు. మన చిన్న కథలలో ప్రేమికుల తగాదాలుగాని, కుటుంబ కలహంగాని, వ్యాధిగాని, బంధు మరణంగాని, చెడ్డ వాతావరణంగాని, అరుదుగా కన్పించుతాయేం? ("మంచి వేసవి రోజుల", "మేలో సుగంధ మారుతం వీచే సాయంత్రాన" "ఆకురాలు కాలంలో వినీల ప్రభాతాన" ఇలాసాధారణంగా మొదలౌతాయి వర్ణనలు.)

భగ్న ప్రేమ, ప్రేమించిన వ్యక్తులను కోల్పోవడం మొదలైన విషయాలను వర్ణించడం పనికిరాదనీ, మన ప్రజల వీరోచితకృత్యాలను, తాత్వికంగా భవిష్యత్తులో మనకుండే ఆశావాదాన్ని మాత్రమే వర్ణించాలనీ, ఇప్పటికీ కొంతమంది విమర్శకులు అమాయకంగా భావిస్తున్నారు.

నూతన సమాజ ప్రజలను, నిజమైన ప్రజలను, క్లిష్టమైన, సంపదవంతమైన పరిపూర్ణమైన జీవితం కొనసాగించే ప్రజలను, (అంతేగాని బాహ్యస్వరూపం మాత్రం కన్పడే (స్కీమెటిక్) వ్యక్తులనుగాదు) చిత్రించవలసిన కఠినమైన బాధ్యత మనపై బడింది. కఠినమైనదైనా ఈ బాధ్యత మహత్తరమైనది.

ఇల్యా ఎహ్రెన్ బర్గు

నేర్చుకోవడం అంటే అనుసరణగాదు

రచయిత శిల్పాన్ని గురించి చెప్పేటప్పుడు తరచుగా నేను గత కాలపు రచయితలను పేర్కొన్నాను. వారి నుండి మనం నేర్చుకోవలసిందేమిటి? దీనికి సమాధానం సహజంగా ఇదే. గంభీరమైన అమలిన భాష, వాక్య నిర్మాణం, సాహిత్య విధానాలు.

ప్రామాణిక రచయితలనుంచియిదంతా నేర్చుకోవలసిందే. వార్తా పత్రికలలోని దరిద్రభాషతో నవలలను వ్రాయవలసిన పనిలేదు. టాల్‌స్టాయ్ నుండి వ్యక్తి చిత్రీకరణను (Painting of a Portrait) నేర్చుకోవాలి. నవలలో ప్రకృతిని ("లాండ్ స్కేప్") కళ్ళకుకట్టినట్లు చిత్రించగలిగిన శక్తిని తుర్గెనెవ్ నుండి నేర్చుకోవాలి. మితంగా మాట్లాడినా వక్కాణగా వ్యక్తం చేయగలసాధనాలు చెకోవ్ వద్దున్నాయి. అది ఆయన ప్రత్యేకత. ఆయన నుండి నేర్చుకోవలసిన విషయం అది. అసలు విషయాలకు సంబంధించని ఉపకథలను లయబద్ధంగా వర్ణించడంలో గొగోల్ ప్రతిభను మనం అలవరచుకోవాలి. లెర్మొంటోవ్ వచనంలో విపులమైన స్పష్టీకరణ, కవితనుమనం నేర్చుకోవాలి. ఇలాగే ఇంకా చెప్పవచ్చు.

మరొకరి నుండి నేర్చుకోవడం అంటే, వారిని అనుసరించడం అనికాదు. నూతన కథావస్తువుకు నూతన రూపాలు (ఫారమ్స్) అవసరమని నా భావన. 19వ శతాబ్దంలోని నవలలో, వ్యక్తుల, లేక కుటుంబాల చిత్రీకరణ మాత్రమే వుండేది. ఆ నవలలో రచయిత తన పాత్రలను ఒక కథానాయకుని లేక అనేక కథానాయకుల చుట్టూ, గుమిగూర్చేవాడు. నేటి ప్రజా జీవితం, ఒక వ్యక్తి అంతరంగిక జీవితంలో ఒక భాగమే. కథానాయకుడు లేక కథానాయకులతో సంబంధం వుండే అనేక మంది ప్రజలను చిత్రించకుండా, నేను ఒక నవలను - అది మనస్తత్వ చిత్రంతో నవలైనాసరే వ్రాయడం అనూహ్యమైన విషయం.

నవలా నిర్మాణంలో తప్పకుండా ఈ విషయం పనిచేస్తుంది. జీవిత ప్రగతి కూడా మారింది. పెద్ద పెద్ద వర్ణనలతో నిరంతరం పాఠకుల్ని నిలబెట్టే ఘటనలను ఆధునిక నవలలో ఉండటం సహించలేను. తుర్గెనివ్ కు అలా వర్ణించడం సహజమే. కాని నేను అది తెచ్చిపెట్టుకొన్నట్లు (స్టయిలైజేషన్)గా కన్పిస్తుంది.

ప్రామాణిక రచయితలనుండి మనం నేర్చుకోవలసిన విషయం వేరేవుంది. ప్రజలను చిత్రించడంలో ఆ రచయితలు అనుసరించిన పద్ధతులను మనం నేర్చుకోవాలి.

అది యిపుడు అసాధ్యం అనీ,ఇపుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందనీ మీరు అసమ్మతి తెలియజేయవచ్చు.

నిజమే. సోవియటు రచయితలు 19వ శతాబ్దం నాటి రచయితలవంటి వారు కారు. అతని మనస్తత్వం నేను వేరుగా వుంటుంది; అతడు వేరుగా అవగాహన చేసుకొనేది చాలా వున్నది. నేటి సోవియట్ రచయిత చిత్రించే ప్రజలు ప్రామాణికసాహిత్యంలోని పాత్రలవంటి వారు కారు. రూడిన్, లెవిన్ ల లాగా నేటి రచనలలోని పాత్రలు తర్కించవు. చెకోవ్ పాత్ర ట్రోఫిమోవ్ లాగా పని చేయవు. "ముగ్గురు సోదరీమణులు" లాంటి చెకోవ్ రచనలోని కథానాయికల లాగా ప్రేమించవు.

తమ పాత్రలను చిత్రించేటప్పుడు వారిని గురించి తాము చూచినది మాత్రమే వర్ణించి పూరుకొనేవారు కాదు 19వ శతాబ్దపు మహా రచయితలు. కాల దేవతకు వేసిన ముసుగును తొలగించి భవిష్యత్తులోకి చూచేవారు. అయితే వారికి సమాజాభివృద్ధికి చెందిన శాస్త్రీయ సిద్ధాంతం తెలియదు. కాని నేటి యువరచయిత ఎవరికైనా ఆవిషయం తెలుసు. పూర్వగాముల రచయితలు ఎక్కువగా ఊహించవలసి వచ్చేది. అందుచేత తరచు తప్పులు కూడా చేసేవారు. వారి తాత్విక సిద్ధాంతాలు, సామాజిక అభిప్రాయాలు అమాయకంగా, పరిమితంగా, ఒక్కొక్కప్పుడు అబద్ధంగా కన్పించేవి. మానవ సంబంధాల అభివృద్ధి ధోరణిని సోవియట్ రచయితలు నిర్దేశించగలరు; అభ్యుదయకరమైన మనోభావాలను, తప్పక నాశనంఅయ్యేభావాలను వారెరుగుదురు.

రచయితల శిల్పం గురించి మాట్లాడేటప్పుడు తరచుగా నేను మన ప్రాచీన రచయితలను పేర్కొంటాను. అందుకు కారణం ఇది:

తమ సమకాలికులను వారుచెప్పగలిగినంత బాగా నిశితంగా అవలోకించారు. కళలోని వాస్తవికత, మానవుని గాఢంగా అర్థం చేసుకోవడం, సజీవ మానవ వ్యక్తిగా పాత్రలను చిత్రీకరించ గల్గిన శక్తి, మొదలైన వాటిని వారినుండి మనం నేర్చుకోవాలి.

బూర్జువా సమాజంలో వాస్తవికతకు కళకు మధ్య ఎపుడూ అఘాతం వుంటుంది. బూర్జువా యువకుడు ఒకడు ఒక పేద అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని తలచాడనుకోండి. లేదా వర్తకానికి బదులుగా కళా సృష్టి చేయాలని తలచాడనుకోండి. లేదా లాభసాటిచేరం కాని గౌరవవృత్తిని ఏదైనా చేపట్టాడనుకోండి. వెంటనే అతని తండ్రి చిరాకుగా "జీవితం ఏమీ నవలకాదు" అనిఅంటాడు.

ఫ్లాబర్ట్ వ్రాసిన "మదాం బోవారీ" అశ్లీలానికి అసమ్మతి తెల్పిందెవరు? వ్యభిచారిణిగృహాలకు వెళ్తూ, ఉంపుడుకత్తెలను ఉంచుకోడం ఒక ఫాషన్ అని అనుకొనే అదే పెట్టుబడిదారులు. బోటిసెల్లీ చిత్రాలు యువకులను అవినీతిపాలు చేస్తున్నాయని, వాటిని తీసివేయవలసిందని ఇటలీలో కోరిందెవరు? బూతు ప్రచురణలనుకొనే అవినీతిపరులే. చాప్లిన్ ఫిల్ములను అవినీతికరమైనవని అమెరికాలో ఆక్రోశించేదెవరు? ఉన్నతాధికారాలలో వుండి, ఆ అధికారాలతో రక్షణ పొందుతున్న పెద్ద పెద్ద దొంగలూ, బందిపోటు దొంగలూ, తుచ్ఛమైన పనులద్వారా లక్షలాది ధనం సంపాదించే వాళ్ళూ.

బూర్జువా వర్గానికి నీతి నియమాల విషయాలపై తమకొకటీ ఇతరులకు మరొకటీ ప్రమాణాలుంటాయి. మామూలుగా ఉండే పది ధర్మాలు గాక బూర్జువావర్గం పదకొండో ధర్మం ఒకటి తెచ్చి పెట్టింది. (క్రైస్తవ మత ప్రకారం పది ముఖ్య ధర్మాలున్నాయి-అను.) అది: "ధనాన్ని గౌరవించండి" అని. వారికిసంబంధించినంతవరకు ఈ పదకొండవధర్మాన్ని మాత్రం తమకు అట్టిపెట్టు కొంటారు. తుచ్ఛమైన నీతి నియమాలకు వారు అతీతులు. వారు దొంగతనం చేయవచ్చు. అబద్ధం ఆడవచ్చు. నైతికంగా దిగజారిన జీవితం కొనసాగించవచ్చు. హత్య చేయవచ్చు. తమ కొకటీ ఇతరులకు మరొకటీ నైతిక ప్రమాణాలు ఉండాలనే పద్ధతిని సోషలిస్టు సమాజం ఖండించుతూంది.

మర్యాదగా బ్రతకాలని మాటాడుతూనే దొంగతనం చేసేవారూ, ఆత్మవిమర్శ కావాలని చెబుతూ చిన్న నియంతలలాగే వర్తించే వారూ, సత్యాన్ని ప్రేమించుతామని చెబుతూ అపవాదులు వేసేవారూ, మాకూ వున్నారు. అయితే ఇలాంటివారు చాలా అరుదు. ఇలాంటివారిని ఎదుర్కొని మా సమాజం పోరాడుతోంది. మా ప్రజలలో ఏ [illegible] మా దేశంలో ఏ గౌరవనీయుడూ, పైన చెప్పిన రెండు రకాల నైతిక ప్రమాణాన్ని కోరడు. ప్రజలను మోసంచేసే కళలో మా ప్రజలకు అభిరుచి లేదు.

జీవితం నవల లాంటిది, నవల జీవితం లాంటిది అని మా ప్రజలు భావించుతారు. తన పాత్రలను నిజమైన ప్రజలుగా చిత్రించనందుకు ఒక రచయితను సోవియటు పాఠకులు తప్పుబట్టారంటే, అది కొంత ఆలోచించవలసిన విషయమే.

(సశేషం.)



ఒరిస్సా సరిహద్దుల్లోవున్న కొలాబా నదిపై బ్రిడ్జి



జనతావారి 'పరివర్తన'లో కుటుంబరావు, రమణారెడ్డి, యన్. టి. రామారావు

నెల్లూరు

నెల్లూరు-ని యెర్రగడ్డల (ఉల్లిపాయలు) ఉత్పత్తి దారుల వ్యాపారస్తులు సమావేశమై ఒకసంఘాన్ని స్థాపించుకొని రిజిష్టరు చేయించుకున్నారు.

విశాలాంధ్ర

కథానిక

పండుగనాడు

మూలం: ప్రేమచంద్. ★ స్వేచ్ఛానువాదం: శ్రీ వి. సు.

(గత సంచిక తరువాయి)

క్రిందటికిచిమటామీదకన్ను పడింది. కాని ఎవరిద్వారా కానీలేదు. సంబరం నుంచి అప్పుడే [illegible]. తొమ్మిది దాటిపోయింది. ఎండ తీవ్రంగా ఉంది. అందరూ ఇంటికివెళ్ళడానికితొందరగానడుస్తున్నారు. కొన్ని దగ్గిర మంచిపట్టుపట్టినా మళ్ళీ ఎవరూ చిమటాకొనడానికి డబ్బులుసంపాదించలేదు. హామీద్ అసలే గడుసువాడు అందుకనే డబ్బులు అలా దాచుకుంటాడు.

కుర్రగేంగంతా, రెండుపక్షాలయ్యేరు. మొహిసేన్, మహమ్మద్, సమ్మో, నూరే ఒక పక్షం. హామీద్ ఒక్కడే మరో పక్షం అయ్యేడు. వాదించుకోడం మొదలు పెట్టేరు. అందరూ సమ్మోను పక్కకు నెట్టేరు. దేనికీ చెందకుండా ఉండిపోయేడు. మొహిసేన్, మహమూద్, నూరే హామీద్‌కంటే రెండేళ్ళు పెద్దాళ్ళయినా అతని మాటలకు వెనక్కు జంకుతూనే ఉన్నారు. అతని దగ్గర నైతిక శక్తి న్యాయబలం ఉన్నది. మట్టిబొమ్మలు లోహంముందు అందులో ఉక్కుముందు ఏం నిలుస్తాయి? ఇక చిమటాను జయించేది లేదు,తుక్కురేగ్గొడుతుంది.సింహం వచ్చిందంటే నీళ్లు మోసే మహాశయుడు భయంతో వణికిపోతాడు. సిపాయిగారు మట్టి తుపాకీ పారేసి పరుగుచ్చుకుంటాడు.

వకీలుగారు భయంతో బిక్కచచ్చి లాంకోట్‌తో ముఖం మూసుకుని నేల మీద బోర్లపడతాడు. కాని, చిమటా ఈ వీర ధీర చిమటా సింహంలా మీదికి దూకుతుంది; దాని రెండు కళ్లు పీకుతుంది.

మొహిసేన్ గట్టిగా అన్నాడు: "బాగుంది. నీళ్ళుమోసుకు రాలేదా?" హామీద్ చిమటాఎత్తిపట్టుకుని-"ఒక్కకసురు కసిరితే, నీ నీళ్ళకావటోడు పరుగెత్తి ద్వారంవద్ద నీళ్ళ కావడితో పడతాడులే."

మొహసేన్ ఓడిపోయిన ముఖం పెట్టేడు. కాని అంతలో మహమ్మద్ సాయం దొరికింది - "పాపం కుర్రాడు కోర్టు దగ్గర దొరికితే ఖైదులో పెట్టించేస్తాడు. అప్పుడు వకీలుగారికాళ్ళమీద పడవలసిందే."

హామీద్ ఈ గట్టితర్కానికి జవాబివ్వలేక పోయేడు. కాని, "మనల్ని పట్టుకోడానికి వచ్చేవాడెవడోయ్"అని మాత్రం అన్నాడు. నూరే గర్వంగా తుపాకి పట్టుకున్న "నా సిపాయి"అని ఉవ్విళ్ళూరాడు.

హామీద్ముఖం చిట్లించుకొన్నాడు. "ఒరేయ్ కుర్రకుంకా! మనం పట్టుకున్నది వీరనూన ఆయుధం. రా, దీంతో కుస్తీ ఎలాగుంటుందో రుచి చూడు. దీన్ని చూడగానే నీ సిపాయి వెక్కి పారిపోతాడు. ఇక పట్టుకొండే దెవడు?"

మొహిసేన్‌కు బలే ఆలోచనతట్టింది "నీ చిమటా ముఖం ఎప్పుడూ అగ్గిలో నేగా కాలేది. దీనితో ఇక హామీద్ మళ్ళీ మాట్లాడడుకదా అనుకున్నాడు. కాని అలాజరగలేదు. హామీద్ వెంటనే జవాబిచ్చాడు - "అగ్గిలో బలవంతులే హాయిగా గెంతగలరు. మహాశయా! మీ వకీలు, సిపాయి, నీళ్ళు మోసే వాడూ వెధవలు ఇంట్లో దూరి కూచుంటారు. ఆ[illegible] వీర్లంచేయగలరు. ఈఅగ్గిలో దూకవలసి వచ్చినా, మన శూర వీర చిమటా దూకాలిగాని!"

మెహమూద్ ఉడికిపోయి గట్టిగా వాదించేడు - "వకీలుగారు కుర్చీ బల్లా వేసుకొన్కుచుంటారు. నీ చిమటా వంటగదిలో నేలమీదేగా పడుండేది"

ఈ వాదనతో సమ్మోకి, నూరేకి కొంచెం బలమొచ్చింది. ఎంత బలేగా వాదించేనాడు అనుకున్నారు. అవును చిమటా వంటగదిలో పడుండక ఇంకెక్కడ పడుంటుంది!

ఆఖరుకు హామీద్ సమాధానం సరిగ్గా అందుకోలేదు. "నా చిమటా వంటగది ఉండక ఇంకెక్కడుంటుందోయ్" అనేసేడు. ఇక అందరూమీదపడిఉడికించడం మొదలు పెట్టేరు. హామీద్ మళ్ళీ అన్నాడు - "వకీలుగారు కుర్చీమీద కూర్చుంటే క్రిందికి పడతన్నుతుంది, వాడిపుస్తకాలు వాడిపొట్టన పెట్టుకొంటాడు" అయినా మాట సరిగ్గా అతకలేదు. కట్టెకీచులాటలాగుంది. అందరూ "పొట్టన పెట్టుకోడమంటే" అని గుసగుసలాడేరు. ముగ్గురు ప్రతిపక్షనీయులూ మూతులు బిగించేరు. వాళ్ళను చూస్తూంటే ఒకపక్షం వాళ్ళు మరోపక్షాన్ని వాదిస్తూన్నట్టుగాఉంది.

చట్టం నోట్లోంచి తిరిగి వచ్చేవస్తువే, నిజంగా 'పొట్టలో పెట్టినట్టయితే' ఈ అర్థంలేనిమాట కూడ అదో విచిత్రంగా వుంది. హామీదు చిమటా నేలమీద కొట్టేడు. అతని చిమటా చాలబలమైనది. దీనికి మొహిసేన్, మహమ్మద్, నూరే, సమ్మో, ఎవరూ అడ్డు చెప్పలేరు.

గెలిచిన వాళ్ళకు, ఓడిన వాళ్ళ నుండి ఎలాంటి గౌరవం వస్తుందో అలాంటి గౌరవం పొందినట్టు ఆనందిస్తున్నాడు హామీద్. అందరూ మూడేసణాలు నాలుగేసణాలు ఖర్చు పెట్టేరు. కాని ఒకళ్ళు సరుకు కొనుక్కోలేక పోయేరు. హామీద్ మూడు డబ్బులతో ఇన్నిగొప్ప కబుర్లు చెప్పగలుగుతున్నాడు. అవును, నిజంగా బొమ్మలు కొనుక్కోడమెందుకూ కొన్నేటికి విరిగి ముక్కలవుతాయి. హామీద్ చిమటా కండేళ్ళయినా ఉంటుంది!

మొహసేన్ నెమ్మదిగా అన్నాడు- "కొంచెం నీచిమటా చూడనీయవోయ్, ఎలా ఉందో చూస్తాను పోనీ నా నీళ్ళ కావటివాణ్ణి చూడు!" మహమూద్, నూరే కూడ వాళ్ళబొమ్మల్ని అలాగే చూపించేరు.

హామీద్‌కు ఆ శరతుకు అభయమివ్వవలసిన అవసరంలేదు. ఒకళ్ళ తరవాత ఒకళ్లు చిమటా చూశారు. అలానే హామీద్ ఒకటితరవాత ఒకటి అందరిబొమ్మలూ చూశాడు. ఎంతఅందమైన బొమ్మలు!

హామీద్ ముఖం ఓడిపోయిన వాడిలా అయింది. వాళ్ళ బొమ్మలు చూస్తుంటే ఉక్రోషం ఉబుక్కొస్తుంది. ఈ బొమ్మలూ, చిమటా ఒకటే ఎలా అవుతాయి అనుకున్నాడు.

మొహిసేన్ అన్నాడు - "ఇక ఈ బొమ్మలంటే నాకేమి నచ్చడంలేదులే."

మహమూద్-"అవునోయ్, ఇవి అప్పి చిత్తగొట్టుకోడానికి తప్ప ఎందుకూ. వీటిల్ని చూడగానే ఇంత గొప్ప బొమ్మలే దొరికేయా అంటుందిలే అమ్మ"

హామీద్‌కు చాల సంతోషంగా ఉంది. చిమటాను చూసి తనవానమ్మ సంతోషించినట్టు వాళ్ళమ్మలు వాళ్ళు తెచ్చిన బొమ్మలు చూసి సంతోషించరని. మూడుడబ్బులతో వాళ్ళకంటే నేనే మంచి వస్తువుకొన్నాను. వాళ్లు డబ్బులు అనవసరంగా పాడుచేసుకున్నారు కదా అనుకుంటున్నారు. నా శూర వీర చిమటా అన్ని బొమ్మలకు రాజుగారన్నమాట!

దారిలో మహమూద్‌కు ఆకలివేసింది. వాళ్లనాన్న తినడానికి అరటిపళ్లిచ్చేడు. మహమూద్‌హామీద్ చట్టాకట్టాపెట్టేడు; మిగత అందరూ ఉడుక్కున్నారు. ఇదంతా ఆ చిమటా మహాత్యమే!

3

పన్నెండు గంటలకు ఊరంతా గోలగా ఉంది. ఉత్సవంనుండి అంతా వస్తున్నారు. మొహిసేన్ చెల్లెలు పరుగెత్తుకుంటూ వచ్చి కావటివాడు బొమ్మ చేతిలోంచి ఎత్తుకుపోయి పరుగెత్తింది. సరదాగా గంతులేసింది. ఆ పాప పడిపోయింది. దానితో కావటివాడూ క్రిందపడి చచ్చేడు. దానితో అన్నాచెల్లెలూ తన్నుకోడం మొదలు పెట్టేరు. ఇద్దరూ గట్టిగా ఏడ్చేరు. ఈ గోల వాళ్లమ్మకు వినబడడంతో ఆవిడకు కోపంవచ్చింది. ఇద్దరికీ చెరో నాలుగూ ఉతికింది.

నూరేగారి వకీలుగారికి మరీ గౌరవం జరిగిందిలేండి. వకీలుగారు గూట్లో తప్ప క్రింద కూర్చోరుగా! చాల గౌరవమైనవారు. ఆయన గొప్ప ఎలా నిలబెట్టాలీ అని ఆలోచించేడు. గోడకి రెండు మేకులు కొట్టి కూటీ తయారు చేసేడు. దానిమీద చిన్నపీట అమర్చేడు. దానిమీద కాగితాలు పరిచేడు. వకీలు గారిని భోజమహారాజుగారిని సింహాసనంమీద కూచోబెట్టినట్టు కూచోబెట్టాడు. ఇక వకీలుగారికి విసనకర్రతో విసరడం మొదలు పెట్టేడు. కోర్టులో కట్టికెళ్ళచాప ఎలక్ట్రీపంకా ఉండేటట్టే అమర్చేడు. మరి సాధారణంగా అమర్చేడా! న్యాయ విచారణలో వకీలుగారి బుర్రవేడెక్కిపోదూ మరి! వెదురు విసనకర్రతో విసరడం మొదలు పెట్టేడు. ఎలా తగిలిందో విసనకర్రతగిలింది. దానితో స్వర్గంనుంచి నరకంలోకి పడ్డట్టు పడ్డాడు. మట్టిలో కలిసిపోయేడు. కాసేపైన తరవాత ఏడ్చిమొత్తుకుని వకీలుగారి అస్థికలు పెంటమీద పారబోసేరు.

ఇక మహమూద్ సిపాయివున్నాడు. ఆయన గ్రామంలో కాపలా కాయడానికి ఛార్జీతీసుకున్నాడు. పోలీసు సిపాయంటే మామూలు మనిషికాదు. అందరూ ఆనికాళ్ళక్రింద బంగాదూర్. ఆయన పల్లకీమీద వస్తారు. ఒకబుట్టలో చిరిగిగుడ్డలు పత్తుగావేసి సిపాయిగారిని విశ్రాంతిగా పడుకోబెట్టేడు. రాత్రికి ఆయన అందరు సిపాయిల్లాగే పహారా ఇస్తాడు. "దొంగలు జాగ్రత్త! మెలకువగా ఉండండి." రాత్రంతా ఇలాగేఅరుస్తాడు. మహమూదు బుట్టలో పెట్టేడు. బుట్ట చేతికి తగిలి జారిపడింది. సిపాయిగారు తుపాకీతో సహా క్రింద పడ్డారు. క్రింది భాగం పగిలి వికలాంగు డయ్యేడు.

మహమ్మద్ కొక డాక్టరు జ్ఞాపకం వచ్చేడు. అతని దగ్గర ఉండే ఆయింట్‌మెంటుతో చటుక్కున అంటుకు పోతుంది పోయిన భాగం. అతికించడానికి అత్తిపాలు కావాలి. సరే అత్తిపాలు కూడా వచ్చేయి. విరిగిన ముక్క కూడా అంటుకుంది. అంటుకొందో లేదో అని నిలబెట్టేడు. వాడి ఎముకలు సరిగా ఉన్నట్టులేదు. దానితో మరో ముక్క విరిగింది. ఆఖరికి ఎలాగోలా ఒక మూల విశ్రమించేడు సిపాయి. కాని సరిగ్గా కూచోలేడు. సిపాయిగారు సన్యాసయ్యేడు. పాపం అక్కడే కూచుని పహరాచూస్తున్నాడు. అప్పుడప్పుడు దేవతా విగ్రహంలా కనిపిస్తున్నాడు.తలపాగాకు తీవిగావున్న కుచ్చు ఊడిపోయింది. ఇక ఎంత అందంగా వుంటాడో ఊహించుకోవచ్చు. ఇక దానితో మనిషి గుప్పెసు పిట్టయ్యేడు.

ఇక హామీదు గోడవవినండి. హామీద్ హడావుడి వినగానే వాళ్ళమ్మమ్మ పరుగెత్తుకునివచ్చి ఎత్తుకుని ముద్దాడింది. అదుర్పాటుగా అతనిచేతులో చిమటా చూసి ఆశ్చర్యపోయింది.

"ఈ చిమటా ఎక్కడిది?"

"నేను కొన్నాను"

"ఎంతకు?"

(మిగతా 6 వ పేజీలో)

N. C. Z.
స్ప్రే ప్రోసెస్డ్
స్కిమ్ మిల్క్ పౌడర్
N C Z
ఇండియాకు సోల్ ఏజంట్లు:
టి.టి. కృష్ణమాచారి&కో,
మద్రాసు, బొంబాయి,
కలకత్తా, ఢిల్లీ.

రత్నపురుషసేవనం
(WITH CALCIUM & GOLD)
సువర్ణము మొదలగు భస్మములు చేర్చబడినవి. నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, అత్యుష్ణము గుండెదడ, కాళ్ళు తీపులు హరించి బలమును, కాంతిని, నరముల పటుత్వము, ధాతుపుష్టి నిచ్చును.
20 ను. డబ్బి రు. 3-12-0 పోస్టేజి 1-0-0
ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీ టాకీస్ రోడ్డు - విజయవాడ-2.

కార్మిక వర్గ సమైక్యతకు ఉజ్వల సందేశ మందజేసిన అఖిల భారత ట్రేడ్‌యూనియన్ మహాసభ

నిరుద్యోగ నివారణకు కార్మికవర్గ సూచనలు

గత నెల ఆఖరు వారంలో కలకత్తాలో జరిగిన 24 వ అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుమహాసభ కార్మికవర్గ సమైక్యతకు యిచ్చిన సందేశాన్నీ, నిరుద్యోగం మొదలైన సమస్యల పరిష్కారానికి చూపిన మార్గాన్నీ వివరిస్తూ యీ వ్యాసం వ్రాయబడింది. రచయిత ఆంధ్ర ప్రతినిధివర్గంలో ఒక సభ్యుడు.

శ్రీ జోస్యభట్ల సత్యనారాయణ

నిరుద్యోగం, రేషనలైజేషన్, రిట్రెంచిమెంటు, జీతాలకోత మొదలైన విపత్తులు భారత జాతిని సర్వనాశనం చేసే ప్రమాదానికి వ్యతిరేకంగా దేశవ్యాపితమైన పోరాటాలు జరుగుతున్న సమయంలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మహాసభ మే 27 నుండి 30వరకు కలకత్తాలో జరిగింది. ట్రాంవే కార్మికుల సమ్మె, ఉపాధ్యాయుల పోరాటం, బెంగాల్ ప్రభుత్వపు పునాదుల్నే కదల్చివేశాయని చెప్పాలి. బొంబాయి బట్టల మిల్లు కార్మికుల పోరాటం కూడా యిట్టే ఫలితాలనే యిచ్చింది. ఈ పోరాటాలు, యింకా యిదేవిధంగా దేశంలో నలుమూలలా జరిగిన పోరాటాలు, కార్మికులలో వారి నాయకత్వం ఎట్టి పంథా నవలంబించినా ఐక్యతను నెలకొల్పడానికి పునాది రాళ్లయినాయి. ప్రభుత్వం యజమానులు కార్మికవర్గంపై సాగిస్తున్న దాడిని ఎదుర్కోడానికి కార్మికవర్గం పోరాడ్డం తప్ప వేరేమార్గం లేదని అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ యిచ్చిన నినాదం, కార్మికవర్గాన్నంతా కదలిస్తోంది. ప్రజలందర్నీ యీ దుర్భర పరిస్థితులనుండి విముక్తి చేయడానికి కార్మికవర్గం అగ్రగామిగా పనిచేయాలనే సత్యాన్ని కూడా ప్రజానీకం అర్థంచేసుకునేలా పై పోరాటాలు చేస్తున్నాయి.

ప్రభుత్వం కార్మికవర్గంపై పెద్దపెట్టున దాడి ప్రారంభించిన 5 సంవత్సరాల అనంతరం, తిరిగి కార్మికులు తమ సంఘాలను పునర్నిర్మించుకుని శక్తిపునను ఢీకొవడానికి ముందుకు సాగుతున్నారనే విషయాన్ని ఈ మహాసభ రుజువుపరుస్తోంది. నిర్బంధ విధానం వల్ల అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ విచ్ఛిన్నమవుతుందనుకున్న వారికందరికీ యీ మహాసభ ఆశాభంగం కల్గించింది. ఈ సంస్థ బ్రహ్మాండమైన ఐక్యశక్తిగా రూపొందడాన్ని మహాసభకు వచ్చినవారంతా ప్రత్యక్షంగా చూడగల్గారు.

మహాసభకు వచ్చినవారు

ఈ మహాసభ జరిగే సమయానికి అ॥ భా॥ ట్రే॥ యూ॥ కాంగ్రెస్‌లో 6,56,000 సభ్యత్వంగల 937 సంఘాలు అనుబంధించబడ్డాయి. అనుబంధ సంఘాలనుండి 828 మంది ప్రతినిధులు సభకు హాజరైనారు. ప్రేక్షకులు, అనుబంధంకాని సంఘాలనుండి వచ్చిన సౌహార్ద్ర ప్రతినిధులు వెయ్యిమందికి పైగా వున్నారు. వీరిలో జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు, హింద్ మజ్దూర్ సభకు, యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు, అనుబంధించబడ్డ సంఘాల నుండి సౌహార్ద్ర ప్రతినిధులు రావడం, వారు కూడా చర్చలలో పాల్గొనడం, మహాసభకు ధనసహాయంచేయడం గమనించదగ్గ విషయం. అన్ని ప్రధాన పరిశ్రమల నుండి ప్రతినిధులు హాజరైనారు.

మహాసభకు వచ్చిన ప్రతినిధులలోను, సౌహార్ద్ర ప్రతినిధులలోను అత్యధిక సంఖ్యాకులు కార్మికులనుండే రావడం యీ మహాసభకు ఒక ప్రత్యేక లక్షణం అని చెప్పాలి.

దేశంలో ప్రధాన పరిశ్రమలయిన పోస్టు టెలిగ్రాఫ్ వర్కర్సు యూనియన్, పెట్రోలియం వర్కర్సు యూనియన్లనుండి అభినందన సందేశాలు వచ్చాయి. మహాసభకు అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు అనుబంధించబడ్డ సంఘాలలో వివిధ రాజకీయ దృక్పథాలుగల పార్టీలు, వ్యక్తులు నడిపే సంఘాలున్నాయి. ఎన్. ఎమ్. జోషీ, మృణాలకాంతి బోస్‌లు సందేశాలు పంపారు. వివిధ దేశాల కార్మిక సంఘాలుకూడా సందేశాలు పంపాయి.

కలకత్తా కార్మికుల ప్రత్యక్ష సహాయం

కలకత్తా నగరంలో ఏ పరిశ్రమలో పనిచేసే కార్మిక సంఘాలు ఆ పరిశ్రమలో ఉత్పత్తియే సామగ్రిని మహాసభకు సప్లయి చేయడం ఒక ప్రత్యేకత. ఉదాహరణకు సుమారు 8000 మందికి సరిపడే పెండాలు టార్పాలిన్లతో నిర్మించబడింది. పెండాలులో మొత్తం 100 ఎలక్ట్రిక్ పంకాలు, దీపాలు వేయబడ్డాయి. ఆ పంకాలను పరిశ్రమయజమానులు అద్దె లేకుండా యిస్తామన్నా, కార్మికులు, అదనంగా పనిచేసి అద్దె యిచ్చివేస్తామని గట్టిగా యజమానులకు చెప్పారు. రెండణాల బాడ్జీలు మొత్తం 1,00,000 కలకత్తాలోని కార్మికులందరికీ మహాసభ నిధి కోసం అమ్మారు.

హిస్ మాస్టర్సు వాయిస్, కొలంబియా రికార్డింగ్ కంపెనీ పనివారు ఆర్కెస్ట్రా వాయిద్యం వినిపించడంతో పాటు, ధన సహాయం చేశారు. (ఈ యూనియన్, జాతీయ ట్రే. యూ. కాంగ్రెసుకు అనుబంధ సంస్థ). ఇలా అనేక దృష్టాంతరాలున్నాయి.

మహాసభలో పాల్గొన్న స్త్రీ కార్మిక ప్రతినిధులు, ముఖ్యంగా బెంగాల్ జూట్ వర్కర్లు, కోయంబత్తూరు బట్టలమిల్లు వర్కర్లు సభలో చేసిన ప్రసంగాలు మొత్తం ప్రతినిధులందరినీ ఉత్తేజ పరిచాయి.

సమిష్టి చర్చలు

ఈ మహాసభలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు గ్రూపులుగా సమావేశాలు జరిపారు. ఆ సమావేశాలలో పరిశ్రమ పరిస్థితులకు, కార్మికుల సమస్యలకు సంబంధించిన తీర్మానాలను కూలంకషంగా చర్చించారు. ఈ విధమైన చర్చలు ప్రతినిధులకు ఎంతో ఉపయోగపడ్డాయి.

కార్యదర్శి నివేదిక

కార్యదర్శి నివేదికలో దేశమందలి కార్మికుల స్థితిగతులు, గుత్తపెట్టుబడిదార్ల కుయుక్తులు, వివిధ రాష్ట్రాలలో వివిధ పరిశ్రమల్లో కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాలు, వాటి ఫలితాలు సమీక్షించబడ్డాయి. కార్మిక చట్టాలలోని మంచి చెడుగులు చూపబడ్డాయి. కార్మికుల కర్తవ్యాలు వివరింపబడ్డాయి. ఉద్యమ నిర్మాణానికి ఈ నివేదిక చాల ఉపయోగకారి అని ప్రతినిధులంతా భావించారు.

ఐక్య ఉద్యమ నిర్మాణానికి మహాసభ కార్మిక వర్గాని కంతా పిలుపు యిచ్చింది. ఇది ప్రతినిధులను చాలా ఉత్సాహపర్చింది. క్రింది నుండి పైనుండి కూడా ఐక్యఉద్యమ నిర్మాణానికి కృషి చేయాలనీ, కార్మిక హక్కులను కాపాడ్డానికీ, నిరుద్యోగం రిట్రెంచిమెంటు జీతాలకోతకు వ్యతిరేకంగా పోరాడ్డానికీ ఐక్యం కావాలిని హెచ్చరించింది.

నిరుద్యోగసమస్యపై తీర్మానం

నిరుద్యోగ సమస్యపై తీర్మానంలో దేశమంతటా నిరుద్యోగం ఎలా ప్రబలిపోతోందో వివరించి దాన్ని అరికట్టడానికి మార్గాలు చూపబడ్డాయి. నిరుద్యోగభీమా పద్ధతిని అమలు పర్చాలనీ, పరిశ్రమలు మూయడం, రిట్రెంచిమెంటు నిషేధించాలనీ, చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం సహాయపడాలనీ, పరిశ్రమలను పాడుచేస్తున్న మేనేజిమెంట్లను తొలగించి ప్రభుత్వమే అట్టి పరిశ్రమలు నడపాలనీ, నిరుద్యోగుల కుటుంబాలకు ఉచితంగా ఆహార పదార్థాలు సప్లయి చేయాలనీ, బ్రిటిష్ పెట్టుబడిని స్వాధీనం చేసుకోవాలని, మన ముడి సరుకులు మైకా, మాంగనీస్, పుగాకు వ్యాపారాన్ని సామ్రాజ్యవాద దేశాలతోనే కాకుండా, సోషలిస్టు తదితర దేశాలతో కూడా సాగించాలనీ, ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రారంభించాలని, 44 గంటల వారం అమలు పర్చాలనీ, మొదలగు సూచనలు నిరుద్యోగ నివారణకు చేయబడ్డాయి. రైతుల కౌలు, శిస్తు, పన్నుల భారం తగ్గించి వారి కొనుగోలుశక్తిని పెంచాలని బంజర్లను పేద రైతులకు నిరుద్యోగులకు పంచాలని కూడా తీర్మానం కోరబడింది.

రేషనలైజేషన్ పై తీర్మానం

రేషనలైజేషన్‌పై తీర్మానంలో యజమానులు రేషనలైజేషన్ ద్వారా కార్మికుల పని భారాన్ని పెంచి, అనేక మందిని పనులనుండి తొలగించి తమ లాభాలను నిలబెట్టుకోడానికి చేసే కుట్రలను బయటపెట్టడం జరిగింది. రేషనలైజేషన్ స్కీములకు ప్రభుత్వం సహాయం చేయరాదనీ, ప్రభుత్వ పరిశ్రమలలో రేషనలైజేషన్ ప్రవేశపెట్టరాదనీ, అసలు యీ పద్ధతినే నిషేధించాలనీ మానేజిమెంట్లను రేషనలైజు చేసి దుబారాను, లంచగొండితనాన్ని, దపు పెత్తుల్ని, మోసాన్ని అరికట్టాలనీ, జీవితావసర వస్తువులపై పన్నులను తగ్గించాలనీ కోరబడింది.

అయితే ప్రజలకు మేలు చేకూర్చి, కార్మికుల జీవన స్థాయిని పెంచి పనిభారం తగ్గించే యంత్ర మార్పులను మాత్రం అ. భా. ట్రే. యూ. కాంగ్రెస్ బలపరుస్తుందని స్పష్టం చేసింది. దేశవ్యాపితంగా "రేషనలైజేషన్ వ్యతిరేక దినం" జరపాలని కార్మిక వర్గాన్ని హెచ్చరించింది.

సాంఘిక భద్రతను గురించి, స్త్రీ కార్మికుల గురించి, కంట్రాక్టు పద్ధతిని రద్దు చేయడంపైన, యుద్ధోన్మాదులకు వ్యతిరేకంగా శాంతి ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి తీసుకు పోవాలనీ మరికొన్ని తీర్మానాలు చేయబడ్డాయి.

వివిధ పరిశ్రమలకు సంబంధించిన కార్మికుల యిబ్బందులపై సుమారు 50 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఒక తీర్మానంలో నేడు దేశమందలి వివిధ పరిశ్రమల్లో పోరాటాలు జరుపుతున్న (ఆంధ్రలో బీడీ, నూలు, సిమెంటు కార్మికులు) కార్మికులను బలపరుస్తూ తీర్మానించారు.

ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతి

ఎన్నికలలో వివిధ రాజకీయ దృక్పథాలు గల యూనియన్లన్నింటికి ప్రాతినిధ్యం యివ్వడం జరిగింది. ఆంధ్రదేశం నుండి మొత్తం 60,000 మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే 22 మంది ప్రతినిధులు హాజరైనారు. జనరల్ కౌన్సిల్‌లో ఆంధ్రకు 5 స్థానాలు లభించాయి. వాటికి శ్రీ కె. ఎస్. నరసింహాం, ఎస్. వి. రంగారావు, జోగ్రసన్లు, కల్లభరావు, ఎస్. వి. రత్నంగారలు ఎన్నుకోబడ్డారు. 20 వ తేదీ ఉదయం భారత కార్మికుల పోరాటాలు, ఉద్యమాభివృద్ధిని వ్యక్తపరచే సినిమా ప్రదర్శించబడింది.

బహిరంగసభ

20 వ తేదీ సాయంకాలం బహిరంగ సభకు కలకత్తా నలుమూలల నుండి రెపరెపలాడే వివిధ యూనియన్ల పతాకాలతోను, బానర్లతోను, ప్రవాహాల్లాగ కార్మికుల ఊరేగింపులు సభాస్థలిని నింపివేశాయి. ఇదొక అపూర్వమైన దృశ్యం.

ఈ మహాసభ మొత్తంమీద కొన్ని ముఖ్యవిషయాలను రుజువుపర్చింది.

(1) తమపై పెద్దపెట్టున విరుచుకు పడుతున్న దాడిని ఎదుర్కొనడానికి కార్మికవర్గం ఐక్యం కావడం అసాధ్యం కాదు.

(2) ఐక్య కార్మికోద్యమం నిరుద్యోగ పిశాచాన్నుండి కార్మికులను, యితర పీడితవర్గాలను కాపాడగలదు.

(3) యుద్ధ పిపాసుల ప్లానులను భగ్నంచేసి, సుస్థిరశాంతిని నెలకొల్పగలదు.

మహాసభలో పాల్గొన్న వివిధ దృక్పథాలుగల కార్మిక నాయకుల, కార్మికుల ప్రసంగాలు, వివిధ ప్రదేశాల్లో పోరాటాలద్వారా సాధించబడిన ఐక్యతను స్పష్టం చేశాయి. ప్రతినిధులంతా ఈ సందేశాల నందుకొని నూతనోత్సాహంతో తిరిగి వెళ్ళారు.

జనతావారి 'పరివర్తన'లో దొరస్వామి, సావిత్రి.

భూస్వాములకు పోలీసుల అండ : రైతు సేవకులపై హింసలు

తిరునల్వేలి జిల్లాలో విపరీత పరిస్థితి

[విశాలాంధ్ర విలేఖరి]

తిరునల్వేలి జిల్లాలో భూస్వాములు పెద్ద యెత్తున రైతుల్ని పొలాలనుండి తొలగిస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్న రైతు సంఘు కార్యకర్తలపై పోలీసు అధికారులు దారుణమైన హింసాకాండ అమలు జరుపుతూ భూస్వాములకు తోడ్పడుతున్నారు.

తిరునల్వేలిజిల్లాలో భూస్వాములు రైతుల్ని తొలగించకుండా చూసేందుకని, ఉభయుల మధ్య గాజీ కుదిర్చేటందుకు జిల్లా కలెక్టరు ఈ మధ్య ఒక రాజీ సంఘాన్ని నెలకొల్పాడు. ఈ సంఘం తన కార్యకలాపాలను కొనసాగించకుండా చేయడానికి భూస్వాములు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసుల సహాయంతో వారు రైతుల్ని భూములనుండి తొలగించుతున్నారు.

పోలీసుల హింసాకాండ

మే నెల 12 వ తేదీని పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు ఖాదర్ బచ్చా శ్రీ వైకుంఠం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కలిసి 5 గురు రైతు సంఘ కార్యకర్తల్ని అరెస్టుచేసి పోలీసుస్టేషనులో వారిని క్రూరంగా హింసించారు. ఈవార్త విన్న వెంటనే ఆప్రాంతంలోని రైతాంగం పోలీసు స్టేషన్ కి ఊరేగింపుగా వెళ్ళి, నిర్బంధంలో ఉన్న వారిని హింసించినందుకు నిరసన తెల్పారు. సబ్ ఇన్‌స్పెక్టరు వారిని దుర్భాషలాడి, వారి నాయకుడైన శ్రీ టి. ఆర్. సుబ్రహ్మణ్యంగారిని తలమీద తీవ్రంగా కొట్టి బయటికి గెంటివేశాడు. ఈ చర్యను ఖండిస్తూ రైతులంతా నినాదాలు చేశారు.

ఈ ఘటనను గురించి రైతులు ముఖ్యమంత్రికీ, అసెంబ్లీప్రతిపక్ష నాయకునికీ టెలిగ్రాంలు పంపారు.

జిల్లా పోలీసు అధికారి ప్రోత్సాహం

ఆ రోజే రాత్రి 8 గంటలకు జిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ వైకుంఠం వెళ్ళి, రైతుల్ని సబ్ ఇన్‌స్పెక్టరు ఖాదర్‌బచ్చా తుపాకులతో కాల్చియుండవలసిందని చెప్పాడట. వెంటనే సబ్ ఇన్‌స్పెక్టరు ఖాదర్ బచ్చా ఆరాత్రే రిజర్వుపోలీసుల్ని తీసుకొని పొన్నన్ కురిచి అనే గ్రామంమీద దాడి చేశాడు. అక్కడి రైతుసభ పందిళ్ళను పడగొట్టించి, కళ్ళకుండలను పగులగొట్టించి, జండా కర్రను విరుగగొట్టించాడు. ఒక పోలీస్ కానిస్టేబుల్ రైతుసంఘజండాను ముక్కలు ముక్కలుగా చించివేశాడు. అక్కడికి సమీపంలోఉన్న మాలపల్లి మీద పోలీసులుదాడిచేసి పిచ్చక్కణ్ణ అను 60 ఏండ్ల వృద్ధుని లాఠీలతో కొట్టారు. అతని యింట్లోవున్న వ్యవసాయ పరికరాలను విరగ్గొట్టారు. అక్కణ్ణించి వారు పొన్నన్న అనే మరొక హరిజన్ యింట్లో దూరి, అతనిభార్యను నానాబూతులు తిట్టి కొట్టారు.

ఆ తర్వాత పోలీసులు వెల్లూరు అనే గ్రామం వెళ్ళారు. అక్కడున్న రైతుసంఘు జండాను ముక్కలు ముక్కలుగా చింపారు.

మరునాడు పొన్నంకురిచి గ్రామం నుంచి 6 గురు రైతులు అరెస్టు చేయబడ్డ వారిని జామీనుమీద విడుదల చేయించేటందుకు బస్సుమీద వెళ్లారు. వారందరినీ పోలీసులు శ్రీ వైకుంఠంలో అరెస్టు చేశారు.

ఇంతటితో సంతృప్తి చెందక, పోలీసులు 15 వ తేదీ అర్థరాత్రివేళ వెల్లూరు రైతుసంఘు కార్యాలయం మీద దాడి చేశారు. అక్కడున్న కుర్చీ, టేబుల్, హరికేన్ లాంతరు, సైకిలు – అన్నీ ధ్వంసం చేశారు. అక్కడికి సమీపంలో ఉన్న వనమాలి అనే వ్యక్తి యింట్లో దూరపడి, సామగ్రి అంతా నాశనం చేసి, స్త్రీలను కొట్టి హింసించారు. వెల్లూరు గ్రామరైతుసంఘాధ్యక్షుడైన శ్రీ అలంకారం యింట్లో ఉన్న స్టాలిన్ చిత్రాన్ని, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుల చిత్రాలను పగుల గొట్టారు. ప్రక్కనున్న మాలపల్లెమీద దాడి చేసి, యిలాగే అనేక అత్యాచారాలు చేశారు.

జిల్లాకలెక్టరుచే నియమింపబడిన పరిష్కారకర్త మే నెల 10 వ తేదీని కలకాడ్ అనే గ్రామంలో రైతుసంఘు కార్యకర్తలను కలుసుకొని, 13 వ తేదీని తిరునల్వేలి రావలసిందని కోరాడు. కాని జిల్లా పోలీసుసూపరింటెండెంటు 12 వ తేదీని కలకాడ్ వెళ్ళి, అక్కడి మిరాసీదార్లతో మంతనాలాడి, 35గురు రైతుసంఘు కార్యకర్తల్ని అరెస్టు చేయవలసిందిగా తన క్రింది పోలీసు ఉద్యోగులకు ఉత్తరువులిచ్చాడు. ఈ ఉత్తరువుల పర్యవసానమే పై దాడులన్నీ. తిరునల్వేలిలో పరిష్కారకర్తను కలుసుకోవలసిన రైతు సంఘు కార్యకర్తలమీద కేసులు బనాయింపబడ్డాయి.

ప్రభుత్వ కర్తవ్యం

పోలీసుల దారుణకృత్యాలను ఆపు చేయించి రైతులకు రక్షణ కల్పించవలసిందనీ, భూములనుంచి వారిని తొలగించకుండా చూడవలసిందనీ మద్రాసు రైతుసంఘ కార్యదర్శి శ్రీ వేలుస్వామి తేవర్ ఒక ప్రకటన చేస్తున్నారు.



మాచ్‌ఖండ్ : సారంగం చివరి ద్వారం

హైద్రాబాద్

హైద్రాబాద్ నగరంలోని సీతాఫల్ మండీ యువజన సంఘం ఆధ్వర్యాన నవ్యాంధ్ర యుగపురుషుడు వీరేశలింగం గారి వర్ధంతిసభ శ్రీ రాచమళ్ళ చంద్రమౌళిగుప్తగారి అధ్యక్షతను జరిగింది. పంతులుగారు తెలుగుజాతికి గావించిన మహోన్నత సేవను కొనియాడుతూ పలువురు ప్రసంగించారు.

పత్రికా పరిచయం

ఇండియన్ మెడిసన్

(వైద్య విషయిక మాసపత్రిక)
సంపాదకులు:
శ్రీ దూబగుంట
లక్ష్మీనారాయణ, బి. కాం.
కార్యాలయం:
ఇండియన్ మెడిసన్ వర్క్స్,
విజయవాడ - 2.
విడి ప్రతి 0-4-0
సంవత్సరం చందా 3-0-0

ఈ పత్రిక ఆయుర్వేద వైద్యవిధానాన్ని గూర్చి ప్రచారం చేయుటకు ఉద్దేశించ బడింది. రెండవ సంచికలో శ్రీయుతులు జంధ్యాల దక్షిణామూర్తి, కంభం మెట్టు కృష్ణవర్ధనరావు, ఐ. శ్రీరాం గార్ల వ్యాసాలు ఉన్నాయి.

◆ ◆ ◆

స్వీకారం

శతపత్రసుందరి

(గేయ సంపుటి)
రచన:
బాలాంత్రపు రజనీకాంతారావు
బి. ఏ., ఆనర్స్
వెల: 3 రూపాయిలు.
ప్రకాశకులు:
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు
అండ్ సన్స్,
మద్రాసు-21.

◆ ◆ ◆

జమీందార్

(నవల)
రచన: అడపా తమ్మారావ్
వెల: నాలుగు అణాలు
ప్రతులకు: అడపా తమ్మారావ్
C/o శ్రీరామా ఫ్లోర్ మిల్ కంపెనీ
మాల్యాంజాలైన్, విజయవాడ-1.

◆ ◆ ◆

వ్యాస భారతము

[భారత సమీక్ష]
రచన:
అభినవ రుద్రకవి — చెఱుకూరి
కాళహస్తీశ్వర శర్మ.
వెల: ఒక రూపాయి.
ప్రతులకు:
చెఱుకూరి కాళహస్తీశ్వర శర్మ.
తెలుగు పండితుడు
బోర్డు హైస్కూలు; పెదవుగల్లు
కృష్ణా జిల్లా

◆ ◆ ◆

అమరు కావ్యము

(ఆంధ్రీకృతి)
చెఱుకూరి కాళహస్తీశ్వరశర్మ

ఐక్య కేరళ నిర్మాణంపై వివిధపార్టీల దృక్పథాలు

నిశ్చితాభిప్రాయానికి రాలేక సతమత మవుతున్న కాంగ్రెసు, ప్ర. సో. పార్టీల స్థితి

[విశాలాంధ్ర విలేఖరి]

తిరువేంద్రం, జూన్ 1

రాష్ట్రాల పునర్నిర్మాణ సమస్యను గురించి దర్యాప్తు జరపడానికి ఫజులాలీ కమిషన్ సభ్యులు తిరువాన్‌కూర్ - కొచ్చిన్‌కు రావడంతో ఐక్య కేరళ రాష్ట్రనిర్మాణాన్ని గురించి ఇక్కడ ప్రతిఒక్క రాజకీయపార్టీ తన నిర్దుష్టమైన సూచనలతో ముందుకు రావలసి వచ్చింది.

భాషను ప్రధానంగా ఆధారం చేసుకొని ఐక్య కేరళను స్థాపించాలని కమ్యూనిస్టుపార్టీఒక్కటే ఇప్పటివరకూ స్పష్టంగా చెప్పుతోంది. ఇతరపార్టీలూ, పత్రికలు విభిన్న దృక్పథాలను వెలిబుచ్చుతున్నాయి. ప్రజలుకూడా ఈ సమస్యను గురించి బాహాటంగా చర్చించుతున్నారు.

ఈ సమస్యపై ఇంతవరకూ రాష్ట్ర కాంగ్రెసు ఒక ఏకాభిప్రాయానికి రాలేకపోయింది.

శాసనసభలోని కాంగ్రెసు పార్టీ నాయకుడైన శ్రీ పానంపల్లి గోవింద మీనన్ పత్రికలవారితో మాట్లాడుతూ కేరళరాష్ట్రం ఏర్పడాలనేదే తన నిశ్చితాభిప్రాయమని చెపుతూ, ప్రస్తుతం తిరువాన్‌కూర్‌లో ఉన్న తమిళ తాలూకాలు మద్రాసు రాష్ట్రంలో కలిపివేయడం తనకిష్టం లేదన్నారు. అయితే నేను కలుపలనున్న మళయాళ ప్రాంతాలను కేరళ రాష్ట్రంలో కలపాలన్నారు. తన యీ అభిప్రాయంతో కొచ్చిన్ కాంగ్రెసు ఏకీభవిస్తున్నదన్నారు.

తిరువేంద్రం జిల్లాకాంగ్రెసు కమిటీ తమిళ తాలూకాలను కేరళనుండి విడగొట్టరాదని ఖచ్చితమైన అభిప్రాయాన్ని తెలుపుతూ ఫజులాలీ కమిషన్‌కు నివేదికను సమర్పించింది.

ఈ సందర్భంలోనే మలబార్‌లో ప్రజాసోషలిస్టుపార్టీ టికెట్టుపై పార్లమెంటుకు ఎన్నుకోబడ్డ శ్రీ దామోదరమీనన్, యన్.పి. దామోదరన్ గార్లు ఐక్య కేరళ నినాదాన్ని గట్టిగా బలపరుస్తున్నారు. ఈ సమస్యపైనే వారిద్దరూ ప్రజాసోషలిస్టుపార్టీనుండి బయటకు వచ్చారు.

తిరువాన్‌కూర్ తమిళనాడ్ కాంగ్రెసు కమిటీ తొమ్మిది తమిళ తాలూకాలను వెంటనే మద్రాసు రాష్ట్రంలో కలిపి వేయాలని కోరింది.

ఆర్. యస్. పి, కె. యస్. పి.ల వైఖరి

రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ, కేరళ సోషలిస్టుపార్టీలు ఐక్యకేరళ రాష్ట్రాన్ని కోరుతూ ఫజులాలీ కమిషన్‌కు మెమొరాండంలను సమర్పించారు. అయితే ఈ రెండు పార్టీలు తిరువాన్‌కూర్‌లోని అయిదు తమిళ తాలూకాలను మాత్రమే నూతన రాష్ట్రాన్నుండి వేరుపరచాలని స్పష్ట పరచాయి.

ఈ విధంగా రాష్ట్రంలో ఈ సమస్యపై వివిధ పార్టీలు, గ్రూపులు విభిన్న దృక్పథాలను వెలిబుచ్చాయి.



కొండల్లోనుంచి పారే కొలాభానదిలో చేపలుపడుతున్న జాలరులు

ప్ర. సో. పార్టీ సమావేశం

ఐక్యకేరళ సమస్యపై ప్రజాసోషలిస్టుపార్టీ పరిస్థితి కాంగ్రెసుపార్టీ స్థితి కంటే అధ్వాన్నంగా ఉంది. ఐక్య కేరళ సమస్యపై చర్చించి ఒక నిర్ణయానికి రావడానికి ఇటీవల ప్రజాసోషలిస్టుపార్టీ కార్యవర్గ సభ్యులు, పార్లమెంటరీపార్టీ, తదితర పార్టీ ప్రముఖులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాని ఎలాంటి నిర్ణయానికి రాకుండానే సమావేశాన్ని ముగించుకొన్నారు. చివరకు ఫజులాలీకమిషన్‌కు అధికారరీత్యా పార్టీ తరఫున ఒక మెమొరాండంను సమర్పించలేకపోయింది.

పార్టీ నాయకుడైన శ్రీ తాణుపిళ్ళె, తన వ్యక్తిగత హోదాలో కమిషన్ సభ్యులను కలుసుకొని ప్రస్తుతమున్న తిరువాన్‌కూర్ - కొచ్చిన్ రాష్ట్రాన్ని యధాతథంగా ఉండాలనేదే తన అభిప్రాయమని తెలిపారు. కేంద్రం ఆర్థిక సహాయం చేసే పక్షంలో మలబార్‌ను కేరళ రాష్ట్రంలో కలుపుకోడానికి సిద్ధపడతాననీ, ఏది ఏమైనా తమిళ తాలూకాలను మాత్రం వదులుకోవడానికి సిద్ధం లేనని శ్రీ తాణుపిళ్ళె కమిషన్‌తో చెప్పినట్లు "మలయాళీ" పత్రిక ప్రకటించింది.

కొచ్చిన్‌లోని ప్రజాసోషలిస్టుపార్టీ పశ్చిమకోస్తా రాష్ట్రం కావాలని కోరుతూ ఫజులాలీ కమిషన్‌కు మెమొరాండంను సమర్పించింది. ఈ రాష్ట్రంలో ప్రస్తుత తిరువాన్‌కూర్-కొచ్చిన్ రాష్ట్రంతోపాటు మలబార్ నీలగిరి జిల్లాలోని గుడల్లూర్ తాలూకా, కూర్గ్ ఉండాలన్నారు.

పశ్చిమకోస్తా రాష్ట్రం కావాలట

ఇక మలబారులోని ప్రజాసోషలిస్టు పార్టీ వైఖరి అసలు తేలనే లేదు. ముఖ్యంగా అఖిలభారత పార్టీలుగా ఉన్న కాంగ్రెసు, ప్రజా సోషలిస్టు పార్టీలు ఖచ్చితమైన అభిప్రాయాలను ప్రకటించలేకపోవడం ప్రత్యేకంగా గమనించవలసిన విషయం.

కమ్యూనిస్టుపార్టీ ఈ సమస్యపై స్పష్టమైన అభిప్రాయాన్ని తన మెమొరాండంలో తెలుపుతూ కేవలం మలయాళీ ప్రాంతాలు మాత్రమే ఐక్యకేరళ రాష్ట్రంలో ఉండాలని కోరింది. ఆర్థిక సౌలభ్యం అనే పేరుతో తమిళతాలూకాలను కేరళ రాష్ట్రంలో ఉంచడం ఏ మాత్రం సబబు కాదని స్పష్టం చేసింది. రాష్ట్రాల పునర్విభజనలో భాషనే ప్రధానంగా తీసుకోవాలని కోరింది.

పత్రికల ధోరణి

తిరువేంద్రంలోని పత్రికా రచయితలలో అత్యధికభాగం ఐక్యకేరళ రాష్ట్ర నినాదాన్ని బలపరుస్తున్నారు. పలుకుబడి గల "కేరళ కౌముది" అనే దిన పత్రిక అయిదు తమిళ తాలూకాలను మినహాయించి ఐక్య కేరళ రాష్ట్రాన్ని ఏర్పరచాలనికోరుతోంది. "జనయుగం" "నవజీవన్" పత్రికలు కేవలం భాషను ఆధారం చేసుకొని ఐక్య కేరళను స్థాపించాలని కోరుతున్నాయి.

కాంగ్రెసు పత్రికలు 'మలయాళ మనోరమ' 'మలయాళరాజ్యం' ప్రస్తుత తిరువాన్‌కూర్- కొచ్చిన్ రాష్ట్రాన్ని యధాతథంగా ఉండాలని కోరుతున్నాయి.

ఖమ్మం

ఖమ్మంజిల్లా రైతుసంఘ సమావేశం మే నెల 31 న శాసనసభ్యులు కన్నాటి లక్ష్మయ్యగారి అధ్యక్షతన జరిగింది.

తెలంగాణా రైతుసంఘం ప్రాథమిక సభ్యులను చేర్పించే గడువు జూన్ 30 వ పొడిగించిందనీ, దీనిని కార్యకర్తలు గుర్తించాలని, తీర్మానించింది.

పార్లమెంటు ఆమోదానికి ప్రవేశపెట్టబడిన హిందూవివాహవిడాకులబిల్లువివరాలు

ఇటీవల భారత రాజ్యసభలో ఆమోదింపబడిన హిందూ వివాహ విడాకుల చట్టం పూర్వాపరాలను పరిమితులను రచయిత ఈ వ్యాసంలో వివరిస్తున్నారు.

శ్రీ బొమ్మారెడ్డి వెంకటేశ్వర్రావు

ఇటీవల తీవ్రమైన చర్చల అనంతరం రాజ్యసభలో ప్రత్యేక వివాహాల బిల్లు ఆమోదించబడింది అది మరల ప్రజాసభ ఆమోదానికి ప్రవేశపెట్టబడింది. పార్లమెంటులోని ఉభయ సభలు దీనిని ఆమోదించిన పక్షంలో అది శాసనంగా దేశంలో అమలు జరుగుతుంది. అలాగే హిందూ వివాహ విడాకుల బిల్లును పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సిఫార్సులసంఘ పరిశీలనకు పంపాలని న్యాయశాఖామంత్రి శ్రీ సి. సి. బిశ్వాస్ ప్రతిపాదించగా చర్చించి ప్రజాసభ ఆమోదించింది.

హిందూ సమాజానికి సంబంధించిన ప్రాచీన న్యాయశాస్త్రాన్ని బ్రిటిషు ప్రభుత్వం అమలు జరుపుతూ వచ్చింది. ఈ చట్టం వలన హిందూ ప్రజలకు – ముఖ్యంగా స్త్రీలకు అన్యాయం జరుగుతున్నదని హిందూకోడ్‌ను సవరించాలని దేశంలో పెద్ద ఆందోళన జరిగిన ఫలితంగా హిందూ న్యాయశాస్త్రాన్ని మరల క్రోడీకరించడానికి ప్రభుత్వం రావు కమిటీని నియమించింది.

రావు కమిటీచే తయారు చేయబడిన హిందూకోడ్ బిల్లు 1947 లోనే ఆనాటి కేంద్ర శాసనసభలో ప్రవేశపెట్టబడింది. 1948 ఏప్రిల్ లో ఈ బిల్లు సిఫార్సుల సంఘ పరిశీలనకు పంపించబడింది. ఆనాటి తాత్కాలిక పార్లమెంటు బిల్లును ఆమోదించనందున బిల్లుకు కాలదోషం పట్టిందని ప్రకటించబడింది.

హిందూకోడ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశంలోని మతోన్మాదులు, అభివృద్ధి నిరోధకులు చేసిన ఆందోళనకు పాలకవర్గ పార్టీయైన కాంగ్రెసు లొంగిపోయి, కొంత ప్రాతికూల్యతను తగ్గించవచ్చుననే భావంతో బిల్లును కొన్ని భాగాలుగా విభజించి ప్రవేశపెట్టడానికి నిర్ణయించింది. అందులోని కొన్ని భాగాలుగా ఉన్న హిందూ వివాహ విడాకులబిల్లు, ప్రత్యేక వివాహాలబిల్లు నేడు పార్లమెంటుముందు ఉన్నాయి.

బిల్లు అంశాలు

హిందూ వివాహ, విడాకులబిల్లు భారతదేశంలో బౌద్ధులతోసహా హిందువుల, జైనుల, సిక్కుల వివాహాలకు, విడాకులకు వర్తిస్తుంది. ఈ బిల్లు ముస్లిమ్, క్రైస్తవ, పార్శీ, యూదు మతాలకు చెందని భారత దేశంలో స్థిర నివాస మేర్పరచుకొన్న తదితరులకు కూడా ఇది వర్తించుతుంది.

ఈ బిల్లు ప్రకారం స్త్రీ పురుషులు ఈ క్రింది షరతులకు లోబడి వివాహం చేసుకోవచ్చు :

1. వివాహానికి ముందు ఉభయులలో ఏ ఒకరికీ భర్తగాని, భార్యగాని ఉండరాదు.

2. ఉభయులలో యే ఒకరికీ వివాహమాడేముందు పిచ్చిగాని, మతిభ్రమగాని ఉండరాదు.

3. వరునకు కనీసం 18 యేండ్లు, వధువుకు 15 యేండ్లు వయస్సుండాలి.

4. వధూవరులు అన్నా చెల్లెలు, మేనమామ మేనకోడలు, మేనత్త మేనల్లుడు, అన్నదమ్ముల బిడ్డలు, అక్కచెల్లెండ్రబిడ్డలు ఈ బాంధవ్యాన్ని కలిగి ఉండరాదు. అయితే ఇందులో దేనినైనా ఆచారం ఆమోదిస్తే వివాహ మాడవచ్చు.

వధువుకు 16 యేండ్ల వయస్సు పూర్తికానిపక్షంలో ఆమె గార్డియన్ అనుమతిని పొందాలి. అలాంటి అనుమతి ఇవ్వడానికి ఈ క్రిందివారు ఈ క్రింది వరుసలో అర్హులై ఉంటారు : తండ్రి, తల్లి, పితామహుడు, సోదరుడు, పెదతండ్రి, పినతండ్రి, మాతామహుడు. అనుమతి ఇచ్చేగార్డియన్ కు 21 సంవత్సరాల వయస్సుండాలి.

వివాహ పద్ధతి

వివాహం మామూలు సాంప్రదాయం ప్రకారం జరగవచ్చు. హిందూసాంప్రదాయం ప్రకారం జరిగిన వివాహాలు రిజిస్టరు కావాలా లేదా అన్న విషయం ఆయా రాష్ట్రాల నిర్ణయాలకువదలివేయబడింది. రాష్ట్ర ప్రభుత్వాలు వివాహాలు రిజిస్టరు చేయడానికి తగినట్టి రూల్సును రూపొందించుకోవచ్చు. ఆ రూల్సుప్రకారం [illegible] ప్రవర్తించని పక్షంలో నేరస్తులకు [illegible] రూపాయలవరకు జరిమానా విధించవచ్చు. వివాహాల రిజిస్టర్ తనిఖీ చేయడానికి అవకాశం ఉంటుంది. వివాహం అయినట్లు రుజువు చేయడానికి ఆ రిజిస్టరు ఉదహరించవచ్చు. ఐతే ఆ రిజిస్టరులో వివాహం జరిగినట్లు ఉదహరించక పోయినంతమాత్రాన వివాహం కానట్లు లేక రద్దయినట్లు ఎంచరాదు.

భార్యాభర్తలలో ఒకరు మరొకరితో కలసి ఉండటానికి నిరాకరించిన పక్షంలో మరల కలసి దాంపత్య జీవితాన్ని కొనసాగించేటట్లు చేయడానికి రెండోవారు కోర్టులో కేసును దాఖలు చేయవచ్చు.

భార్యగాని, భర్తగాని దాంపత్య జీవితాన్ని కొనసాగించడానికి యిష్టపడక, విడాకులనుసహితంకోరే స్థితిలో లేనప్పుడు వారు వేరువేరుగా జీవించడానికి కోర్టును కోరవచ్చు. ఇలాంటి కోర్టు అనుమతితో దంపతులు వేరు వేరుగ ఉండేందుకు అవకాశంఉంటుంది గాని మరల వివాహమాడేందుకు అవకాశం ఉండదు.

ఈ క్రింది కారణాలతో దంపతులు వేరువేరుగా జీవించడానికి కోర్టు అనుమతిని ఇవ్వవచ్చు :—

1. భర్తను భార్యకాని, భార్యను భర్తగాని రెండు సంవత్సరాల పాటు విసర్జించిన పక్షంలో.

2. దంపతులలో ఒకరు మరొకరిని అతిక్రూరంగా హింసించుచున్న కారణంగా యింకా కలసి ఉండటం ప్రమాదకరమని భావిస్తున్నప్పుడు.

3. వివాహం జరిగినప్పటినుండి భార్యగాని భర్తగాని మతిచాంచల్యంతో ఉంటున్న పక్షంలో.

4. దంపతులలో ఒకరు కుష్టు రోగంతోగాని, సుఖరోగాలతోగాని బాధపడుతున్న పక్షంలో

5. భార్యాభర్తలలో ఒకరు వ్యభిచారానికి పాల్పడినప్పుడు.

వివాహం రద్దు

వివాహం జరుగుతున్న సమయానికి వధువుకు భర్తగాని, వరుడికి భార్యగాని జీవించి ఉండి, అది అప్పటి ఆచారానికి విరుద్ధమైన పక్షంలో లేక వివాహ మాడటానికి నిషిద్ధమైన బాంధవ్యాన్ని వధూవరులు కలిగి ఉన్నప్పుడు వివాహాన్ని చట్టరీత్యా రద్దు చేయవచ్చు.

ఈ బిల్లు శాసనం కాకముందు వివాహం జరిగినప్పటికీ, శాసనం అయిన ఒక సంవత్సరంలోపున వివాహ సమయంలోనే భర్త నపుంసకుడనీ, ఆ నపుంసకత్వం యిప్పటికీ వున్నదని రుజువు చేసిన పక్షంలో వివాహాన్ని రద్దు చేయడానికి అవకాశం వుంటుంది. అంతేగాక భార్యాభర్తలలో ఒకరు వివాహసమయంలో పిచ్చివారని రుజువుచేయబడ్డా వివాహాన్ని రద్దుచేయడానికి వీలుంటుంది.

వివాహ సమయంలో వధువుకు నిర్ణయించబడిన వయస్సుకు తక్కువ వుండి, అందుకోసం తెప్పించిన గార్డియన్ అనుమతి ఫోర్జరీ అని రుజువైనా లేక బలవంతంగా తెచ్చినదని ధృవపడినా వివాహాన్ని రద్దుచేయవచ్చు. అయితే యీఫిర్యాదు వివాహం జరిగిన ఒక సంవత్సరంలోపున చేసి వుండాలి.

విడాకులకు అవకాశాలు

ఈశాసనం అమలులోకి రాకముందు వివాహం జరిగినా, ఆ తరువాత జరిగినా భార్యాభర్తలలో ఒకరు యీ క్రింది కారణాలను ఉదహరించిన పక్షంలో వివాహాన్ని కోర్టు రద్దుచేయడానికి అవకాశం ఉంటుంది :

1. భర్త ఉంపుడు కత్తెను ఉంచుకోవడం, భార్య మరొక వ్యక్తికి ఉంపుడుకత్తెగా తయారవడం, లేక వ్యభిచారి కావడం.

2 భార్యాభర్తలలో ఒకరుమరొక మతాన్ని స్వీకరించిన కారణంగా హిందువు కాకుండా పోవడం.

3 దంపతులలో ఒకరు [illegible] సంవత్సరాలుగా మతిభ్రమకు గురిఅయి అయిదు సంవత్సరాలుగా చికిత్సలో ఉండటం.

4. భార్యాభర్తలలో ఒకరు కనీసం ఒక సంవత్సరంనుండి కుష్టురోగంతో బాధపడుతూ వుండటం.

5. భార్యాభర్తలలో ఒకరి సంగతి మరొకరికి ఏడు సంవత్సరాలుగా అంతు పొంతూ తెలియక పోవడం.

6. కోర్టు తీర్పుద్వారా భార్యాభర్తలు విడిపోయి వేరువేరుగా ఉంటూ రెండు సంవత్సరాలైనా యిద్దరు మరల దాంపత్యజీవితానికి నిరాకరించడం.

7. ఉభయులు తిరిగి దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని కోర్టు డిక్రీ యిచ్చిన తరువాత రెండుసంవత్సరాలకు కూడా వారు అందుకు సిద్ధపడని పక్షంలో.

భార్యాభర్తలలో ఒకరు అతి క్రూరంగా హింసించబడుతున్న సందర్భాల్లో తప్ప సాధారణంగా వివాహంజరిగిన మూడేండ్లలోపున విడాకులు మంజూరు చేయబడవు.

మళ్ళీ పెండ్లికిగల హక్కు

విడాకులు మంజూరు అయిన తరువాత అప్పీలు చేయని పక్షంలోగాని లేక అప్పీలు చేసిన ఒక సంవత్సరం తరువాతగాని మళ్లీ పెండ్లి చేసుకోడానికి హక్కును కలిగిఉంటారు.

కోర్టు ఖర్చులను భార్య చెల్లించ లేని స్థితిలో ఉన్నదని కోర్టువారు భావించిన పక్షంలో ఖర్చులను భర్త భరించాలని ఆర్డర్ జారీచేయవచ్చు. అలాగే వివాహం రద్దయిన తరువాత భార్య శీలవంతురాలుగా ఉంటూ, మళ్ళీ పెండ్లి చేసుకోనంతకాలం ఆమెకు మనవర్తి చెల్లించమని కోర్టువారు భర్తను కోరవచ్చు.

బిడ్డల సంరక్షణ-ఆస్తిపంపకం

విడాకులను మంజూరు చేసినప్పుడు బిడ్డల సంరక్షణకు సంబంధించిన ఏర్పాట్లను గురించి కోర్టువారు నిర్ణయించవచ్చు. అలాగే ఉమ్మడి ఆస్తిని కోర్టువారే పంపకం చేయవచ్చు.

ఈ బిల్లు 1952 లోనే రాజ్యసభలో ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు పార్టీలోనే వ్యతిరేకత ఉండడంవలన ఇప్పటివరకూ జాప్యం జరిగింది. ఈ బిల్లును పార్లమెంటు ఉభయసభలతో కూడిన సిఫార్సులసంఘం పరిశీలనకు పంపాలన్న ప్రతిపాదన ఇటీవలనే ప్రజాసభ ఆమోదించింది. సిఫార్సులసంఘం చేసే సవరణలతో బిల్లు మరల ఉభయ సభల ఆమోదానికి ప్రవేశపెట్టబడుతుంది.

అభివృద్ధికరమైన ముఖ్యాంశా

ఈ బిల్లులో ప్రధానంగా మూడు అభివృద్ధికర అంశాలున్నాయి. (1) ఇదివరకటివలె వివాహానికి తప్పనిసరిగా వధూవరు లిద్దరూ ఒకేకులానికి చెంది వుండవలసిన పనిలేదు. (2) హిందువులలో ఏకపత్నీ వ్రతం ఖచ్చితంగా అమలుజరుపబడుతుంది. (3) కొన్ని కారణాలతో వివాహాన్ని రద్దుచేయడానికి, విడాకు లిచ్చుకోడానికి అవకాశం కల్పించబడింది.

అయితే ఈబిల్లు సనాతన ఆచారాలను అనుసరించాలనుకొనే హిందువులను బంధించదు. తమ పూర్వ సాంప్రదాయాల ననుసరించి వారు వివాహమాడవచ్చు. ఆధునిక పద్ధతులను అనుసరించ గోరే హిందువుల ఉపయోగంకోసమే ఈ బిల్లు ఉద్దేశించబడింది. ఈ విధంగా ఈ బిల్లును నిర్బంధ స్వరూపం లేకుండా చెయ్యడంవలన సనాతనులనుండి వ్యతిరేకత పెద్దగా రాదనే అభిప్రాయంతో తానీ పద్ధతి ననుసరించుచున్నానని ప్రభుత్వం చెప్పుతోంది.

మనకుగల సదవకాశం

ఈ బిల్లుపై పార్లమెంటులో పాలకపార్టీగా ఉన్న కాంగ్రెసుపార్టీ తన సభ్యులకు వోటింగ్ స్వేచ్ఛ నిచ్చింది. అందువలన బిల్లులోని ఉన్న కొన్ని లోట్లను సవరించుకొని, అభివృద్ధి పరచుకోడానికి అవకాశం ఉంది. మరొకవైపున బిల్లును మరింత సంకుచిత పరచడానికి అభివృద్ధి నిరోధకులు కాంగ్రెసు సభ్యులపై వొత్తిడిని తీసుకొని వచ్చే ప్రమాదం లేకపోలేదు.

అందువలన ఈ బిల్లు శాసనం అయ్యేంత వరకు ఎడతెగని ఆందోళన అవసరం.

బిల్లులో గల ఈ క్రింది ప్రధాన లోటులను తొలగించేందుకు కృషిసలుపవలసి ఉంది.

1. ఈ శాసనం కేవలం హిందువులకు మాత్రమే పరిమితంచేయబడింది. భారతదేశంలో అన్ని మతాలవారికీ ఒకే రకమైన సివిల్ కోడ్ ఉండటం అవసరం.

2. జమ్మూ - కాశ్మీర్ కు కూడా ఈ శాసనం వర్తింప చేయాలి. అలా కాని పక్షంలో భార్య ఉన్న భర్త కాశ్మీర్ వెళ్లి మళ్లీ వివాహ మాడటానికి అవకాశం ఉండకలదు.

3. వధువుకు వయస్సు 16 యేండ్లకు లోపు వుంటే గార్డియన్ అనుమతి ఉండాలని ఈ బిల్లు నిర్దేశించుతుంది. అంతేగాకుండా గార్డియన్ లుగా పని చేయదగిన వారి జాబితా కూడా ఇచ్చింది. ఇది అనవసరమైన తగాదాలకు, ఇబ్బందులకు దారితీయవచ్చును. కనుక ఈ క్లాజులోని ఇతర అంశాలను తొలగించి వధువుకు ఖచ్చితంగా 16 సంవత్సరాలుండే స్వేచ్ఛగా వివాహమాడవచ్చునని ఉండాలి.

4. ఈ బిల్లులో కొన్ని పరిస్థితులలో వివాహం రద్దు కావడానికి, విడాకులను ఇచ్చుకోడానికి అవకాశం కల్పించబడింది. కాని అంతకుముందున్న స్త్రీల హక్కులు వారి సంరక్షణ విషయమై పేర్కొనబడలేదు. ఆ విషయమై తగిన ఏర్పాటు ఉండేటట్లు చూడాలి.

5. భార్యాభర్తలు కోర్టు డిక్రీ ద్వారా వేరు పడిపోయినప్పుడు భార్య మనవర్తి విషయమై బిల్లులో పేర్కొనబడలేదు. మనవర్తికి అవకాశం తప్పనిసరిగా కల్పించాలి.

6. కోర్టు ద్వారా వేరు పడిపోయిన తరువాత మూడు సంవత్సరాల తరువాత విడాకులను కోరుకోవచ్చునని బిల్లులో ఉంది. ఇది ఒక సంవత్సరానికి తగ్గించడ మవసరం.

విడాకులు మంజూరు అయిన తరువాత ఆరుమాసాల అనంతరం మరల వివాహ మాడటానికి అవకాశం ఉండాలి.

ఇలాగే పార్లమెంటు ఉభయసభల ఆమోదానికి ప్రవేశపెట్టినప్పుడు బిల్లును మరికొంత అభివృద్ధి పరచడానికీ, పార్లమెంటు సభ్యులు ప్రయత్నించేటట్లు అభివృద్ధి కాముకులంతా, ముఖ్యంగా మహిళా సంఘాలు తీవ్రంగా ఆందోళన చేయడమవసరం. అప్పుడే ఈ శాసనం కొంతవరకు సంఘాభివృద్ధికి వినియోగ పడగలదు.

మాచ్ ఖండ్ : నిర్మాణంలోవున్న పవర్ స్టేషను



మాచ్ ఖండ్ : మక్కీ-పుట్ డాం (మక్కీ-పుట్ గుంటవద్ద అడ్డుగోడ)

పంజాబ్ - పెప్సూలో పౌరసత్వ హక్కులపై ప్రభుత్వ దాడి

రాష్ట్ర వ్యాపితంగా రాజకీయ పార్టీల ఆందోళన

పంజాబ్ పెప్సూరాష్ట్రంలో ప్రభుత్వం పౌరసత్వహక్కులను కబళిస్తూ 144 సెక్షను ప్రయోగించింది. మిల్లులనుండి కార్మికులను, భూములనుండి రైతులను యజమానులు తొలగిస్తున్నారు. పౌరసత్వ హక్కుల పునరుద్ధరణకోసం కాంగ్రెసు మినహా మిగిలిన అన్ని రాజకీయపార్టీలవారు సంయుక్తంగా ఆందోళన కావిస్తున్నారు.

ఈ మధ్య పంజాబ్ పెప్సూ రాష్ట్రంలో విపరీత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక లక్షమంది రైతులుభూముల నుంచి తొలగింపబడే ప్రమాదమేర్పడింది. కార్మికులకు కూలిరేట్లు అధ్వాన్నంగా వున్నాయి. పనుల్లోంచి కార్మికులను తొలగిస్తున్నారు. మధ్యతరగతి యువకులలో నిరుద్యోగం రోగంవలె వ్యాపించింది. ధరలు విపరీతం. [illegible] ఏమీ కనబడదు. ప్రజలు బతికే విధానం ఎలాగో తెలియడం లేదు. రాష్ట్ర మంతటా ఈ [illegible] ప్రజల అసంతృప్తిని అణచేందుకు ప్రభుత్వం 144 సెక్షన్ రాష్ట్రం అంతటా జారీచేసింది.

ప్రజాస్వామిక హక్కులు : పోరాటం

ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించడం కోసం రాష్ట్రంలో ఆందోళన ప్రారంభమయింది.

ఒక్క కాంగ్రెసు తప్ప మిగిలిన ప్రజాసంస్థల పౌరసత్వ హక్కులన్నీ హరించబడ్డాయి. కాంగ్రెసుకు సంబంధించని, ఏపార్టీకీ సంబంధించని వ్యక్తులపై సంస్థలపై పత్రికలపై ప్రభుత్వం కసిబూని దమననీతి ప్రయోగిస్తోంది. 'నయాజమానా' తదితర ప్రజాస్వామిక దినపత్రికలపై ప్రభుత్వం కేసులు పెట్టింది.

అయితే ప్రభుత్వ ఈ దండశాసనాన్ని ప్రజలు ఎదుర్కొంటున్నారు. జలంధర్ వద్ద గోరయా అనేచోట మే 19న పౌరహక్కుల సంఘ ఆధ్వర్యాన ఒక సభ జరిగింది. 144 సెక్షను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని సమావేశం గట్టిగా హెచ్చరించింది. జలాలాబాద్ జిల్లాలో గ్రామ గ్రామాన రైతు సంఘాలు స్థాపింపబడుతున్నాయి. పంచాయతీసభ్యులు అధ్యక్షులు ఇటీవలనే ఒక సమావేశం జరిపారు. ప్రభుత్వం 144 వ సెక్షన్‌ను ఉపసంహరించుకోవాలని రైతులను భూముల నుంచి తొలగించరాదనికోరారు. ఫిరోజ్‌పూర్ జిల్లా మోగాలో పీపుల్సు డెమాక్రటిక్ ఫ్రంటు సమావేశంలో ప్రభుత్వ చర్యలను విమర్శిస్తూ పౌరరక్షణ హక్కులకోసం వెంటనే ప్రభుత్వం 144 సెక్షన్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు.

వివిధ పార్టీల సమావేశం

పౌరరక్షణ హక్కుల పునరుద్ధరణకోసం జరిగే ఈఆందోళన రాష్ట్రవ్యాపితంగా విస్తృతమైంది. వివిధ రాజకీయ పార్టీలు మే 19, 20వ తేదీలలో చండీగర్ లో సమావేశమయ్యారు. ఒక్క కాంగ్రెసు మాత్రం దీనికి హాజరు కాలేదు.

[illegible]

గాంధీ జనతపార్టీ, అకాలీ, కమ్యూనిస్టు పార్టీ, జనసంఘ్, ప్రజా సోషలిస్టు తదితర పార్టీ ప్రముఖులు ఈ సమావేశానికి వచ్చారు. 7 గురితో ఒక కమిటీ ఏర్పడింది. అతి త్వరలోనే ఒక పెద్ద సభను కావించేందుకు తీర్మానించారు. పురపాలక సంఘాధ్యక్షులు, పంచాయితీ బోర్డు, జిల్లా బోర్డు సభ్యులు యీ సమావేశానికి రానున్నారు. పౌరసత్వహక్కులను ప్రభుత్వం కాలరాచ బూనుకోడం గర్హ్యనీయమనీ కార్మికులను పనులనుంచీ, రైతులను భూముల నుంచీ తొలగిస్తున్నారనీ, అందువల్ల విపరీత పరిస్థితులు రానున్నవనీ, ప్రభుత్వం భూస్వాముల, మిల్లు యజమానుల పక్షం వహించి, ప్రజలను దారుణంగా అణచివేయ బూనుకుంటనీ పేర్కొంటూ తాము యిట్టి చర్యలను సహించబోమని వివిధ రాజకీయపార్టీల నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వాని కొక మెమురాండం సమర్పించేందుకునిర్ణయించుకున్నారు. పౌరసత్వ హక్కుల పునరుద్ధరణకు తాము శాయశక్తులా కృషిచేస్తామనీ, పోరాడతామనీ పేర్కొన్నారు.

అయితే ప్రభుత్వం ప్రజలను కేవలం పౌరసత్వ హక్కులను నిరాకరించి మాత్రమే ఊరుకోవడంలేదు. తనపోలీసు యంత్రాంగాన్ని అంతటినీ ప్రజల పైకి మళ్ళిస్తోంది. ప్రజలను పోలీసులు భయపెడుతున్నారు. హింసిస్తున్నారు. భూస్వాముల అండదేరి గూండాల మద్దతుతో పోలీసులు రైతులపై విరుచుకుపడుతున్నారు. దొంగ కేసులను బనాయిస్తున్నారు. ఆఖరికి ఖూనీ కేసులను సైతం మోపుకున్నారు.

దొంగకేసుల బనాయింపు

కామ్రేడ్ దిలీప్‌సింగ్‌పై ప్రభుత్వ పోలీసులు పెట్టిన ఖూనీకేసును గుర్దశపూర్ సెషన్సుజడ్జీ, కేవలం అబద్ధమని, ఈ మధ్యనే కొట్టివేశాడు. ప్రాసిక్యూషన్ కథనం అంతా పచ్చి అబద్ధమని పేర్కొన్నాడు. దిలీప్‌సింగ్ రైతులను సమీకరించి భూస్వాముల దాడిని ఎదిరించడమే పోలీసుల కొక నేరంగా కనిపించింది. దిలీప్‌సింగ్‌ను వొక దొమ్మీ కేసులో యిరికించి పోలీసులు అతనిపై దొంగకేసును బనాయించారు. పోలీసులతో కాంగ్రెసువారు ముఖ్యంగా కాంగ్రెసు శాసన సభ్యుడు జోగిందర్ సింగ్ కలిశాడు. కాని దిలీప్‌సింగ్‌పై పోలీసులు అక్రమంగా కేసు పెట్టారని కోర్టువారు తీర్పు యిచ్చారు.

ఇదే విధంగా సజ్జాన్ ఖూనీకేసు 5 గురిపై మోపబడింది. కేసులో యిరికించబడ్డ యీ అయిదుగురూ కమ్యూనిస్టులు. పోలీసులు పెట్టిన యీ కేసు వట్టి అబద్ధమని అందరినీ విడుదలచేస్తూ జడ్జీలు తీర్పు చెప్పారు.

ఫజులాలీ కమిషనుకు కమ్యూనిస్టుపార్టీ మెమొరాండం

పంజాబ్ - పెప్సూ కమ్యూనిస్టు పార్టీ ఫజులాలీ కమిషనుకు యిటీవలనే ఒక మెమొరాండం సమర్పించింది. రాజప్రముఖ్ ఆధ్వర్యాన నెలకొల్పబడ్డ సంస్థలనన్నిటినీ రద్దు చేయాలనీ, పంజాబీ భాషాప్రాంతాలను సమైక్యం చేయాలనీ యీ మెమొరాండంలో కోరబడింది.

పశ్చిమ యు. పి. తో పంజాబ్ పెప్సూలోని హిందీ భాషా ప్రాంతాలను కలపాలని, సిమ్లా, కోహిస్తాన్‌లను హిమాచల ప్రదేశ్‌లో కలిపి దానికి రాష్ట్ర ప్రతిపత్తి నీయాలనీ యీ మెమొరాండం పేర్కొంది. మెమొరాండంలో పేర్కొనబడిన పద్ధతులను ఆచరణలో పెట్టినట్లయితే పంజాబ్ ఐక్యతకు పంజాబీ భాషాభివృద్ధికి సాంస్కృతిక వికాసానికి యెంతో దోహదం చేయగలదని కమ్యూనిస్టు పార్టీ స్పష్టపరచింది.

ప్రజల అభ్యుదయానికి భిన్నంగా అధికారవర్గంలో వున్న కాంగ్రెసు ముఠాలు, తదితర అభివృద్ధినిరోధక హిందూ మతసంస్థలు, పార్టీలు "మహా పంజాబ్" కావాలని ప్రకటిస్తున్నాయి. పంజాబ్ పెప్సూ, హిమాచలప్రదేశ్, ఢిల్లీలను కలిపివేయాలని ఆందోళన చేస్తున్నాయి. దీనికి తోడుగా సిక్కు మతోన్మాదులు తమ సిక్కుమతప్రాధాన్యత కోసం పాటుపడుతున్నారు. కాని హర్యాన కాంగ్రెసు ప్రముఖులు పంజాబ్ పెప్సూలలోని హిందీ

(తరువాయి 7 వ పేజీలో)

కుందేలు రాజ్యం : తోడేలు రాజు

ఫెంగ్ - హ్వా - ఫెంగ్

అనగా అనగా వొకకొండ మీద కొన్ని కుందేళ్లు నివసిస్తూ వుండేవి. ఆ కొండకు కొంచెం దూరంగా వొక పర్వతంవుంది. ఆ పర్వతం మీద తోడేలురాజు కాపరముంటున్నాడు. కొన్నాళ్లు గడిచాక, ఒకరోజున తోడేలు రాజు "నాకు మీ కొండ రాజ్యాన్ని చూడాలనివుంది. మీ కుందేళ్ళను ఓసారి చూసి పోదామని కోరికగావుంది. రేపో, ఎల్లుండో మీ కొండ రాజ్యానికి వస్తాను." అని కుందేళ్ళకు కబురు పెట్టాడు. రాజుగారు తమ యిళ్ళకు వస్తున్నాడని కుందేళ్ళు సంతోషపడిపోయి ఉబ్బిపోయాయి. ఆనందంతో గెంతుతున్నాయి. ఒక రాజుగారు తమవంటి పేద ముండావాళ్ళ యిళ్ళకు రావడమంటే గొప్ప కదూ ! "ఓహో తోడేలుగారవారికి మనమీద ఎంతగారవం ! ఎంతఅభిమానం! ఎంతప్రేమ ! ఆహా ! రాజంటే తోడేలు దొరవారే! దొడ్డ ప్రభువు!" అని కుందేళ్ళు సంతోషం పట్టలేక పోయాయి.

సరే, రాజుగారొస్తున్నారని కొండంతా ముస్తాబూ గిస్తాబూ చేశాయి. రాజుగారొచ్చేసరికి డాబుగా కనిపించాలని అన్ని ఏర్పాట్లుచేసి రెడీగా కూచున్నాయి. "ఏమ్రా! రాజుగారు మనకొంపలకి రావడమంటే మాటలట్రా ? ఆయన కెంతో దయవుంది కనకకానీ, లేకపోతే యిటువేపు చస్తే రారు." అంది వొక కుందేలు. మరో అమాయిక కుందేలు "మంచిదానివే! ఇంకా మెల్లిగా అంటావేమిటి ఆమాట!తోడేలు రాజుగారిని మనం మంచి చేసుకుంటే యిక అడిగేవా ? రాజుగారి దయవుంటే మన పిల్లాపిచికా ముమ్ముందు బాగుపడతారు" అంది.

"ఏమ్రోయ్ ! తోడేలు రాజుగారు రావడం మన జీవితంలో గొప్ప విషయం; దానికి తగినట్టూ మనం ఆయనగారిని మర్యాద చేయాలి. మర్యాదలో ఏలోటూ రానీయ కూడదు. ఆనక మాటొస్తుంది" అని మరో కుందేలు హెచ్చరించింది. కుందేళ్ళు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

అనుకున్నట్టుగానే తోడేలు రాజావారు దిగబడ్డారు. ముసలీ ముతకా, చిన్నా పెద్దా ఆడా మగా అందరూ రాజుగారొస్తున్నారని దారికి రెండువైపులా నిలబడి "తోడేలు రాజావారికి జై" అని అరిచారు. బారులుగా నిలబడి తోడేలు రాజుకు రండి రండని స్వాగతమిచ్చారు. రాజా బహద్దరువారు తల పంకించి కుందేలు ప్రజలను చూసి చిరునవ్వు నవ్వారు.

విందులూ గిందులూ అయిపోయాక రాజుగారు "మీకొండ రాజ్యం చాలా బాగుంది. ఇక్కడ వొచిన్న బంగాళాకట్టుకుంటాను, అప్పుడప్పుడు వస్తూ పోతూ వుంటాను" అన్నారు.

"అలాగే మహారాజా! మీరు కట్టుకోవడమేమిటి ? మేమే కట్టి పారేస్తాం!" అంటూ కుందేళ్లు తమ యిళ్ళలోవున్న సామాను తెచ్చి యిట్టే బంగాళా కట్టేశాయి. ఇప్పుడు తోడేలు రాజుగారికి వుండడానికి చక్కటి బంగాళాకుదిరింది. "ఏమ్రోయ్ యింతసేపూ చెప్పడం మర్చిపోయాను. మన కోటనుంచి బయల్దేరేటప్పుడు మనం ఏమీ తెచ్చుకోలేదు. తొందర తొందరగా బయల్దేరి వచ్చేశాను. కట్టుకుందుకు బట్టల్లేవ్రా! కోటూగీటూ పగిడీ అక్కడే మరిచిపోయాను. వేసుకున్న ఈ గుడ్డలు మాసిపోయాయి." అన్నారు, తోడేలు రాజుగారు. "మాబావుంది, ఇంకా నయం. ప్రభువు వారికి గుడ్డలకి లోటు రానిస్తామా ?" అంది ఒక కుందేలు.

"ఫస్టుక్లాసుగా కోట్లూ అవీ కుట్టించేస్తాం ! మా కుందేలు చర్మంతో నగిషీలు, చెమికీలూ లతలూ! ఓ దర్జా అయిన కోటు తొడుక్కుని తిరుగుదురుగాని!" అంది మరో కుందేలు.

సరేనంటే సరేనని తోడేలు రాజుగారి బట్టలకి కుందేలు చర్మం సప్లయి చేసేశారు. కుందేలు చర్మం ఎలా వస్తుంది? అందుకని లోకువగా కనిపించిన కుందేళ్ళను చంపడం ఆరంభించాయి. కుందేళ్ళు యిలాగ రోజురోజుకూ చచ్చి పోతున్నాయి.

తోడేలురాజు కోటూగీటూ వేసుకుని విస్తరిముందు కూచున్నారు. "ఏమ్రా కుందేళ్ళూ! నాకు కోటూ అవీ అమిరాయి కాని తిండిమాటేమిటి? కుందేలు మాంసం రుచిగా వుంటుందని విన్నాను; నిజమేనా? లేక గొప్పకి మీరిలా చెప్పుకుంటున్నారా?" అంది. "ఆహా! లేనిపోని గొప్పలెందుకు చెప్పుకుంటాం ప్రభూ ! మా రాజావారు తమరు మా కుందేలు మాంసం రుచి చూస్తే మరొదలరు." అంటూ కుందేలు మాంసాన్ని వడ్డించాయి. తోడేలురాజుగారు కుందేలు మాంసం మరిగేరు.

ఇపుడింక తోడేలు రాజావారు బంగాళాలో కాపరం పెట్టేశారు. రోజూ కుందేళ్ళు తమ పిల్లల్ని పెద్దల్ని చంపడం ఆ మాంసం తోడేలుప్రభువుకి పెట్టడం మామూలయిపోయింది.

ఇలాగ కొన్ని రోజులుగడిచేసరికి కుందేళ్ళ సంఖ్య తగ్గిపోయొచ్చింది. రోజూ కొన్ని కుందేళ్ళు సఫా అయిపోతున్నాయి కదూ ! ఎన్నాళ్ళని యిలాగ తోడేలును మేపగలవు? కుందేళ్ళు మొర్రో మొర్రోమని ఏడవడం ప్రారంభించాయి. "మన కుందేళ్ళన్నీ నాశనమై పోతున్నాయి. ఇక మన జాతి మిగిలేటట్టు లేదు. అంతా సర్వనాశనం అయిపోతున్నాం" అని మొర్ర పెట్టింది ఓకుందేలు.

"మనం తెలివి తక్కువ ముండలం ! మొట్టమొదటే ఆలోచించు కోవలసింది. ఎక్కడైనా తోడేలును అంతమర్యాద చేస్తామా ?" అంది మరో కుందేలు.

మొదట తోడేలు ప్రభువు వస్తానని కబురు పెట్టగానే కుందేళ్ళు ఆనందంతో ఘనంగా స్వాగత మిచ్చాయి ఇప్పుడు లబో లబోమని మొత్తుకుంటున్నాయి.

కొల్లేటి బంజరు భూముల సాగు:
భూస్వాముల దోపిడి

కొల్లేటి గ్రామాలలో అక్రమాలు

కృష్ణాజిల్లా వ్యవసాయకూలీ సంఘ ఆదేశానుసారం కొల్లేటి బంజరు సాగునుగూర్చి విషయ సేకరణకు శ్రీ తప్పిట సుబ్బారావు, శ్రీపాసూరి తిరుపతయ్యగార్లు కొల్లేటిప్రాంతంలో పోలుకొండ, గాజులపాడు, ఉనికిలి, ఇంగిలింపాక, నందిగంలంక, ఏటికట్టు వెంకటాపురం, కాళింగులపేట వగైరా గ్రామాలు తిరిగి ప్రజాభిప్రాయాన్ని సేకరించి యీ దిగువ వివరాలు తెలియచేస్తున్నారు.

గాజులపాడు, ఉనికిలి వగైరా గ్రామాలలోని పేదప్రజలు గత 30 సంవత్సరాలుగా కొన్నాళ్లు ముక్కలు చేసుకొని సాగుకు అనువుగా తెచ్చిన బంజరు భూమిని రాజకీయ బాధితులు దురాశతో కాజేయనెంచి స్థానిక భూస్వాముల లాలూచీతో గ్రామాధికార్లను లోబరచుకొని కాంగ్రెసు పలుకుబడితో 144 సెక్షను నుపయోగించి గాజులపాడు, ఉనికిలి, రుద్రపాక పొలిమేరలలో 300 ఎకరములపైగా తాత్కాలిక సాగుకు మంజూరు పొందారు. సదరు బంజరును లోగడనుండి సాగుచేస్తున్న పేద ప్రజలు భూమినుండి తొలగని కారణంగా 100 ఎకరములు మాత్రమే రాజకీయబాధితులు సాగుచేశారు. మిగిలిన 200 ఎకరములకు పైగానున్న భూమినంతా గత 30 సం॥లుగా సాగుచేస్తున్న పేద ప్రజలే యీ నాటికి సాగుచేస్తున్నారు.

రాజకీయ బాధితుల పేరుతో భూముల ఆక్రమణ

కాంగ్రెసు మార్కు మేలిముసుగు ధరించిన రాజకీయ బాధితులు తాము స్వయముగా సాగుచేసినయెడల సేద్యమునకు అనుకూలపడే బంజరు, వందలకొల ఎకరాలు కొల్లేరు ప్రాంతములో వుండగా - పేదలు సాగుచేస్తున్న భూమిని కాజేయనెంచి గ్రామ కరణాలను లోబరచుకొని పేదలు సాగుచేస్తున్న భూమికి పెనాల్టీలు తమ పేర వ్రాయించుకొని మరుసటి సంవత్సరానికో-మరికొంత కాలానికో తమ పలుకుబడి వినియోగించి పోలీసు బలగాన్ని తెచ్చి ఆయా భూముల్లో ప్రవేశిస్తున్నారు.

రలో తమపాలు ధాన్యాన్ని దోచుకొని పోటానికి కొల్లేటి ప్రాంతంలో కొన్నిచోట్ల పాకలు వేయించి తమ ఏజంట్ల ద్వారా కొట్టించుచున్న కుప్పలవద్ద పుట్టికి 3 బస్తాలు చొప్పున బసవశంకరం గారూ, పుట్టికి ఐదు బస్తాల చొప్పున కనకయ్యగారు కొల్లేటిప్రాంతంపై వసూలతో వసూలు చేయుటకు పూనుకడం జరుగుతుంది. యీవిధంగా, పేదలకు గల కుంటూ, సెంటు - కొంపా గోడూ యావత్తు కొల్లేటి భూస్వాములు కాజేయటం మామూలైపోయింది.

కొల్లేటి ప్రజల కనువిప్పు

తమ బాధామయ జీవితాలనుండి తేరుకోవాలనే వాంఛ ప్రతివారిలోను అగుపిస్తోంది. కొల్లేటి ప్రజను దోచుకోటానికి కైకలూరు తాలూకానుండి శ్రీ బసవశంకరం - ఏలూరు తాలూకా నుండి శ్రీ కనకయ్య తమ కబంధ హస్తాలను చాచి కొల్లేటి ప్రాంతాన్ని రెండు వైపులనుండి దోచుకుంటున్నారనే విషయం ఆంధ్ర

దుగా నన్నందున గంగవెర్రులెత్తిన బసవశంకరంగారు తన స్వగ్రామమైన పోలుకొండలో 10 రోజుల్ల క్రితం వచ్చి పోయినీటిలో పైకితేలిన చేపలను తిన్నందుకు వారిచేనుల పేటపై దాడి చేయించి కనబడిన ప్రతి మాలజనాన్ని తీవ్రంగా కొట్టి హింసించి, కాస్త తెలివితేటలు గలవారిని ఎనిమిదిమందిని తీసుకపోయి పంచాయితీ ఆఫీసు దగ్గర కట్టివేసి తీవ్రంగా కొట్టించి, కాళ్ళ క్రిందుగా చేతులను పోనిచ్చి రెండు చెవులు పట్టుకోమని తీవ్రంగా హింసించాడు. మనిషి 1కి రు. 25 నుండి 30 రూపాయలకు జరిమానా విధించి అప్పటికప్పుడే కట్టించాడు. కట్టనివారి యిండ్లలోయున్న బిందె, చెంబు వగైరా సామానులమ్మించి డబ్బు కట్టించారు. ఆ రోజున భయపడి పారిపోయిన కూలీలు ఇద్దరు యీనాటికీ ఇల్లు చేరలేదు.

ఈ విషయం కొల్లేటి ప్రాంత ప్రజలంతా విని ఆశ్చర్య పడుచున్నారు. ఈరకంగా స్థానిక భూస్వాముల నిజ స్వరూపాలు ఒక్కొక్క ఘటన ద్వారా ప్రజలు గుర్తిస్తున్నారు.

దురాశాపూరితులైన భూస్వాములు

దాళ్వాక్రింద సాగుచేయబడుతున్న వేలాది ఎకరాల భూమిని తామే స్వయంగా సాగుచేస్తున్నట్లు పెనాల్టీ వగైరా యీ భూస్వాముల పేరనే వ్రాయించుకుంటున్నారు. అవకాశం చిక్కినపుడు యీ వేలాది ఎకరాలభూమిని గుటకాయస్వాహా చేయటానికి కావలసిన పకడ్బందీని చేసుకుంటున్నారనీ అనుమానించబడుతూంది. ఇదే రకంగా మరికొంతమంది స్థానిక భూస్వాములు ఆయా బంజర్లకు తామే పెనాల్టీలు చెల్లించి సాగుచేస్తున్నట్లు వ్రాయించుకొంటున్నారు. గ్రామ కరణాలు లంచాలు తినమరిగి అవినీతికి పాల్పడి కష్టించి సాగుచేయుచున్న పేదల నోళ్ళు కొట్టటానికి తయారయ్యారు.

గత అసెంబ్లీ సమావేశంలో బంజర్ల సమస్యపై గంజి నాగేశ్వరరావుగారు ప్రతిపాదించిన తీర్మానం ఏకగ్రీవంగా నెగ్గింది. ప్రభుత్వం ఎప్పుడు ఏ విధంగా అమలు పర్చేది ప్రకటించబడలేదు. ఈ తీర్మానం దృష్ట్యా భూస్వాములు కొందరు అనేక కుటిల యత్నాలకు పూనుకుంటున్నారు. భూస్వాములను అదుపులోనుంచి లంచగొండి ఉద్యోగుల నుండి రక్షణ కల్పించి ఏకగ్రీవంగా ఆమోదింపబడినపై తీర్మానాన్ని అమలుజరిపి, ఎన్నో సంవత్సరాలుగా బంజరు సాగుచేస్తున్న పేదరైతులను వ్యవసాయ కూలీలను కాపాడ వలసిందిగా ప్రభుత్వాన్ని కోరుచున్నాము. ఆంధ్ర అసెంబ్లీ సభ్యులు తామంతా ఏకగ్రీవంగా ఆమోదించిన యీతీర్మానాన్ని అమలుజరిపే బాధ్యత ప్రభుత్వం తీసుకొనేటట్లు ఒత్తిడి తేవాలని, యీ సందర్భంలో వ్యవసాయ కూలీలంతా అండగా నిలబడగలరనీ హామీ యిస్తున్నాము.

పేదప్రజలు సాగుచేస్తూన్న బంజరు భూములు యితరులు కాజేయకుండా సాగుచేస్తున్న పేదలకే ఆయా బంజరు భూములు దక్కేటట్లు వెంటనే తగు చర్య తీసుకోవాలని కూడా ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

రచయితలకు మనవి

విశాలాంధ్ర పుస్తక సమితి కోరు రచయితలు, తమ గ్రంథ ప్రతులను రెండేసి చొప్పున పంపించమనవి. లేనిచో సమీక్ష చేయడం సాధ్యపడదని గమనించ కోరుతున్నాము.



మాచ్‌ఖండ్ : డైవర్షన్ డామ్

క్ళను విరుచుక పడ్డారు. అనేక ఎత్తుగడలుచేసి ప్రజలనుండి వసూళ్లు చేస్తున్నారు.

పాలేళ్ళను కూలీలను ఎల్లప్పుడూ బానిసలుగా వుంచే ఎత్తుగడలు

కొల్లేరు ప్రాంత గ్రామాలలో గల స్థానిక భూస్వాములు తమ పాలేళ్ళను ఆర్థికంగా ఎప్పటికి కోలుకోనివ్వకుండా కృంగ తీయుటయేగాక శారీరకంగా రాత్రింబవళ్లు పనిచేయించి రక్త మాంసా

అసెంబ్లీలోజరిగిన తర్జన భర్జనలు, స్థానిక అధికార్లకు కొల్లేటి ప్రాంతంలో జరుగుచున్న కుటిల రీతిని అదుపులో వుంచేందుకు కేసులు పెట్టడం వగైరా, పేద ప్రజలకు మరింత ఉత్సాహాన్ని చేకూర్చాయి.

ప్రజల ఉత్సాహాన్ని అణగగొట్టే ఎత్తు

భూస్వామి కనకయ్య ఒకవైపు నుండి పోలీసులతో ప్రవేశించి, తన దోపిడీని కాపాడుకునేందుకు తిప్ప

పేదలు పండించిన దాళ్వాపంట భూస్వాముల పరం

[దాళ్వా సాగు యీ సంవత్సరం గ్రామాలవారీ పట్టిక]

వరుస నెంబరు	గ్రామం పేరు	పేదలు సాగుచేస్తున్న బంజరు ఎకరాల్లో	ఎ॥ 1కి పండే పంట ఎ॥ 1కి 10 బస్తాల చొ॥	భూస్వాములకు లంచాలు పుట్టికి 3 లేక 5 బస్తాలు
1.	పోలుకొండ శంకరపాడు	30	300	30 × 3 = 90
2.	గాజులపాడు	50	500	50 × 3 = 150
3.	ఉనికిలి	50	500	50 × 3 = 150
4.	నందిగం లంక	150	1500	150 × 3 = 150
5.	ఏటికట్టు వెంకటాపురం	150	1500	150 × 3 = 450
6. 7.	కాళింగులపేట, ఒడ్డెగూడెం	250	2500	500 × 5 = 2500
8.	ఇమ్మనివానిగూడెం	250	2500	
9. 10.	ఇంగిలింపాక, పెనుమాక	300	3000	
	మొత్తం —	880	12,300	3,790

దాళ్వా ధాన్యం పండిన మొత్తంలో భూస్వాములకు పోవుచున్న మొత్తం-డబ్బు రూపంలో బస్తా 14 రూ॥ల చొ॥న 53,060 రూ॥ల వరకు పేదలనుండి ప్రవాహంగా పోతుంది.

53 వేల రూపాయల దోపిడీ

దాళ్వా సాగుకు వస్తున్న నీరు (తుంగభద్ర ప్రాజెక్టునుండి వస్తున్న నీరు) తమ ప్రయత్నం ద్వారా వస్తున్నాయని, దీని కొరకు యెంతోడబ్బు ఖర్చుఅయిందని అమాయకపు ప్రజలకు చెప్పి యీ నీరుకు పంటచేలకు అందించేందుకు, కాల్వలు, బోదెలు వగైరా త్రవ్వుటకు మరమ్మత్తులకు మరికొంత డబ్బు ఖర్చు చేస్తున్నామని యింత పెద్ద మొత్తాన్ని పది గ్రామాలలో వసూలు చేస్తున్నారంటే ఎంత దారుణం జరుగుతుందో తెలుస్తుంది. ఈ దోపిడీ చేయుటలో భూస్వాములు కనకయ్య, బసవశంకరంగార్లు పోటీలు పడుతున్నారు. పోలీసు బలగాన్ని తెచ్చి కొల్లేటి ప్రజలను భయభ్రాంతులను చేసి తమ దోపిడీ ధాన్యాన్ని త్వర త్వరగా స్వాధీనం చేసుకుంటున్నారు — ఈ మధ్యనే ఆంధ్ర అసెంబ్లీలో వీరి దోపిడీవిధానం చర్చకురావటం, తద్వారా కొల్లేటి ప్రజలుకనుదెరచిన యెడల తమ దోపిడీ నిజస్వరూపం బయటపడుతుందనే భయంతో భూస్వాములు సాధ్యమైనంత తొంద

లను పిండి, శవాలనుచేసి విడిచి పెడుతున్నారు. భూస్వాముల మాటకు ఎదురుచెప్పిన పాలేరును ఎముకలు విరుగగొట్టిన పిస్సుటనే వదలటం జరుగుతోంది. ఉనికిలి గ్రామంలో ఒక భూస్వామి దౌర్జన్యానికి గురైన ఒక పాలేరు 7 నెల్లలోనే భూస్వామిచే కొట్టబడిన దెబ్బలతోనే మరణించాడు. ఏ పాలేరైనా తన కెదురు చెప్పటానికి తయారౌతున్నాడని భూస్వామి గుర్తిస్తే రక్తం కక్కించేటట్లు కొడతాడు. యీ విధమైన బాధలు నిత్యం మామూలయ్యాయి. ఈ రకంగా పేదల ప్రాణాలతో చెలగాటా లాడటమే గాకయే పాలేరుకైనా అప్పునిచ్చినప్పుడు దానికయ్యే 'హామీతో' సహా బస్తా 1కి రు 40-0-0 చొప్పున ఆయా మొత్తములు దామాషా ప్రకారం ప్రామిసరీ నోట్లు వ్రాయించుకొని, అప్పుతీర్చగానే ఆ నోట్లపై వసూలు పెట్టి యిచ్చే అలవాటు యీ ప్రాంతంలోని భూస్వాములకు లేదు. అడిగినా అలా చేసియివ్వరు. ఆ నోట్లు అలాగే వుంచి పేదలను బెదిరించటం, వెట్టిచాకిరీ చేయనప్పుడు “ప్లయింటు” చేసి వడ్డీ అసలుఫాయిదా

లేశాడు. తనఏజంట్లయొక్క ప్రచారంతో ప్రజలను హడల గొట్టించేందుకు పూనుకున్నాడు. దోపిడీ ధాన్యం దాటవేసుకోటానికి పోలీసులను తెచ్చుకొన్న యీ పెద్ద మనిషియొక్క ఏజంట్ల ప్రచారాన్ని ప్రజలెవ్వరూ విశ్వసించడంలేదు.

కొల్లేటి ప్రాంతంలో తనకు చుక్క



ఏ. వి. యం. వారి “సంఘం”లో రంగారావు.

పండుగనాడు

(3వ పేజీ తరువాయి)

“నూడు కొనిచ్చేను”

అమీనా గుండె బాదుకుంది. “ఎంత వెర్రి కొడుకో, రెండు గంటలయింది. పొద్దుట్నుంచి ఏమీ తినలేదు, తాగలేదు. ఈ చిమటా తీసుకొచ్చేవా? అంత సంతలో నీకీ చిమటా తప్ప మరేం కనిపించలేదు. ఆఖరికి ఈ ఇనప చిమటా తీసుకొచ్చేవా?”

హమీద్ నిందితుల్లాగ ముఖం పెట్టి — “పెనం మట్టుకున్నప్పుడు, నీ వేళ్ళు కాలుతున్నాయని ... అందుకనే ఇది తీసుకొచ్చేను.”

ఆ వృద్ధ స్త్రీ గుండె ద్రవించిపోయింది. ఎంతో ఆశ్చర్యపోయింది. ఆమె సంతోషంతో బరువెక్కి పుల్లురాలయింది. స్తుతిలో స్నేహం, ప్రేమ ఉన్నాయి. చెమట్లు కక్కాయి. ఎవరైనా మిఠాయి కొనుక్కు తింటారు. బొమ్మలు కొనుక్కుంటారు. వాళ్ళను ఎంత ఒపాసిగా చూచేవో, ఎంత నిగ్రహించుకున్నాడో అని అమీనామ్మ ఎంతో విచారించింది. అమీనా హృదయం తహతహలాడింది. అయితే ఒక విచిత్రం జరిగింది. హమీద్‌కు ఆచిమటా కంటె విచిత్రంగా ఉందీ ఘటన. హమీద్. వాళ్ళ మామ్మ అమీనా పాత్ర తీసుకున్నాడు. ముసలి అమీనా చిన్నపిల్ల అయింది. ఆవిడ ఏడ్వడము మొదలు పెట్టింది. ఆమె ప్రేమ, కట్టలు తెగి ప్రవహించింది. ఆమె నిమీలిత లోచనాలనుండి అనుకోకుండా ఆశీర్వచనాలు వల్లిస్తుంటే కళ్ళల్లోంచి పెద్ద పెద్ద అశ్రువులు రాలేయి. ఆ రహస్యం హమీద్‌కేం తెలుసు పాపం!

సినిమా వార్తలు

సోవియట్ పంచరంగుల చిత్రాల ఉత్సవం

ఈ నెల 10 వ తేదీ విజయవాడ లీలామహల్‌లో క్రొత్త రష్యన్ చిత్రాలు ప్రదర్శించబడుచున్నవి. ఒక రోజు మాత్రమే. సోవియట్ యూనియన్‌లో వ్యాయామ, కుస్తీ పోటీలు, వెయిట్ లిఫ్టింగ్, పార్లల్ బార్, బాక్సింగ్ పోటీలు గల చిత్రంకూడ కలదు.

అన్నా! పులి! కార్టూన్ చిత్రం

అన్న దమ్ములు వేట వెళ్తారు. వేటలో పులి కోపముతో అన్నదమ్ముల పైకి దుముకుతుంది. తమ్ముడు పారిపోయి యింటికి వస్తాడు. ఇంటివద్ద తల్లి అతనికి ధైర్యంగరపి అన్నను వెదకి తెమ్మంటుంది. దారిలో వున్నవారి నందరిని అడుగుతాడు. అనేకకష్టాల కోర్చి పులినిచంపి అన్నను కలుసుకుంటాడు.

ప్రపంచ యువజనోత్సవం

ఈ సంవత్సరం భారతదేశమంతటా తిరిగి సోవియట్ వైజ్ఞానిక ప్రతినిధులు తమ ప్రదర్శనములను చూపారు. ఇదే మాదిరి బుడాపెస్టులో ప్రపంచ యువజన క్రీడల పోటీల సందర్భంలో అనేక దేశాలవారిచ్చిన ప్రదర్శనాలు పంచరంగులలో చిత్రించబడ్డాయి.

ఏంజెల్సు హాలిడే

(జకోస్లవేకియా చిత్రం)

ఈ చిత్రంలో పౌరులు, కార్మికులు తమ సెలవు దినాలకు ఒక గ్రామం వెళ్తారు. వీరితోపాటు పాతభావాలుగల ఏంజెల్సు అనే వ్యక్తికూడ వుంటాడు. అతను సెలవంటే ఒంటరిగా హాయిగా వుండాలని భావిస్తాడు. ఇతరులతో కలవడు. తోటివారంతా ఆనందంగా కాలం గడుపుతూవుంటే ఒకరికొకరు సాయంచేసుకుంటూ అచ్చట శిథిలమైవున్న పాతశాలను బాగుచేస్తువుంటే ఏంజెల్సు ఏమీచేయకుండా కుక్క గొడుగులలో రకాలు పరిశీలిస్తూ వుంటాడు. ఈపరిశీలనలోవారున్న ఇంటి కరెంటు ఫ్యూజు చెడగొడ్తాడు. కాని తోటి పౌరులంతా దానిని సరిచేస్తారు. దానితో యితను వారిని అర్థం చేసుకొని పెద్దోళ్ళు సమావేశంలో తాను చేసిన పొరబాట్లు పాత అలవాట్లమూలాన ఎలా బాధపడింది వివరిస్తాడు. శ్రీమంతులుండదగిన సరోవరం తీరాన సామాన్యకార్మికుల శలవుల నివాసం, హాయినిచ్చే సమష్టి జీవితం యిందులో చూడవచ్చు.

రాజూ - పేద

బి. ఎ. సుబ్బారావు ప్రొడక్షన్సు వారు "Prince and Pauper" అనే యింగ్లీషు నవలను ఆధారంగా చేసుకొని తెలుగులో “రాజూ - పేద” అనే పేరుతో పూర్తిచేసిన చిత్రం. ఈ నెలలో ఆంధ్రదేశంలో విడుదలకు ప్రమియావారు సన్నాహాలు చేస్తున్నారు. డైరెక్షన్ బి. ఎ. సుబ్బారావు యన్. టి. రామారావు, రంగారావు, సుధాకర్ ముఖ్యులైన వారు నటించిన చిత్రం.

“పరివర్తన”

జనతా ప్రొడక్షన్స్‌వారు “పరివర్తన” అనే చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయాలని షూటింగ్ వేగంగా జరుపుతున్నారు. బహుశా జూలై మొదటి వారంలో విడుదల కావచ్చు. డైరెక్షన్ తాతినేని ప్రకాశరావు, కథ అనిసెట్టి, పినిసెట్టి. యన్. టి. రామారావు, [illegible]శ్వరరావు, సావిత్రి ముఖ్యపాత్రధారులుగా నటిస్తున్నారు.

భారతీయ కవి, కార్మిక సంఘ నాయకుడు మఖ్దూం మొహియుద్దీన్ మాస్కోలో వున్న దృశ్యం. ఈ ప్రసిద్ధ భారతీయ అతిధికి ఒక బడిపిల్ల, బాల సంఘ సభ్యుల “టై”ని బహూకరిస్తోంది.

గ్రంథపరిచయం

ఉక్కుపాదం

(మొదటి భాగం)

రచన అనువాదం
జాక్ లండన్ “ధనకుధరం”
వెల : 2-4-0
నగారా ప్రచురణాలయం
గుంటూరు-1.

జాక్ లండన్ అనే మహా మేధావి ఆంగ్లంలో వ్రాసిన “ఐరన్‌హీల్” అనే నవలకిది ఆంధ్రానువాదం. అందులోనూ మొదటిభాగం మాత్రమేకూడా.

ధనికతత్వానికి జాక్ లండన్ పెట్టిన పేరు ఉక్కుపాదం. ధనికవాదం అణిచి, నేలరాసివేసిన కోట్లకొలది జనం సమాజంలో మార్పుతీసుకొని రావాలని చేసే ప్రయత్నాలను గుత్తపెట్టుబడిదారీ విధానం ఏవిధంగా ఎదుర్కొగలదో, సోషలిస్టువిప్లవం ఏవిధంగా తప్పని సరిఅయి, కార్మికవర్గం “అధికారాన్ని” స్వీకరించడం తప్పనిసరి అవుతుందో 1907 లోనే స్పష్టపరచగలిగిన మేధావి జాక్ లండన్.

“మీ విప్లవవాదులందర్నీ మా పాదాలక్రింద [illegible]మల్ని [illegible]సినట్లు రాచేస్తాం. మీ మొగాల మీదుగా తొక్కుకుంటూ పోతాం... నేనూ, నాకు సంబంధించినవాళ్ళూ, మా తర్వాత వచ్చేవాళ్ళు అధికారంలో వున్నంతవరకూ వాళ్ళు (శ్రామికులు) అధోగతిలోనే వుంటారు. ఒక్కటేపదం వుంది. అది అన్ని పదాల్లోకీ రాజాపదం. అమాట - 'అధికారం' దేవుడు కాదు, ధనదేవతా కాదు, అధికారం.”

శ్రామికుల ఆందోళనకు ధనికవర్గం ఇవ్వగల సమాధానం ఇదొక్కటే. 1919 లో ఇటలీలో, 33 లో జర్మనీలో, ఇంకా ఇతరత్రా లభించిన సమాధానం అదే. ఈపుస్తకంలో మాదిరిగా గుత్తపెట్టుబడిదారులే ఆసమాధానం ఇచ్చారు.

దానికి ఉక్కుపాదంలోని నాయకుడు “ఎర్నెస్టు ఎవరోహార్డు” యిచ్చిన సమాధానం చూడండి.

“శ్రామికవర్గానికి మేము బోధించేది అదే. రుజుత్వానికీ, ధర్మానికీ, మానవత్వానికీ సంబంధించిన వినతులు మిమ్మల్నేమాత్రం కదలించవన్న విషయం మా కఠినానుభవాల ద్వారా బాగా తెలుసుకొన్నాం... కాబట్టే మేం అధికారాన్ని ప్రబోధించాం. ఎన్నికల రోజున మా బాలెట్ అధికారం ద్వారా మీదగ్గరనుంచి ప్రభుత్వాన్ని పడగుంజుకుంటాం.”

“బాలెట్ పెట్టెద్వారా మీరు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకొన్నప్పుడు, దాన్ని మీపరం చేయడానికి నిరాకరిస్తామనుకో.”

ధనికవాదంయొక్క ఈ ఆఖరు సవాలుకుకూడా ఎవరోహార్డునోట ఈ మాటలు చెప్పించాడు.

“ఆ విషయంకూడా మేం ఆలోచించాం... పదాలన్నింటిలోకీ అధికారం రాజాపదం అని మీరన్నారు. మంచిది... బాలెట్ పెట్టెద్వారా మేం అత్యధికబలంతో విజయాన్ని సాధించిన రోజున,... ప్రభుత్వాన్ని మీరు మాకప్పగించ నిరాకరించిన నాడు... బాంబులు, తుపాకులు, టాంకులు, తదితరమైన మారణాయుధాలద్వారా మేం మీకు తిరుగు సమాధానం చెప్తాం.”

కార్మికవర్గ నియంతృత్వావసరాన్ని జాక్ లండన్ అట్టే పదజాలంతో పని లేకుండా సూటిగా చూపాడు.

తెలుగులోకి వచ్చితీరవలసిన ఉత్తమ గ్రంథాన్ని తీసుకు వచ్చినందుకు అనువాదకులు శ్రీ ధనకుధరంగారిని తెలుగువాళ్ళు అభినందిస్తారు. ఆయన మిగతాభాగం కూడా త్వరగా తెస్తారని ఆశిస్తాం.

అనువాదం సాఫీగా వుంది.

ఇనపపాదాలు

రచన : జాక్ లండన్
అనువాదం : జి. సి. కొండయ్య
ఆదర్శగ్రంథ మండలి, విజయవాడ - 2
వెల : 4 రూపాయలు.

జాక్ లండన్ వ్రాసిన 'ఐరన్ హీల్'కే ఇదిమరొక అనువాదం. అయితే పుస్తకం పూర్తిగా వుంది.

మూలగ్రంథంయొక్క శిల్పాన్ని శ్రీ జి. సి. కొండయ్యగారి అనువాదం పూర్తిగ మరుగుపరుస్తూంది. వాక్యాలు, భావాలు కూడ అర్థంకానంత గజిబిజిగా వున్నాయి. చదువుదామన్నా నడవదు. రచనలో మార్దవం, సాఫీ, పటుత్వం ఏమీలేదు.

పుస్తకం పూర్తిగా వచ్చిందన్న సంతృప్తి తప్ప దీనివలన వేరొక ప్రయోజనం సాధించగలది లేదు.

ఈవిధంగా ఒకే పుస్తకాన్ని పోటీపడి ఇద్దరూ, ముగ్గురూ, ప్రచురించే దురలవాటు తెలుగులో ఏర్పడడం చాలా విచారకరం. ప్రపంచ సాహిత్యం అపరిమితం. మన తెలుగులోకి వచ్చినవి చాలాచాలా తక్కువ. ఒకే పుస్తకానికి పోటీపడి, డబ్బు వ్యర్థంచేయడం, పరిమితంగా వున్న మనమార్కెటును తల్లక్రిందులు చేసుకోవడం ఎందుకో అర్థం కాదు. మన ప్రచురణకర్తలుకూడా పట్టుమని ఓవెయ్యిప్రతులు ఒక్కమారు ముద్రించేటందుకు పెట్టుబడిపెట్టగలస్తోమతూ, అవకాశమూలేనివారే. మనపాఠకులుకూడా పట్టుమనిపదిపుస్తకాలు కొనగల ఆర్థిక శక్తి కలవారుకూడా కాదు. ఈ స్థితిలో పోటీ అనేది మంచి పుస్తకాలను, బాగా అర్థం అయ్యే శైలిలో అందుబాటయ్యే ఖరీదులో తెచ్చేటందుకు జరగడం వుచితం. అంతేగాని ఈ మాదిరిగా ఒకే పుస్తకాన్ని ఇద్దరూ ముగ్గురూ తేవాలనుకోవడం, పోటీపడడం బాగాలేదు.

ఇంక ముందయినా మంచి పుస్తకాలకు, మంచి అనువాదాలు తెచ్చేటందుకు పోటీయేగాని, ఒకే పుస్తకానికి చెత్త అనువాదాలు తెచ్చే పోటీ విరమించబడుతుందని ఆశిస్తాం.

కథాసాగరం

రచన :
శ్రీ అట్లూరి పిచ్చేశ్వరరావు
వెల : ఒకరూపాయి
ప్రాప్తిస్థానం :
దేశకవితామండలి
విజయవాడ-2.

దేశకవితామండలి ఆంధ్రలోని ప్రముఖ కథారచయితల రచనల్ని సమీకరించి తెస్తున్న కథాసంపుటాలలో ఇది ఏడవది. శ్రీ అట్లూరి పిచ్చేశ్వరరావుగారి కథలు ఇందులో సంగ్రథితం.

ఆంధ్ర యువకథా రచయితలలో శ్రీ ఏపియార్‌కు మంచిపేరేవుంది. ఆయన కథలలో విస్తృతమైన జీవితానుభవాలు, సూక్ష్మమైన పరిశీలన, లోతయిన భావసంపద ప్రతిబింబిస్తుంటాయి.

ప్రస్తుత కథాసంపుటిలో ఆయన కథలు పదిహేను సమీకరించబడ్డాయి.

మొదటికథ జీవచ్ఛవాలు. అమెరికా అంటే బయటి ప్రపంచానికి కనబడేదీ, లోపలి ప్రజలకి అనుభూతం అయ్యేదీ ఒకటి కాదు. మాతృత్వం తొణికిసలాడుతుండే స్వాతంత్ర్య విగ్రహాన్నీ, ఆకాశహర్మ్యాల్నీ, యంత్రాల్నీ చూసి పైవారు దానిని “భూతలస్వర్గం” అంటే అనుకోవచ్చు. కాని ఆ దేశ ప్రజల భావంలో మాత్రం ఆ అర్థం రాదు.

ఆ దేశంలోని సాధారణ వ్యక్తి ఆలోచనలు కేవలం భిన్నం. తన రెక్కలతోపాటు మెదడూ అమ్ముకోవాలని అతను విచారపడతాడు. అన్నీ తెలిసిన మనిషికంటె ఏమీ తెలియని మొద్దు హాయిగా బ్రతుకుతాడని సిద్ధాంతీకరించే గ్రంథాలకు ప్రభుత్వం ప్రోత్సాహం.

ఆనాగరికత మనుష్యుని జీవితపరమావధినిచంపడం, చావడంగా తయారుచేసింది. దానికే దారిమిగిల్చింది. సైన్యాలలో చేరితే చావు తప్పదనే భయం వుంది. కాని “చేరకుంటే చచ్చిపోతాన్నారు. తిండి... సిగరెట్లు ... బీరు... స్నేహితురాళ్లు దొరకరన్నారు. అయితే చేరే చస్తానన్నాను” ... అంటాడు కథలోని డిక్.

అమెరికను నాగరకత మానవుడు బ్రతకడానికీ, చావడానికీ మిగిల్చిన ఈ ఒక్కదారీ చూస్తున్న అమెరికను ప్రజకు మాతృత్వం తొణికిసలాడే స్వాతంత్ర్య విగ్రహం ముఖం కనబడ్డం లేదు. వాళ్లు చూస్తున్నది ఆవిగ్రహం వీపు మాత్రమే. వాళ్ళు చూడగలది కూడా అంతే.

రెండోది మనదేశపు స్వాతంత్ర్య యోధుల” నెత్తురు కథ”

స్వాతంత్ర్యం రాకముందు మనదేశపు సామాన్య మానవుడు పెట్టుకొన్న ఆశలకోసం స్వాతంత్ర్యం వచ్చాక కూడా పోరాడక తప్పలేదు. రక్తం ప్రవహింపజేయక తప్పలేదు.

స్వాతంత్ర్యం వచ్చేవరకూ గుటకలు మ్రింగిన జగల్ కిల్లు స్వాతంత్ర్యంవచ్చాక నెత్తిమీద గాంధీ టోపీని, ముడ్డి క్రింద అసెంబ్లీ సీటునూ సంతరించుకొన్నారు.

లాఠీలు పుచ్చుకున్న వాళ్ళ రాజ్యం పోవాలని ప్రజ కోరింది. లాఠీలు పోయాయి. కాని, ఈ మారు వాని స్థానంలో తుపాకులు వచ్చాయి. శాంతి భద్రతల ఆవలింతలు, వొళ్ళువిరుపులతో భారత ప్రజ నెత్తురు పూర్వంలాగే ప్రవాహం కడుతూంది.

భారత నౌకా విప్లవ ఘటనల్నీ, ఆంధ్రదేశంలో పోలీసు తుపాకుల పరిపాలన ఘటనల్నీ, పతిత జీవితంలో మానవత్వాన్నీ, ఉత్తుంగ పీఠాలలోని పతనాలను తెలుపుతున్న చిన్న చిన్న కథలతో ఏపియార్ ఆంధ్ర పత్రికాలోకాన్ని ఊగిసలాడించారు.

—రామ మోహన్

విజయవాడ

విజయవాడ జైహింద్ యువజన సంఘ కార్యవర్గంవారు ఇటీవల సమావేశమై భారతదేశ ఫ్రెంచి స్థావరాలను వెంటనే భారతదేశంలో విలీనం చేయాలనీ కోరుతూ తీర్మానించారు.

మారణ ఆయుధాల నిషేధానికి తీవ్రతర ఉద్యమం

ప్రపంచ శాంతిసమితి అభ్యర్థన

ప్రపంచ శాంతిసమితి అత్యవసర సమావేశం మే 24 న బెర్లిన్ లో ప్రారంభమయింది. సోవియట్ యూనియన్, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, భారతదేశం, పాకిస్తాన్, ఇటలీ, పోలెండ్, జకోస్లవేకియా మొదలైన అరవైదేశాల నుండి శాంతి ఉద్యమ నాయకులు వచ్చారు.

భారతదేశంనుండి పండిట్ సుందర్‌లాల్, డాక్టర్ ముల్కరాజ్ ఆనంద్, డాక్టర్ కుమారప్ప, రమేశ్ చంద్ర, మేజర్ జనరల్ సోఖే ప్రభృతులు వచ్చారు.

పాకిస్తాన్ నుండి తూర్పు బెంగాల్ విశ్వసంఘటన నాయకులలో ఒకరగు మౌలానా భాషానీ వచ్చారు.

ప్రపంచశాంతి సమితి ఉపాధ్యక్షులు కోమో-జో సమావేశాన్ని ప్రారంభించారు. ఆయన తన ప్రారంభోపన్యాసంలో ఇలా తెలియజేశారు.

"ఒక నెల రోజుల క్రితమే, శాంతి ఉద్యమం పంచమ వార్షికోత్సవం జరుపుకొంది. శాంతి ఉద్యమం అనేక విజయాలను సాధించింది. సంప్రతింపుల ద్వారా, అంతర్జాతీయ ఉద్రిక్తవాతావరణాన్ని సడలించాలనే భావాన్ని క్రమం అందరూ గుర్తించుతున్నారు. కొరియాలో యుద్ధవిరమణ జరగాలని మనం కోరాం. గత సంవత్సరం కొరియాలో యుద్ధవిరమణ జరిగింది. ఇండోచైనాలో కూడా యుద్ధవిరమణ జరగాలని మనం కోరుతున్నాం. ఆ విషయమై జెనీవాలో చర్చలు జరుగుతున్నాయి.

"విజయాలు సాధించినా మనం అన్నివిధాలా ఇంకా ప్రయత్నాలు కొనసాగించుకొనే వుండాలి. అణు ఆయుధాలను నిషేధించాలనే కోరిక ఇంకా నెరవేరలేదు. పైగా వాటిని ఉపయోగించుతామనే బెదిరింపు హెచ్చుతూంది. వివిధ దేశాలమధ్య సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పడానికి అవరోధాలు ఇంకా ఉండనే ఉన్నాయి.

"శాంతి కాముక ప్రజలందరి కోరికలను నెరవేర్చాలంటే, యుద్ధప్రమాదాన్ని తొలగించి, ఆసియాలోను, యూరప్‌లోను, ప్రపంచమంతటా సమిష్టి రక్షణ విధానాన్ని అవలంబించుటద్వారా శాంతిని బలపరచాలి. మానవ మారణ ఆయుధాలను ఉత్పత్తిచేయడంగాని ఉపయోగించడంగాని కూడదని నిషేధించాలి."

ప్రపంచ శాంతి సమితి అధ్యక్షుడు జోలియో క్యూరీ దురదృష్టవశాత్తు అనారోగ్యకారణంగా ఈ సమావేశానికి రాలేకపోయాడని కోమో-జో తెలియజేశాడు. ఆయన ఆరోగ్యాన్ని కాంక్షించుతూ అభినందన తీర్మానాలను పంపించవలసిందిగా కోమో-జో కోరాడు.

బెర్లిన్ ప్రజల తరఫున సమావేశానికి ఫ్రెడరిక్ ఎబెర్ట్ ఆహ్వానం ఇచ్చాడు.

ప్రపంచ శాంతి సమితి కార్యదర్శి జీన్‌లాఫిటీ ప్రతిపాదించిన ఈ రెండు అంశాలపై చర్చలు జరిగాయి.

1. అణు, హైడ్రోజన్ బాంబుల నిషేధం.
2. వివిధ దేశాలభద్రత.

చర్చనీయాంశాలను సమావేశం అంగీకరించాక, బ్రిటిష్ శాంతి సమితి అధ్యక్షుడు డి. యన్. ప్రిట్ ఉపన్యసించాడు.

శాంతిఉద్యమ కార్యకర్తల కర్తవ్యాలను ప్రిట్ వివరించాడు. నిరాయుధీకరణ, జర్మన్ సమస్య, యూరప్ భద్రత, దూరప్రాచ్య సమస్యలు, ఆసియాలో భద్రత, అంతర్జాతీయ వర్తకంలోను, సాంస్కృతికరంగంలోను వివిధ దేశాలు పరస్పర సంబంధాలను వృద్ధిచేసుకొనుట మొదలైన విషయాలను ప్రిట్ విపులంగా వివరించాడు. ఈ క్రింది విషయాలపై శాంతి ఉద్యమ కార్యకర్తలు కృషి చేయాలని ప్రిట్ విశ్లేషించాడు.

మారణాయుధాల నిషేధించాలి. ఇతర ఆయుధాలను తగ్గించాలి. ప్రధాన ప్రపంచసమస్యలను ముఖ్యంగా కొరియా, ఇండోచైనా సమస్యలను పరిష్కరించాలి. జర్మనీని ఐక్యపరచాలి. వర్తకం, సైన్సు, కళలు, సాహిత్యం, వ్యాయామ క్రీడలు మొదలైన విషయాలలో వివిధ దేశాలమధ్యనున్న ఆటంకాలను తొలగించి సత్సంబంధాల నెలకొల్పాలి సహకారం సంపాదించుకోవాలి—ఇవీ శాంతి ఉద్యమ కార్యకర్తల ప్రధాన కర్తవ్యాలని ప్రిట్ వివరించాడు.

తర్వాత జపాను, పోలెండు, భారతదేశం, బ్రిటన్ ప్రతినిధులు మాట్లాడారు. అటం, హైడ్రోజన్ బాంబుల నిషేధానికి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఉపన్యాసకులంతా కోరారు.

తర్వాత డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ సందేశం చదువబడింది. (కిచ్లూ సందేశాన్ని వేరే ప్రకటించుతున్నాం. సం-)

మే 25 వ తేదీన యుజినీకాటన్ అధ్యక్షతను తిరిగి సమావేశం ప్రారంభమయింది. గ్రీస్, బల్గేరియా, జర్మనీ, ఫిన్లాండ్, ఆస్ట్రియా ప్రతినిధులు మాట్లాడారు. అంతర్జాతీయ విద్యార్థి సంస్థ నాయకుడు ఇర్జి పెలికాన్, అంతర్జాతీయ రసాయన పరిశ్రమ కార్మిక సంఘాధ్యక్షుడు ఫెరన్క బార్ సోకీ, సుప్రసిద్ధ సోవియట్ రచయిత నికొలై టిఖనోవ్, ఫ్రెంచి రచయిత జీన్ పాల్ సార్త్రే, తదితరులూ పాల్గొన్నారు.

వివిధ దేశాల భద్రతను గురించి 26 వ తేదీన చర్చ ప్రారంభమయింది. ఆ చర్చలలో పండిట్ సుందర్‌లాల్, జకోస్లోవేకియా, పోలెండ్ ప్రతినిధులు చైనా ప్రజా రిపబ్లిక్ శాంతి ఉద్యమ నాయకుడు కోమోజో ప్రసంగించారు. (కోమో-జో ప్రసంగాన్ని వేరే ప్రకటించుతున్నాం.—సం.)

వెలువడింది!
విశాలాంధ్ర దినపత్రికలో సీరియల్‌గా ప్రకటించిన
అనువాదం: పిచ్చేశ్వరరావు
గోదాన్
రచన: ప్రేమచంద్
గ్రామీణ జీవితాన్ని అత్యంత స్వాభావికంగాను, నైపుణ్యంతోను, చిత్రించి, ప్రేమచంద్ రచనల్లో మేలిరత్నంగా వెలుగొందుతున్న నవలారాజము.
సుగం క్యాలికో బైండు : మేలురకం ఆర్టుపేపరుపై ముద్రించిన కవరుతో
500 పేజీలు వెల: రూ 3—12—0
(పోస్టేజి అదనం)
ప్రతులకు :
విశాలాంధ్ర ప్రచురణాలయం
బకింగ్‌హాంపేట పోస్టు విజయవాడ.2

'ఆసియా ప్రజల భవితవ్యాన్ని నిర్దేశించేది వలసపరిపాలకులుగాదు'

'ఆసియా రాజ్యాల సమిష్టి భద్రత ప్రపంచ శాంతికి దోహదం చేస్తుంది'

///

ప్రపంచశాంతి సమితి ఉపాధ్యక్షుడు కొమోజో స్పష్టీకరణ

ఆసియాలో ప్రధానమైన మార్పులు వచ్చాయి. ఆసియా ప్రజల భవిష్యత్తును వలస పరిపాలకులు నిర్ణయించే రోజులు పోయాయి — అని ప్రపంచ శాంతి సమితి ఉపాధ్యక్షులు కొమోజో బెర్లిన్ శాంతి సమావేశంలో హెచ్చరించారు.

ప్రపంచ శాంతి సమితి సమావేశంలో మే 26 వ తేదీన ప్రపంచ శాంతి సమితి ఉపాధ్యక్షుడు కోమో-జో ఇలా ఉపన్యసించాడు.

"జెనీవా సభ గత నెల దినాలుగా కొనసాగుతూంది. అక్కడ జరిగే ఘటనలపట్ల మనకు ఆందోళన హెచ్చుతూంది. అక్కడ చర్చించే విషయాల ప్రాధాన్యత, క్లిష్ట స్వరూపము మనమూ గుర్తించుతున్నాం. కాని ఈ విషయాలను ఆ ప్రతినిధులు ఉత్సాహంతోను, విశ్వాసంతోను చర్చించితే ఈ ఆందోళనకు కారణం వుండదు. కాని దానికి భిన్నంగా జరిగింది."

ఇండోచైనా కొరియాసమస్యలపై జెనీవా సభలో జరిగిన చర్చలను పేర్కొని, కోమో-జో యింకా యిలా అన్నాడు:

"జెనీవాసభలో మనకు ఒకటి స్పష్టమవుతూంది. జెనీవాసభకు ప్రతిబంధకాలు కల్గించి అవసరమైతే భగ్నం చేయాలని కొందరు ప్రయత్నించారు. అమెరికా పాలకవర్గాలవారు ఆపని చేశారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త వాతావరణాన్ని కల్గించడం అమెరికా విధానం.

"జెనీవాసభ ప్రారంభమయ్యేముందు అమెరికా పాలకులు, వారి ప్రచారక శాఖవారు, ఈసభా ఫలితాలనుగురించి నిరాశను వ్యాపింపచేశారు. ఈసభవల్ల ప్రయోజనం లేదన్నారు. ముఖ్యంగా అమెరికా విదేశాంగ మంత్రి డల్లెస్, అలవాటుప్రకారం మోసంచేయ ప్రారంభించాడు. అతడు 6 రోజులు మాత్రమే జెనీవాసభలో పాల్గొన్నాడు. ఇండోచైనాలో శాంతిని పునస్థాపించే విషయమై చర్చించడానికి అతడంగీకరించాడు. కాని మరోప్రక్క "ఆగ్నేయ ఆసియా రక్షణ కూటమి"కి కుట్రలు పన్నుతూనే వున్నాడు. ఇందుకోసం బ్రిటన్, ఫ్రాన్సులకు వెళ్ళి వాటి మెడలు వంచడానికి ప్రయత్నించాడు. తర్వాత తిరిగి అతడు అమెరికాకు ఎందుకు వెళ్ళిపోయాడు ? "ఆగ్నేయాసియా కూటమి"కి ప్రయత్నాలు కొనసాగించుతున్నానని డల్లెస్ స్పష్టం చేయనే చేశాడు.

ఆగ్నేయాసియా కూటమికి అమెరికా ఆతురత

"ప్రియమైన మిత్రులారా ! 'ఆగ్నేయాసియా కూటమి'కి అమెరికా పాలకులు ఎందుకంత ఆదుర్దా పడుతున్నారు. ఆసియానుండి తన పాత పోటీదార్లను, బ్రిటన్ ఫ్రాన్సులను తన్ని వేయాలని ప్రయత్నించుతున్నారు. పసిఫిక్ సముద్రాన్ని 'అమెరికాసముద్రం'గా మార్చాలని ప్రయత్నించుతున్నారు. 'ఆగ్నేయ ఆసియా కూటమి' నిర్మాణం వంక ఒకసారి చూద్దాం. అందులో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్, ఇండోచైనాలోని పతనోన్ముఖమైన మూడురాష్ట్రాలు.

"ఫ్రెంచి పాలకులు కూడా మోసానికి పూనుకొన్నారు. ఫ్రెంచి ప్రజల, ప్రపంచ ప్రజల అభిప్రాయానికి భయపడి, రాజీ సంప్రతింపులకు సిద్ధమైనట్లు యీ అమెరికా అనుచరులు నటించుతున్నారు. మరో ప్రక్క అమెరికా సైనికసహాయాన్ని కోరుతున్నారు. జెనీవాలో బెడెల్ స్మిత్, ఫ్రెంచి విదేశాంగ మంత్రి బిదాల మధ్య కుట్రలు కొనసాగుతున్నాయి. ఫ్రెంచి ప్రజలు ఇండోచైనా యుద్ధాన్ని ఎన్నడో 'తుచ్ఛయుద్ధం'గా పేర్కొన్నారు. ఐనా ఫ్రెంచి పాలకవర్గాలు యుద్ధాన్ని కొనసాగించాలనే అంటున్నారు. అలా యుద్ధం కొనసాగించడం అంటే ఇండోచైనాను అమెరికాకు తాకట్టు పెట్టడం అని తెలిసి కూడా వారందుకు సిద్ధమౌతున్నారు."

తర్వాత సుసంప్రదాయాలు కల్గిన ఫ్రెంచి ప్రజలను కోమోజో అభినందించాడు. తాను ఫ్రెంచి ప్రజలను నిందించడంలేదనీ అమెరికా డాలర్ల సహాయం పొందే పాలకవర్గాలను నిందించుతున్నానని అన్నాడు.

చైనా ప్రజలూ, ప్రభుత్వమూ, శాంతిని కోరుతున్నారనీ, యుద్ధాన్ని ద్వేషిస్తున్నారనీ, ఈ విషయాన్నే చౌ-ఎన్-లై జెనీవాసభలో స్పష్టీకరించగలడనీ కోమో-జో జెనీవాసభ విజయాన్ని తాము కోరుతున్నామన్నాడు. ఆసియాలో జరుగుచున్న తీవ్రమైన మార్పుల గురించి ఆయన ఇలా అన్నాడు.

"ఆసియాలో ప్రధానమైనమార్పులు వచ్చాయి. ఆసియా ప్రజల భవితవ్యాన్ని వలసపరిపాలకులు నిర్దేశించే రోజులు గతించాయి. అలాగే ఆసియా సమస్యలపై ఆసియా ప్రజలకు హక్కులేకుండా చేసేరోజులు గడచిపోయాయి. ఇందుకు మనం సంతోషించాలిసిందే. అయితే కొద్దిమంది మొండికపు వలస పరిపాలకులు, ముఖ్యంగా అమెరికా పాలకవర్గం, వాస్తవాన్ని చూడ నిరాకరించుతున్నారు.

సమిష్టి భద్రత

"యూరప్ సమస్యలాంటిదే ఆసియా సమస్య అని భావించుతున్నాను. యూరప్‌లో శాంతికి, ప్రజల అభివృద్ధికి ప్రధానమైనది సమిష్టి భద్రత. అలాగే ఆసియాప్రజలశాంతికీ అభివృద్ధికీ కూడా ఆసియా సమిష్టి భద్రత అవసరం. ఆసియాలోని అన్ని దేశాల జాతుల సుస్థిరశాంతికోసం, కొరియా ఇండోచైనా సమస్యలు పరిష్కారం కావాలి. అంతేగాదు. ఆసియా దేశాలన్నిటితో కూడిన ఒకసమిష్టి భద్రతా పథకం ఏర్పాటుచేసుకోవాలి, ఆ విధంగా మాత్రమే ఆసియాలో శాంతి స్వాతంత్ర్యాలకు రక్షణ వుంటుంది. దీనికి ముందుగా అవసరమైన షరతు లేమిటి? వలస రాజ్యాధిపతులు ఆసియాలో జోక్యం కల్గించుకోకుండా ఉండటమే. ఆసియారాజ్యాలు పరస్పరస్వతంత్రాన్ని సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి. ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం కల్గించుకోరాదు. తమలో తమకుగల విభేదాలను బెదిరింపులు, దౌర్జన్యాల ద్వారాగాక శాంతి యుతమైన రాయబారాల ద్వారా పరిష్కరించుకోవాలి. ఆసియా దేశాలు వివక్షణా విధానాన్ని, నిర్బంధాలను వదలివేసి, తమ అందరిలాభంకోసం, సమాన హోదాతో ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పుకోవాలి. ఆసియాలో సమిష్టి భద్రతకు ఇవి ముఖ్యమైన షరతులు. వాటిని జెనీవా సభలో చైనా ప్రధాని చౌ-ఎన్-లై ప్రతిపాదించాడు.

గొప్ప చరిత్రగల దేశాలు

"ఆసియా దేశాలు, వలస పరిపాలనా కాలంలో ఆర్థికంగా వెనుకబడివున్నా, వాటికి ప్రతి దానికీ గొప్ప చరిత్ర వుంది. అతి ప్రాచీనకాలంనుండీ సంస్కృతి వుంది. ఆసియా ప్రజలు కష్టజీవులు. ఆసియాలో మంచి ప్రకృతి సంపదలూ, ఖనిజసంపదలూ వున్నాయి. వాటిని పెంపొందించవచ్చు.

"పైన చెప్పిన విధంగా సమిష్టికృషి చేసినట్లయితే, మన దేశాలు శాంతియుతంగా ప్రక్క ప్రక్కనే నివసించవచ్చు. ఆసియాలో శాంతి భద్రతలను కాపాడవచ్చు. ఆ విధంగా ప్రపంచ శాంతిని కాపాడవచ్చు."

తర్వాత చైనాలో జరుగుతున్న శాంతియుత నిర్మాణాన్ని గురించి కోమోజో వివరించి ఇలా అన్నాడు.

"మూడువేల ఏండ్లక్రితమే మా దేశంలో ఒకసూక్తివుంది. అది: 'మానవులంతా సోదరులే' అని, ఈనాటికీ మా సిద్ధాంతం అదే. మేము యితరులపై దండెత్తం. ఇతరులు దండెత్తితే లొంగిపోము.

"ఇండో-చైనా, కొరియా సమస్యలపై జెనీవాసభ పరిష్కారం చేయాలనీ, చేయగలదనీ నా విశ్వాసం. జెనీవాసభ ప్రభావం నేటి అంతర్జాతీయ పరిస్థితులపై చాలా వుంటుంది. శాంతి అంటే భయపడే వారిపైన, యుద్ధాన్ని రెచ్చగొట్టే వారిపైన ఒత్తిడి తెచ్చి, ప్రపంచ శాంతికాముక ప్రజలు జెనీవా సభ సాధ్యమయ్యేటట్లు చేశారు. అమెరికా యుద్ధోన్మాదులు, వారి అనుచరుల విధ్వంసక కృత్యాలు నెరవేరకుండా, శాంతికాముక ప్రజలు జాగరూకతతో మెలగినప్పుడే జెనీవా సభ జయప్రదమౌతుంది. శాంతిని కాపాడాలనీ, వివిధ దేశాల స్వాతంత్ర్య సార్వభౌమాధికారాలను రక్షించాలనీ ప్రజలు నిరంతరం ఆందోళన చేసినపుడే శాంతి ఆశయానికి విజయం లభించుతుంది."

సామ్రాజ్యవాద పీడిత ప్రజలకు ఆశాజ్యోతి చైనా

///

ప్రపంచశాంతిసమితికి డాక్టర్ కిచ్లూ సందేశం

"వీరోచితమైన పోరాటం ద్వారా సామ్రాజ్యవాద దాస్యం నుండి విముక్తిచెందిన నవచైనా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజలను ఉత్తేజపరచింది. అలాంటి చైనా మహా ప్రజలకు చిహ్నం చౌ-ఎన్-లై" అని బెర్లిన్‌లో జరుగుతున్న ప్రపంచ శాంతి సమితి సమావేశానికి ఇచ్చిన సందేశంలో అఖిల భారత శాంతి సమితి అధ్యక్షుడు డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, నవచైనా శాంతి కాముక పాత్రను ప్రశంసించాడు.

ప్రపంచ శాంతిసమితి బెర్లిన్ లో మే 24 న ప్రారంభ మయింది. ఆ సందర్భంలో అఖిల భారత శాంతి సమితి అధ్యక్షుడు డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ పంపిన సందేశాన్ని, ప్రధాన కార్యదర్శి శ్రీ రమేశ్‌చంద్ర చదివి వినిపించారు.

డాక్టర్ కిచ్లూ తన సందేశంలో ఇలా తెలియజేశారు.

"వివిధ దేశాలనుండి వచ్చిన స్నేహితులకు సహచరులకు భారతదేశం తరఫున భారత ప్రజల తరఫున నా అభివందనాలను తెలియజేస్తున్నాను. ముఖ్యంగా భారత దేశ శాంతి వుద్యమం తరఫున అభివందనాలు తెలియచేస్తున్నాను.

"ప్రపంచ శాంతిసమితి ఈ ప్రత్యేక సమావేశానికి అనారోగ్య కారణంగా నేను హాజరు కాజాలనందుకు చాలా విచారించుతున్నాను.

"ఈ సమావేశాన్ని ఆసియా ప్రజలు అత్యంత ఆసక్తితో పరిశీలించుతున్నారు. ఈసమావేశం చర్చించుతున్న విషయాలలో మాఖండానికి ప్రత్యేకంగా వర్తించే సమస్యలున్నాయి. ఏప్రిల్ 26 న జెనీవా సమావేశం ప్రారంభం కావడంతో, ప్రపంచదృష్టి అంతా, కొరియా, ఇండోచైనా సమస్యలవైపు మరలింది.

"బెర్లిన్‌లో అగ్రరాజ్య విదేశాంగ మంత్రుల సమావేశం జరిగిన రెండు నెలల తర్వాత జెనీవా సమావేశం జరుగుతోంది.

"ఈ రెండు నెలల కాలంలోను ఆసియా ప్రజలు శాంతి స్వాతంత్ర్యాలకై సాగించే పోరాటం ఇదివరకెన్నడూ లేనంత పెద్ద ఎత్తున కొనసాగుతూంది.

"ఆసియాకు సంబంధించిన రెండు పెద్ద సమస్యలను చర్చించడానికి జెనీవా సభ సమావేశమవుతోంది. అందులో చైనా కూడా పాల్గొంటుందని ప్రకటించడమే ఆసియాలోని శాంతికాముక శక్తులకు ఒక అఖండ విజయం. 50 కోట్ల చైనా ప్రజల ప్రతినిధులను ప్రపంచ సమావేశాలకు రాకుండా బహిష్కరించుతూ వచ్చారింతవరకూ. కనీసం ఇప్పుడైనా చైనావాణి వినపడుతూంది. ప్రత్యేకంగా ఈ కారణం చేత, జెనీవాసభ జరపాలని బెర్లిన్ లో నిర్ణయించినపుడు ఆసియా యావత్తూ సంతోషించింది.

"చైనా ప్రజారిపబ్లిక్ ప్రభుత్వ ప్రాతినిధ్యం గురించి బెర్లిన్‌లో చర్చ వచ్చినపుడు అమెరికా విదేశాంగ మంత్రి డల్లెస్ "చౌ-ఎన్-లై ఎవడు? " అని ప్రశ్నించాడు. చైనా ప్రజలు సామ్రాజ్య వాదంనుండి విముక్తికై వీరోచితమైన పోరాటాన్ని విజయవంతంగా సాగించారు.

ఈ పోరాటం విదేశీదాస్యంనుండి ఇంకా విముక్తి చెందని ఆసియా, ఆఫ్రికా ప్రజలనేగాక లాటిన్ అమెరికా ప్రజలను సైతం ఉత్సాహపరచింది. అలాంటి చైనా మహా ప్రజలకు చిహ్నంగా చౌ-ఎన్-లై పేరునిలబడుతూంది.

"నేను జెనీవాలో చైనా ప్రధాని చౌ-ఎన్-లై చేసే ప్రసంగాలను ప్రపంచమంతా అత్యంత గౌరవంతోను శ్రద్ధతోను వింటున్నారు. ప్రపంచ సమావేశాలలో తనకు న్యాయంగా రావలసిన స్థానాన్ని పునరుజ్జీవితమైన ఆసియా సంపాదించుకొంటూ వున్నది.

"సామ్రాజ్యదేశాలతో సమానహోదాలో ఆసియా వుండరాదని కొందరు వాదించుతున్నారు.

ఈ కారణం చేతనే జెనీవా సమావేశం జరపాలనే నిర్ణయానికి ప్రపంచమంతా హర్షించుతూ వుండగా, కొద్దిమంది మాత్రం జెనీవాసభ జరగకుండా చేయాలని చాలా ప్రయత్నాలు చేశారు.

"బికినీ దీవులలో హైడ్రోజన్ బాంబుల ప్రయోగాలను భారత దేశ ప్రజలేగాక యావదాసియా ప్రజలు తీవ్రంగా గర్హించారు. మహాప్రమాదానికి గురి అవుతున్న జపాను సోదరుల స్థితి జూచి మా గుండెలు పగిలి పోతున్నాయి. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వాలు ప్రజలూ చేసిన విజ్ఞప్తులనూ, డిమాండ్‌లనూ లెక్క చేయకుండా, ఈ ప్రయోగాలను ఇంకా కొనసాగించుతూ వుంటే మా గుండెలు మండి పోతున్నాయి.

"నేడు జెనీవాలో సాగుతున్న సంప్రతింపులు ప్రపంచ ప్రజలకు శాంతిని కొనితెస్తాయని ఆశించుతున్నాం."

ఆంధ్ర శాసనసభ వాల్తేరు సమావేశం

(2 వ పేజీ తరువాయి)

గురించి చర్చించాలని పట్టుబడితే, ఆవిషయం చర్చించి తేల్చుకోవటం ప్రజాస్వామికం మనిపించుకుంటుంది. కాని ప్రభుత్వపక్షాలకు యిది పట్టలేదు. కనీసం ప్రజాస్వామిక ప్రతిపక్షం అని చెప్పుకునే ప్రజాసోషలిస్టు పార్టీకి, కృషీకార్ లోక్ పార్టీకి, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారికి, పి. డి. పి కి సహితం యిది గిట్టలేదు. కనుక ఆ తీర్మానం చర్చకు రాకుండా పోయింది. ఏమైనప్పటికీ సభాకార్యక్రమం సాఫీగా జరిగేందుకు ప్రభుత్వపక్ష సహకారమెంత అవసరమో ప్రతిపక్ష సహకారం కూడా అంత అవసరమని శాసనసభల అనుభవం చాటి చెబుతూనే వున్నది.

ముగింపు

మన మంత్రివర్గానికి కుర్చీలను అంటిపెట్టుకునే విధానం మినహా మరే నిర్దిష్ట విధానమూలేదు. ఏ ప్రధాన సమస్య మీదా అందరూ కలిసి ఒక నిర్ణయానికి రావటంలేదు. ఎవరికివారే యమునా తీరేగా వ్యవహరిస్తున్నారు. మద్యపాన నిషేధ సమస్యమీద వచ్చిన పరస్పర విరుద్ధ ప్రకటనలే యిందుకు నిదర్శనం.

అనేక విషయాల్లో ప్రభుత్వ పక్షాల సభ్యులకే వారు నచ్చచెప్పలేకపోతున్నారు. ప్రభుత్వాన్ని బలపరిచే వారి సమావేశాలుగాని, కాంగ్రెస్ పార్టీ సమావేశాలుగాని అన్నీ వాల్తేరులో ప్రతిష్టంభనతోనూ, కేకలతోనూ ముగిసాయి.

ఉద్యోగుల నియామకం విషయంలో ప్రభుత్వవైఖరిని కాంగ్రెసు కార్యదర్శి టి. యన్. వెంకట సుబ్బారెడ్డిగారే నిశితంగా విమర్శించారు. "భూసంస్కరణనూ తలపెట్టని ప్రభుత్వాన్ని ప్రజల్లోకిపోయి ఏమని బలపర్చమనగలం" అని మరొక కాంగ్రెసు శాసనసభ్యుడు గొల్లున గోల పెట్టాడు. కుమారప్ప కమిటీ సిఫార్సుల ననుసరించి భూసంస్కరణల్ని ప్రవేశపెట్టాలని కోరుతూ ప్రజాపార్టీ సభ్యుడు అనధికార తీర్మానం తెచ్చాడు.

మంత్రివర్గానికి ఏ వైఖరీ లేకపోయినా సమయానికి నెత్తిమీదకొచ్చిన దానిని అంగీకరించి ఆచరణలో తలాయించి బ్రతకాలనే వైఖరి మాత్రం వున్నది. బంజరు పంపకం తీర్మానం అంగీకరించారేగాని యింతవరకు ఏమీ చేయలేదు. ఈసారి పల్లె ఇళ్ళ స్థలాలుగా మారిన పోరంబోకులను గ్రామకంఠంలో చేర్చి రెండు రకాల పన్నుల బాధనుంచి వాటిని తప్పించాలన్న అనధికార తీర్మానాన్ని గొణుగుతూ అంగీకరించారు. కాని "వాయులు తినే స్వాములకు పచ్చగడ్డి ఫలహారమా" అని అధికార తీర్మానాలనే బుట్టదాఖలు చేస్తున్నవారికి యివొక లెక్కా !"

కాంగ్రెసుపార్టీకి గాని, ప్రకాశం మంత్రివర్గానికిగాని ఆంధ్ర శాసనసభకు సక్రమనాయకత్వం వహించగల తాహతు లేదని వాల్తేరు సమావేశం మరింత దృఢంగా రుజువు చేసింది. కేవలం ప్రతిపక్షాలలోనున్న చీలికలనూ, కొందరి శాసనసభ్యులలోగల అవకాశవాదాన్నీ మాత్రమే ఆధారం చేసుకొని వారు బ్రతుకుతున్నారు. సూటిగా ప్రతిపక్షం విశ్వాసరాహిత్య తీర్మానాన్ని తెచ్చి ఓడించలేదనే ధీమాతోనే ఎన్ని ప్రధాన సమస్యలపై ఓడిపోయినా మంత్రివర్గం కుర్చీలు పట్టుకొని వేళ్ళాడుతూ వున్నది.

వాల్తేరులో శాసనసభా సమావేశం వద్ద దినదినమూ కూడిన వేలాదిప్రజలు ఈ విషయం ప్రత్యక్షంగా చూశారు. పత్రికలద్వారా ఆంధ్రదేశమూ తెలుసుకున్నది. ఈ అనుభవాలనుండి గుణపాఠాలు నేర్వటం అత్యవసరం.

న్యూఢిల్లీలోని గురుద్వారలో ఇంటికప్పు కూలడంవల్ల 5 గురు మరణించారు. 40 మంది గాయపడ్డారు.

రేడియో

జూన్ 7 సోమ॥

విజయవాడ (367.1 మీటర్లలో) ఉదయము :
6-55 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 మద్రాసు వలె;
8-0 (ఆం. వా);
1-0 గానమంజరి;
1-30 గీత్ ;
1-40 ([illegible]);
1-50 (తె. [illegible]);
4-0 గీతమంజరి - ఆర్. బాలసరస్వతి, టి.సూర్యకుమారి, సీత, అనసూయ ఎ. ఎమ్. రాజా, బి. గోపాలం;
6-15 ప్రాంతీయ వార్తలు
6-30 గ్రామసీమ;
7-0 (తె. [illegible]);
7-15 [illegible];
7-30 కల్పలత;
7-45 సంస్కృత భారత ప్రభావము-'పింగళి లక్ష్మీకాంతం ప్రసంగం;
8-0 'ఉత్తమఇల్లాలు' సంగీత నాటిక;
9-0 (ఆ వా);
9-30 సమాప్తి

మద్రాస్(బి) : (270.8 మీటర్లలో) ఉదయము:
6-55 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 ఉదయసంగీతం;
7-30 మద్రాసు ఎ వలె,
12-0 కార్మికులకు,
1-0 గీతమాలిక;
1-30 (ఆం [illegible]);
1-40 గానమంజరి;
1-50 (తె. [illegible]);
2-0 క్లారినెట్ :
5-30 మద్రాసు ఎ వలె;
6-15 ప్రాంతీయవార్తలు
6-25 లలిత గీతము;
6-30 గ్రామసీమ;
7-0 (తె వా.);
7-15 గ్రామసీమ;
7-30 జంత్రసమ్మేళనం;
8-0 'ఉత్తమఇల్లాలు'- సంగీత నాటిక;
9-15 గోటువాద్యం;
10-30 సమాప్తి.

హైదరాబాద్ : (412.0 మీటర్లలో) ఉదయము:
6-55 సుప్రభాత్ ;
7-0 (తె. వా.);
7-15 క. పుష్ప;
8-0 (ఆం. వా.);
8-15 ([illegible]);
12-30 [illegible];
12-50 (మ. వా);
1-0 వాద్యసంగీత్ ;
1-10 ప్రణయాంజలి;
1-50 (తె. వా);
5-30 [illegible];
6-0 క. కార్యక్రమం;
6-40 స్థానిక ప్రకటనలు;
[illegible] సీమ;
7-0 (తె. [illegible]);
7-15 [illegible];
7-45 (ఇ. వా.);
8-0 ప్రసంగం;
8-15 ఆప్ కా పత్ర్ మిలా
8-20 గీత్ ;
8-50 సారంగి;
9-0 (ఆం. వా.);
9-15 (ఉ. వా.);
9-30 క. పుష్ప;
10-30 సమాప్తి

4 వ కడపజిల్లా రైతు మహాసభ
పాలూరులో (పులివెందుల తాలూకా)
జూన్ 8, 9 తేదీలలో
అధ్యక్షులు : శ్రీ వై. ఈశ్వరరెడ్డిగారు [యం. పి.]
ప్రారంభకులు : శ్రీ చలసాని వాసుదేవరావుగారు
[ఆంధ్ర రైతు వుద్యమ నిర్మాత]
ఉపన్యాసకులు : శ్రీ తరిమెల నాగిరెడ్డిగారు
[ఆంధ్రశాసన సభలో ప్రతిపక్ష నాయకులు]
శ్రీ వై. వి. కృష్ణారావుగారు
[కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం]
శ్రీ యన్. శివరామిరెడ్డిగారు [ఎం. ఎల్. ఏ]
శ్రీ గజ్జల మల్లారెడ్డిగారు
[కార్యదర్శి, జిల్లా కమ్యూనిస్టుపార్టీ]

పంజాబ్ లో పౌరసత్వ హక్కులు

(5 వ పేజీ తరువాయి)

భాషాప్రాంతాలను ఒక యూనిటుగా చేయాలని స్పష్టంచేశారు. ఇందుకోసం 35 మంది కాంగ్రెసు శాసనసభ్యులలోను 24 మంది కలసి ఒకచోట సమావేశం జరిపారు. పెప్సూరాష్ట్రం ప్రాంతాలను ఆయా భాషా ప్రాంతాలతో కలిపి వేయాలని రెండురోజులు జరిగిన హర్యాన ప్రజామండలి సమావేశంలో తీర్మానింపబడింది.

కలనల్ రఘుబీరసింగ్ ఆధిపత్యం క్రిందవున్న పెప్సూ ప్రభుత్వం పెప్సూ రాష్ట్రం యిప్పటిలాగే చెక్కు చెదరకుండా వుండాలని అంటోంది. శ్రీ బ్రిష్‌భాన్ నాయకత్వాన నడుస్తున్న కాంగ్రెసు కమిటీ "మహాపంజాబ్" నినాదం ప్రచారం చేస్తోంది. అయితే ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో వున్న కాంగ్రెసు వారు యీ "మహాపంజాబ్" నినాదాన్ని వ్యతిరేకిస్తున్నారు.

ఇరిగేషన్ పన్ను హెచ్చింపుకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళన సందర్భంలో 38 మంది ప్రజాసోషలిస్టు పార్టీ సభ్యులు గురువారంనాడు ఆగ్రాలో అరెస్టు చేయబడ్డారు.

సభలు సమావేశాలు

నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు కమిటీ సమావేశం జూన్ 7 వ తేదీనుండి 9 వ తేదీవరకు కావలితాలూకా ముంగమూరు గ్రామంలో జరుగుతుంది.

◆ ◆ ◆

పశ్చిమ గోదావరిజిల్లా రైతుసంఘ సర్వసభ్యసమావేశం ఈ నెల 9 వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు తాడేపల్లిగూడెం కార్యాలయంలో జరుగుతుంది.

ఆ ఉదయం 9 గంటలకు జిల్లా రైతుసంఘ కార్యవర్గ సమావేశం జరుగుతుంది.

ప్రభాత ప్రెస్ నెల్లూరు
అట్టపెట్టెలు – రబ్బరు స్టాంపులు
లిథో ప్రింటింగ్ – కలర్ ప్రింటింగ్
పుస్తకములు – పెండ్లిపత్రికలు

కుమార్ స్టుడియో
ఫొటో ఆర్టిస్టు, ప్రోసెస్ ఎంగ్రేవర్సు, ఫొటోగూడ్సు డీలర్సు, న్యూసిటీ టాకీస్ ప్రక్క, రైల్వే స్టేషన్ రోడ్, గుంటూరు.
కెమెరాలకు, ఫిలిములకు, ఫొటో ఎన్లార్జిమెంట్లకు మీరిచ్చు ఆర్డర్లు అతి జాగ్రత్తతో నిర్వహించబడును.

భారత్ (కాస్మాస్) (రి. నెం. 1866)
75, హారిస్ రోడ్ - మద్రాస్ - 2
96 వ వార అడ్జుడికేషన్ కమిటీ ఫలితం
112212122212212
94th week prize Dividends: 1st Prize 7 shares at 715/- 2nd Prize 140 shares at 4-10-0 3rd Prize 1517 at Rs. 1-4-0, 4th Prize 3924 shares at Rs. 0-10-0.
1st Prize Winners in competition No. 93 (1) Sri P. B Vadivelu Mudaliar, Peranambalu-Ponneri Taluk (2) P. Veeraswamy Chetty Shathpet, Sa'ai Street, Conjeevaram, (3) Sri N. Apparau, Tailor, Muthu Goranikarao, Karaikudi, (4) M. Shanmugam, C/o Murugan Rly. Colony, Madurai (5) V. Vairavan, Sita Umkarai, Tiruputhur, (6) Radha Krishna Ariya Konepatti Islampet Thirumangalam (7) V. Paul Pandiyan, 34 Post Office Road Kumbakonam, (8) T. V. Rajulu C/o Kellet High School, Madrs-5.

చదవండి
రాంషా గారి
★ అనంతం ★
రూపాయి.

సులేఖా
ఫౌంటన్ పెన్ ఇంకు
లోకములో ప్రఖ్యాతి గాంచి వ్రాయుటకు తగిన ఇంకు.
(అన్ని షాపులలోను దొరుకును)
SULEKHA WORKS LTD.
SULEKHA PARK CALCUTTA

బొహోబావా యుద్ధంలో వియత్మినుల విజయం

క్వాన్ ఫాంగ్ హో వద్ద వేయిమంది ఫ్రెంచి సైనికుల నష్టం

హనోయ్, జూన్ 4

క్వాన్ ఫాంగ్ హో అనే చోటనున్న క్రైస్తవ పాఠశాలా భవనాన్ని వియత్మిన్ సైన్యాలు వశపరచుకొన్నాయని నేడొక ఫ్రెంచి అధికార ప్రకటన తెలుపుతూంది. ఈ పాఠశాలను ఒక చిన్న దుర్గంగా తయారుచేసి వేయిమందికిపైగా ఫ్రెంచి సైన్యాలను ఇక్కడ చేర్చారు.

ఇంటిలోని ఈ ప్రతిఅంగుళం మేరనూ జైనట్లసాయంతో వియత్మిన్ సేనలు స్వాధీనపరచుకొన్నాయి. మొదట అంతస్తును స్వాధీనపరచుకొన్న నాలుగు గంటలకు రెండో అంతస్తును స్వాధీనపరచుకొన్నారని ఆ ప్రకటన తెలుపుతూంది. ఇరుపక్షాల వారిల జనం నష్టపడ్డారనీ, పాఠశాలదుర్గంలో వున్న ఫ్రెంచిసైనికులలో నూరుమందిమాత్రమే తప్పించుకు రాగలిగారనీ అధికార ప్రకటన తెలుపుతూంది. ముట్టడిలో వున్న సైన్యాలను కాపాడడానికై ఫ్రెంచి విమానాలు విశ్వప్రయత్నాలు చేసి విఫలం అయాయి.

ఈ క్వాన్ ఫాంగ్ హో నోయ్ కి ఆగ్నేయంగా 70 మైళ్ళలో వుంది.

హానోయ్ కి ఆగ్నేయంగా నలభయి మైళ్ళలో వున్న చోనై గుర్రాన్ని వియత్నామ్ సైనికులు ఖాళీ చేసిపోయారని మరొక ఫ్రెంచి ప్రకటన తెలుపుతూంది. ఈ దుర్గం మీద ఎనిమిదోసారిగా వియత్మిన్ సేనలు దాడి చేస్తున్నాయి.

ఆంధ్రదేశంలో రాగుల పంట

196900 టన్నులుండగలవని రెవిన్యూబోర్డువారి అంచనా

కర్నూలు, జూన్ 4

ఆంధ్రదేశంలో 1953-54 సంవత్సరం రాగిపంట 195900 టన్నులు ఉండగలవని రెవిన్యూబోర్డువారు అంచనా కట్టుతున్నారు. నిరుటికన్న పైరు వేసిన భూమి ఎక్కువగావున్నా దిగుబడి అయే పంట మాత్రం నాటికి దాదాపు రెండుపాళ్ళు తక్కువ వుండగలదట. దీనికి కారణం కాలమాన పరిస్థితులేనని వారంటున్నారు.

బజారు ధరలు

విజయవాడ, జూన్ 5

(మధ్యాహ్నం 2.3-0)

	రు.	అ.	పై
బంగారం ధరలు			
మేలిమి : పొట్లా	87	8	0
మూసా	87	0	0
నవరసు	60	0	0
వెండి : 100 తులములు	167	0	0
1 తులము	1	11	0
ధాన్యం ధరలు			
24 శెంబరు	21	8	0
వంకసన్నాలు	20	8	0
12 శెంబరు	20	4	0
అక్కుళ్ళు	20	0	0
కుసుమ	19	8	0
కొణామణి	19	8	0
బియ్యం ధరలు			
24 శెంబరు	54	0	0
వంకసన్నాలు	48	0	0
12 శెంబరు	45	8	0
అక్కుళ్ళు	45	8	0
కుసుమ	41	8	0
కొణామణి	44	8	0
వేరుశెనగ ధరలు			
వేరుశెనగపప్పు 177 శేర్లు	55	0	0
,, కాయ ,,	13	10	0
,, [illegible] 180	16	8	0
,, ముడిపిండి 160 ,,	19	0	0
పురికొస 1,000 అడుగులు	150	0	0
పొలకొల్లువి ,,	145	0	0
పసుపు పుట్టి	275	0	0
సంచులు 100	104	0	0


పెన్-ఇండియా
పెన్ స్పెషలిస్టు
10/13 పొద్దురోడ్
విజయవాడ-1
ఎన్నిక. మన్నిక గలపనితనముసకాలంలో అందజేయుటమాకు ప్రత్యేకత.

ఐక్య దక్షిణ ప్రదేశ్

మళయాళీ ప్రదేశ్ కాంగ్రెస్ అభ్యర్థన

కాలికట్, జూన్ 4

మళయాళీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున శ్రీ కె. గోపాలన్, శ్రీ పి. పి. ఉమర్ కోయా నేడు ఫజులాలీ కమిషన్ కు ఒక మెమొరాండం సమర్పించారు. ఫజులాలీ కమిషన్ నేడిక్కడ విచారణ ప్రారంభించింది.

తిరువాన్కూర్ కొచ్చిన్, మద్రాసు, కూర్గు రాష్ట్రాలతో కూడిన ఐక్య దక్షిణ ప్రదేశ్ రాష్ట్రం ఏర్పరచాలని ఈ మెమొరాండంలో కోరబడింది. భాషా ప్రాతిపదిక పైన ప్రత్యేక రాష్ట్రాన్ని వీరు వ్యతిరేకించారు. అయితే దక్షిణ రాష్ట్రానికి తమిళనాడు వ్యతిరేకించినట్లయితే తిరువాన్కూరు కొచిన్ మలబార్ దక్షిణ కనరా జిల్లాలోని కాసరగోడ్ తాలూకా గుడాలూర్ అమిన్ దీవులతోకూడిన రాష్ట్రం ఏర్పరచవచ్చునని వీరు సూచించారు.

ఐక్యకేరళ కమిటీ నివేదిక

మద్రాసు, జూన్ 4

తిరువాన్కూర్ కొచ్చిన్, మలబార్, లక్కదీవి, అమిన్ దీవి, దక్షిణ కనరా, గుడాలూర్, ఉదకమండలం తాలూకాలు, కూర్గు, మాహే, కోయంబత్తూరు జిల్లాలో పశ్చిమ భాగం కలిపి, కేరళ రాష్ట్రం నిర్మించాలని ఐక్య కేరళ కమిటీ నేడు ఫజులాలీ కమిషన్ కు సమర్పించిన నివేదికలో కోరింది.

తాము నూతన రాష్ట్రాన్ని భాషా ప్రాతిపదికపై మాత్రమే కోరడంలేదని, నూతన రాష్ట్రం పరిపాలనా విషయకంగా, పటిష్టంగా వుండాలని కూడా తమ అభిప్రాయమని వీరు తమ మెమొరాండములో తెలిపారు. నూతన రాష్ట్రం భౌగోళికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, పరిపాలనా విషయకంగా అన్నివిధాలా అనుకూలమైన రాష్ట్రమవుతుందన్నారు. తిరువాన్కూర్ కొచ్చిన్ ను మద్రాసు రాష్ట్రంతో చేర్చాలనే సూచనను వీరు నిరాకరించారు.

తిరువాన్కూర్ కొచ్చిన్ లోని తమిళ తాలూకాలకు చారిత్రకంగా తిరువాన్కూర్ తో సంబంధమున్నదని, అవి తిరువాన్కూర్ కు ధాన్యాగారాలని చెప్తూంటూ, వాటిని విడదీయరాదన్నారు.

సింహళ భారతీయుల సమస్యలు

నెహ్రూతో భారత రాయభారి చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 4

సింహళంలో భారతహైకమిషనర్ శ్రీ సి. సి. దేశాయ్ కామన్వెల్తు శాఖ కార్యదర్శి శ్రీ దత్తుతో నేడుసమాలోచనలు జరిపారు. లంకలో భారతీయుల సమస్యలపై వీరు చర్చించినట్లు తెలుస్తున్నది. శ్రీ దేశాయ్ ప్రధాని నెహ్రూతోకూడ చర్చలు జరిపారు.

కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ అగర్వాల్ శుక్రవారం మధ్యాహ్నం త్రివేంద్రం చేరుకున్నారు.

ఇండో చైనా సభలో యుద్ధవిరమణ చర్చలు

పర్యవేక్షణ సంఘ నియామకంపై పాశ్చాత్య రాజ్యాలలో విభేదాలు

జెనీవా, జూన్ 4

ఇండో-చైనా పరిస్థితి రాని పైన తొమ్మిది రాజ్యాల రహస్య సమావేశం నేడు పన్నెండోమారు జరిగింది. సభకు సోవియట్ విదేశాంగమంత్రి మొలటావ్ అధ్యక్షత వహించాడు.

యుద్ధవిరమణపర్యవేక్షక సంఘంలో నియమించవలసిన సభ్యులపేర్లను సోవియట్ ప్రతినిధి సూచన్లు పాశ్చాత్య రాజ్యాలు నిరాకరించాయేగాని తాము ఏప్రతిపాదనలనూ చేయలేకపోయాయి.

ఇండియా, పాకిస్తాన్, పోలండ్, జెకోస్లోవాకియాలతో ఏర్పడిన తటస్థ రాజ్యసంఘం ఇండో చైనాలో యుద్ధ విరమణ పర్యవేక్షణకు నియమించబడాలని సోవియటు ప్రతిపాదించింది.

ఇండియా, పాకిస్తాన్, సింహళం, బర్మా, ఇండోనీషియాలతో కూడిన సంఘం అజ్మాయిషీలో జరగాలని ఈడెన్ ప్రతిపాదించ దలచాడనీ అమెరికా, ఫ్రాన్సుల వ్యతిరేకత మూలంగా అది కార్యరూపం ధరించలేదనీ చెప్పబడుతూంది.

ఇప్పుడు ఫ్రెంచి విదేశాంగ మంత్రి జార్జి బిడాల్ కొలంబో సమావేశంలో పాల్గొన్న రాజ్యాల పర్యవేక్షణకొన్ని షరతులమీద అంగీకారం తెలుపున్నాడని వార్త. ఆ అయిదు రాజ్యాలలోనూ నిర్ణయాలు ఏకాభిప్రాయంతో గాక, అధిక సంఖ్యాకుల ఇష్టం మీద జరగాలి అనేది మొదటి షరతు.

ఇండోచైనా యుద్ధ విరమణను అతిక్రమించిన విషయాలలోగాని, చర్యలు తీసుకోవలసిన సందర్భంలోగానినిర్ణయాలిచ్చేటందుకు తొమ్మిది రాజ్యాలసభకే సర్వాధికారాలు ఇవ్వడం అంటూ జరిగితే అందులో కూడా నిర్ణయాలు మెజారిటీ వోటులోనే అంగీకరించాలి. ఇది రెండో షరతు.

నేడుసభ ఎట్టి నిర్ణయాలకు రాకుండానే ముగిసింది. మరల సమావేశం మంగళవారం జరుగుతుంది.

అదే సమయంలో ఫ్రెంచి, వియత్మిన్ సైన్యాధికారులు యుద్ధ విరమణ రేఖా నిర్ణయానికై చర్చలు జరుపుతున్నారు.

ఈడెన్ లండను ప్రయాణం

బ్రిటిష్ విదేశాంగమంత్రి ఆంథోనీ ఈడెన్ నేటి రాత్రి లండన్ కు విమానంలో వెళ్ళిపోయాడు. రేపు జరిగే బ్రిటిష్ మంత్రివర్గసభలో ఆసియా రాజ్యాల సభలో వచ్చిన పరిణామాలను గురించి రిపోర్టునిస్తాడు.

శ్రీ మీనన సంప్రదింపులు

ఒక వైపున తొమ్మిది రాజ్యాల సంప్రదింపులు జరుగుతూండగా రెండో వేపున ఐ.రా.స.లో భారత రాయబారి శ్రీ వి. కె. కృష్ణమీనన్ వివిధదేశాల రాయబార వర్గాలతో తన చర్చలను సాగిస్తున్నారు. ఆతను నేడు వియత్మిన్ ఉపముఖ్యమంత్రి ఫామ్ వాన్ డాంగ్ ను ఆ తర్వాత బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్ ను కలుసుకొని సంప్రదించారు.

భారత-సోవియట్ సంస్కృతీ మండలి ఆంధ్రశాఖ మహాసభ

విజయవాడలో, జూన్ 11 వ తేదీన

విజయవాడ, జూన్ 5

భారత సోవియట్ సంస్కృతీ మండలి ఆంధ్ర శాఖ మహాసభ ఈనెల 11 వ తేదీన విజయవాడలోని గాంధీనగరం హైస్కూలులో జరుగుతుంది. సభకు శాసనసభ్యులు శ్రీ ఖండవల్లి కృష్ణారావు గారధ్యక్షత వహిస్తారు. డాక్టరు ఎ. వి. బాలిగ ప్రారంభోపన్యాసం చేస్తారు. సోవియట్ సంస్కృతీ శాఖ ప్రతినిధి శ్రీ షుద్యంకో ఉపన్యసిస్తారు.

11 వ తేదీ సాయంత్రం 4 గంటలకు సోవియట్ చిత్రకళా ప్రదర్శన ప్రారంభించబడుతుంది. సాయంత్రం 5 గంటలకు ప్రతినిధుల సమావేశం ప్రారంభమవుతుంది. రాత్రి 8½ గంటలకు అదే స్కూలు ఆవరణలో బహిరంగసభ ఉంటుంది. 10 గంటలకు సోవియట్ ఫిలిం ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. 12 వ తేదీన కూడా సోవియట్ చిత్రకళా ప్రదర్శన ఉంటుంది.

నేపాల్ భారత సంబంధాల వివరణ

నేపాల్ ప్రధాని కొయిరాలా ప్రకటన

ఖాట్మండూ, జూన్ 3

నేపాల్ ప్రధాన మంత్రి శ్రీ ఎమ్. పి. కొయిరాలా నేడిక్కడొక పత్రికా విలేఖరుల సభలో ప్రసంగిస్తూ భౌగోళిక పరిస్థితులు నేపాల్, భారత దేశాల మధ్యసన్నిహితసంబంధాలుండవలసిన అవసరాన్ని నెలకొల్పుతున్నాయన్నాడు. నేపాల్ లో ఇండియా సైనిక రాయబార సంఘం వున్నదనీ, ఇండియా సలహాదారులున్నారనీ, కోసీ ఆనకట్ట వొడంబడిక నేపాలుకు నష్టకరం అని కొన్ని పార్టీలుచేస్తున్న విమర్శలు పొరపాటనిఆయన చెప్పాడు. నేపాల్ సైన్యాన్ని పునర్నిర్మించి శిక్షణ యివ్వడానికై 1951 లో నేపాల్ లో ఏర్పడిన ఎన్నికైన మంత్రివర్గం భారత ప్రభుత్వాన్ని సైనికరాయబారులను పంపమని కోరిందనీ, వారు నేపాల్ సైన్య శిక్షణ పూర్తికాగానే తిరిగి పోతారనీ చెప్పాడు.

నేపాల్ లో ఇండియన్ సలహాదారులున్నారన్నది కేవలం అబద్ధంఅనీ, సాంకేతిక సహాయంకోసం కొందరు వుద్యోగులు మాత్రం వున్నారనీ ఆయన అన్నాడు.

భారతప్రభుత్వం నేపాల్ సరిహద్దుకు దిగువ రెండుమైళ్ళలో కోసీనదిపైడాము కట్టడానికి అవకాశంవున్నా, నేపాల్ భూములకుకూడా వుపయోగపడేటట్లు చేయడానికై డామును నేపాల్ హద్దుల్లో నిర్మిస్తూందనీ, డాము ప్రదేశాన్ని భారత ప్రభుత్వం కొనుక్కోవడం నేపాల్ స్వాతంత్ర్యానికి భంగకరం కాదనీ కొయిరాలా అన్నాడు.

“మెకార్థీ ప్రశ్నలకు సమాధాన మివ్వరాదు”

అమెరికా ప్రభుత్వోద్యోగులకు హెరాల్డ్ స్టాస్సెన్ హెచ్చరిక

వాషింగ్టన్, జూన్ 4

సెనెటర్ జోసెఫ్ మెకార్థీ ప్రశ్నలకే అనధికారంగా ఏ ఉద్యోగియైనా సమాచారం గనక యిస్తే అతడు తక్షణం బర్తరఫు చేయబడతాడని అమెరికా విదేశ వ్యవహారాలశాఖ నిర్వాహకుడు హెరాల్డు స్టాస్సెన్ నేడు ఒకప్రకటన చేశాడు.

పత్రికా విలేఖరుల సభలో ప్రసంగిస్తూ స్టాస్సెన్ ఇల్లా అన్నాడు:

“చట్టాలను,కార్యనిర్వాహణనియమాలను అతిక్రమించిన వుద్యోగి ఎవ్వడూ ఎంతోకాలం విదేశవ్యవహార నిర్వాహక శాఖలో వుండడు. అతడిని తొలగిస్తాను.”

ప్రభుత్వోద్యోగులు ఎవరికైనాసరే లంచగొండుల్ని, కమ్యూనిస్టుల్ని, ద్రోహుల్ని గురించిన సమాచారం ఏమాత్రం తెలిసినా తనకు అందజేయాలనీ, ప్రభుత్వోద్యోగులకి తనదేశంమీద కన్న, తనపై వుద్యోగియెడ విశ్వాసం వుండడం ఉచితంగాదనీ ఈ మధ్య సెనెటర్ మెకార్థీ ఒక ప్రకటన చేశాడు.

“చట్టాన్ని అధ్యక్షుని ఆజ్ఞలను అమలుజరపే అధికారం చట్టరీత్యా ప్రభుత్వ కార్యనిర్వాహణ శాఖపైనే ప్రధానంగా, పూర్తిగా వుంటుంది.” అంటూ అధ్యక్షుడు ఐసన్ హోవరు అంగీకారంతో అమెరికా ప్రభుత్వం మెకార్థీకి సమాధానంగా ఒక ప్రకటన యిచ్చింది.

హైడ్రోజన్ యుద్ధం మానవత్వానికే విరుద్ధం

చార్లీ చాప్లిన్ హెచ్చరిక

వివీ (స్విట్జర్లాండ్), జూన్ 3

భయంకర ఫలితాలతో కూడిన హైడ్రోజన్ బాంబు యుద్ధం మానవత్వానికే విరుద్ధమనీ, ప్రపంచాన్ని పిచ్చిగానినిగా మార్చివేస్తుందనీ, సుప్రసిద్ధ ఫిలిమ్ నటుడు చార్లీ చాప్లిన్ నేడు హెచ్చరించాడు.

తూర్పు బెర్లిన్ లో ఇటీవల జరిగిన ప్రపంచశాంతి సమావేశం చాప్లిన్ కు శాంతిబహుమానం ప్రదానంచేసినసందర్భంలో ఒక ప్రకటనచేస్తూ చాప్లిన్ ఇలా అన్నాడు.

“శాంతికావాలనే వాంఛ ప్రపంచ వ్యాపితమైంది. ఆలోచన తూర్పునుంచి రానీ, పడమటనుంచిరానీ, అదిసరియైన మార్గమని నేను గట్టిగా భావించుతున్నాను. అందుచే ఈ బహుమతిని పొందడానికి సంతోషించుతున్నాను.

“శాంతికి ప్రమాదం కల్గించే సమస్యలకు సమాధానాలేమిటో నాకు తెలియదు. కాని ద్వేషం, అనుమానాల వాతావరణంలో ఆ సమస్యలు పరిష్కారం కావనీ, హైడ్రోజన్ బాంబును ప్రయోగించుతామనే బెదరింపుల వల్లా ఆసమస్యలు పరిష్కారం గావనీ మాత్రం నాకు తెలుసు.

“ఈ భయానక ఆయుధాల నిర్మాణ రహస్యం త్వరలో అందరికీ తెలిసిపోతుంది. పెద్దా చిన్న దేశాలన్నీ కూడా ఈ రహస్యాన్ని తెలుసుకో గలుగుతాయి.

“ఈ అణుశాస్త్ర యుగంలో వివిధ దేశాలు తమ పాతివన స్వత్వాన్ని వదలివేయాలి. తమ విభేదాలను పోగొట్టుకోడానికి హింసనుగాక నిర్మాణాత్మక పద్ధతులను అవలంబించాలి. హైడ్రోజన్ యుద్ధాన్ని ప్రజలు అంగీకరించడం, మానవత్వానికే విరుద్ధం; ప్రపంచాన్ని పిచ్చిదానిని చేయడం.”

ఫ్రెంచి స్థావరాల విముక్తికి ఇతోధిక కృషి

కరైకాల్ నాయకుని ప్రకటన

కరైకాల్, జూన్ 5

ఇండియాలోని ఫ్రెంచి స్థావరాలపై ఫ్రెంచి ప్రభుత్వానికి, భారత ప్రభుత్వానికి జరిగిన చర్చలు విఫలమవడం పట్ల విచారం వెలిబుచ్చుతూ కరైకాల్ కేంద్రవిలీనీకరణ సంఘటన కార్యదర్శి లియో సెంట్ జీన్ నేడొక ప్రకటన చేశారు. ఇకమీదట ఇండియాలో విదేశపాలనను ఫ్రెంచి ఇండియా ప్రజలు గాని, భారతదేశ ప్రజలుగాని సహింపరని దానిని అంతం చేయడానికి ఇదివరకటికన్నా ఎక్కువగా ఇక మీదట కృషిచేయాలని ఆయన పేర్కొన్నారు.

ఎట్టి అవాంతర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనడానికి కరైకాల్ ఐక్య విలీనీకరణ సంఘటన తన నిర్మాణాన్ని బలపరుచుకుంటున్నదని లియో సెంట్ జీన్ తెలిపారు. పుదుచ్చేరిలో భారత కాన్సలేట్ జనరల్ కార్యాలయం ముందు జరిగిన ప్రదర్శనలను ప్రస్తావించి, ఫ్రెంచి ప్రభుత్వం శాంతి భద్రతల కాపాడాలని, రౌడీచర్యలను అరికట్టాలని ఆయన కోరారు. అన్ని సంస్థలూ, వ్యక్తులూ తమ విభేదాలను విడనాడి ఫ్రెంచి ఇండియా స్థావరాల విముక్తికై పోరాడాలని విజ్ఞప్తిచేశారు.

తిరువాన్కూర్ విశ్వవిద్యాలయ అనుబంధ స్నాతకోత్సవం వైస్ ఛాన్సలర్ శ్రీ రామస్వామి మొదలియార్ అధ్యక్షతన శుక్రవారం త్రివేండ్రంలో జరిగింది.

పంచవర్ష ప్రణాళికలో నందికొండ ప్రాజెక్టు

సాంకేతిక, ఆర్థిక విషయాలు పరిశీలించిన మీదటనే కేంద్రం ఒక నిర్ణయానికి వస్తుందని బూర్గులవారి ప్రకటన

హైదరాబాదు, జూన్ 4

ఆంధ్ర హైదరాబాదు ప్రభుత్వాల ఆధ్వర్యాన నిర్మింపదగు నందికొండ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక వివరాలనన్నిటినీ కేంద్ర జల-విద్యుత్ శాఖవారు పరిశీలిస్తున్నారని హైదరాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు నేడు పత్రికల వారికెరుక పరిచారు.

హైదరాబాద్ లోని మరాట్వాడా ప్రాంతానికి సంబంధించిన పూర్ణా ప్రాజెక్టు విషయంలోకూడా పరిశీలనలు జరుగుతున్నాయని ఆయన శెలవిచ్చారు. ఈ ప్రాజెక్టుల సాంకేతిక వివరాలనన్నిటినీ పరిశీలించినమీదట ప్రణాళికా సంఘంవారు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను పరిశీలిస్తారనీ, ఆపరిశీలనముగిసిన తర్వాత వాటిని తొలి పంచవర్ష ప్రణాళికలో చేర్చాలా లేక మలిపంచవర్ష ప్రణాళికలో చేర్చాలాఅన్న విషయాన్ని నిర్ణయిస్తారని శ్రీ రామకృష్ణారావుగారు వెల్లడించారు.

మరాట్వాడా ప్రాంతాన్ని ఉపేక్షిస్తున్నట్లు ఫిర్యాదులు ఎక్కువవస్తున్నాయి కాబట్టి, హైదరాబాదు ప్రభుత్వం మరాట్వాడా ప్రాంతానికి ఎక్కువ ప్రాధాన్య మివ్వదలచుకొందనికూడా ఆయన వెల్లడించారు.

రైల్వే లంచగొండి విచారణ సంఘం

జూన్ 10నుంచి దక్షిణదేశంలో పర్యటన

న్యూఢిల్లీ, జూన్ 4

ఆచార్య కృపలానీ అధ్యక్షతనగల రైల్వే లంచగొండి విచారణ సంఘం సాక్ష్యసేకరణకై జూన్ 10 నుంచి 28 వరకుదక్షిణభారతదేశంలోపర్యటిస్తుంది. ఈ సంఘం మద్రాసు, తిరుచినాపల్లి, మధుర, త్రివేంద్రం, కొచిన్ హార్బర్ టెర్మినస్, కోయంబత్తూరు, మెట్టుపాళయం, బెంగుళూరులనుదర్శిస్తుంది.

రైల్వేపోలీసు అధికారులను వాణిజ్య సంస్థల, రైల్వే ప్రయాణీకుల సంస్థల ప్రతినిధులను, రైల్వే కార్మికసంఘాల ప్రతినిధులను పార్లమెంటు సభ్యులను, రాష్ట్రశాసన సభ్యులను ఇతర వ్యక్తులను వీరు కలుసుకుంటారు.

కొత్తగా 4 వేల స్కూళ్ళ స్థాపన

బొంబాయి ప్రభుత్వ ప్రణాళిక

షోలాపూర్, జూన్ 4

500 జనాభాకు మించిన ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉండాలని బొంబాయి ప్రభుత్వం స్కీము తయారుచేసింది. ఇది అమలు జరిగితే కొత్తగా 4 వేల స్కూళ్ళు అవసర మవుతాయి.

ఈ విషయాన్ని వెల్లడిస్తూ విద్యాశాఖ డైరెక్టర్, ఈ కొత్త పాఠశాలల కోసం ఈ సంవత్సరం 6 వేలమంది ఉపాధ్యాయులు తీసుకోబడతారని చెప్పారు. బొంబాయి రాష్ట్రం తన ఆదాయంలో అధికభాగం విద్యాశాఖకు ఖర్చు పెడుతున్నదని చెబుతూ ప్రస్తుతం విద్యపై 14 కోట్లు ఖర్చు పెట్టబడుతున్నట్లు తెలిపారు.

తూర్పు బెంగాల్ తో అస్సాం సహకారం

మేజర్ జనరల్ ఇస్కందర్ మీర్జాకు దౌలత్ రామ్ హామీ

షిల్లాంగ్, జూన్ 4

ఉభయ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి సంబంధించిన విషయాల పరిష్కారంలో తమ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అస్సాం గవర్నర్ శ్రీ జైరామ్ దాస్ దౌలత్ రాం, తూర్పు బెంగాల్ గవర్నర్ మేజర్ జనరల్ ఇస్కందర్ మిర్జాకు హామీయిచ్చారు.

అస్సాం ప్రభుత్వ సహకారాన్ని అర్థిస్తూ మేజర్ జనరల్ ఇస్కందర్ మిర్జా యిటీవల అస్సాం గవర్నర్ కు టెలిగ్రాము పంపారు. దానికి అస్సాం గవర్నర్ జవాబు పంపుతూ, తూర్పు పాకిస్తాన్ లో అల్పసంఖ్యాక వర్గాలకు సుఖజీవితావకాశాలు ఇస్తామని మేజర్ జనరల్ ఇస్కందర్ మిర్జా ఇచ్చిన హామీకి హర్షం ప్రకటించారు. అలాగే అస్సాంలో ముస్లిముల న్యాయమైన హక్కులు ఇకమీదటకూడా రక్షింపబడతాయన్నారు.

దుగ్గిరాల నియోజక వర్గంలో 7 వ తేదీన సైకిళ్ళపై ఊరేగింపు

ఈ నెల 7 వ తేదీ ఉదయం నందివెలుగునుంచి కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన సైకిళ్ళపై ఊరేగింపు బయలుదేరుతుంది. ఊరేగింపులో పాల్గొనేవారంతా 6 వ తేదీ రాత్రికే నందివెలుగు చేరాలి.

ఇట్లు,
కమ్యూనిస్టు ఎన్నికల కమిటీ.
దుగ్గిరాల, జూన్ 5.

నియోజకవర్గాల మార్పుకు కారణాలు

కోయంబత్తూరు, జూన్ 4

డీలిమిటేషన్ కమీషను నియోజకవర్గాలను నిర్ణయించడంలో తొందరపాటుగా వ్యవహరించలేదనీ, పార్లమెంటు ఆమోదించిన డీలిమిటేషన్ కమీషను చట్టంలోని నిబంధనలను తూచా తప్పకుండా అమలు జరిపిందని కమీషను అధ్యక్షుడు శ్రీ యన్. చంద్రశేఖర అయ్యర్ నేడిక్కడ చెప్పారు.

పార్లమెంటు, శాసనసభల నియోజక వర్గాలనుగూర్చి డీలిమిటేషన్ కమీషనుచేసిన ప్రతిపాదనలపైఅభ్యంతరాలను, సూచనలను వినడానికిగాను డీలిమిటేషన్ కమీషను నేడు యిక్కడ సమావేశమైంది. రేపుకూడ సమావేశం జరుగుతుంది. సమావేశానికి మద్రాసు మంత్రులు శ్రీయుతులు సుబ్రహ్మణ్యం, యం. భక్తవత్సలం, యం. మాణిక్యవేలు నాయకర్ గార్లు యితరులు హాజరయ్యారు.

డీలిమిటేషన్ కమీషను అధ్యక్షుడు శ్రీ చంద్రశేఖర్ అయ్యర్ కమీషను ప్రతిపాదనలపై వచ్చిన విమర్శలకు జవాబు చెబుతూ యిలా అన్నారు: చట్టంలో పేర్కొనబడ్డ నిబంధనలను డీలిమిటేషన్ కమీషను విధిగా పాటించాలి. అందువలన యీ నిబంధనలకు విరుద్ధంగా లోగడ నిర్ణయించబడిన నియోజకవర్గాలను నిబంధనలకు అనుగుణ్యంగా కమీషను మార్చవలసి వచ్చింది.

ఒక్కొక్క పార్లమెంటు సభ్యుడు ఎంతమంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించాలి, సభ్యుల సంఖ్యకు జనాభాకు వుండవలసిన నిష్పత్తిని సాధ్యమైనంతవరకు మార్చలేదు. లోగడ నియోజకవర్గాలు నిర్ణయించినప్పటి జనాభా లెక్కలకు, ఇప్పటి జనాభా లెక్కలకు అనేక ప్రాంతాలలో తేడా లున్నవి. అందువలన నియోజకవర్గాలను పునర్విభజన చేయవలసి వచ్చింది.

ఆంధ్రరాష్ట్ర విభజన జరగడంవల్ల ఆంధ్ర మద్రాసు రాష్ట్రాలలోను, ఇతర కారణాలవల్ల బొంబాయిరాష్ట్రంలోను ఒక్కొక్క పార్లమెంటు నియోజకవర్గానికి, శాసనసభా నియోజకవర్గాలకు ఉండవలసిన నిష్పత్తిని హెచ్చించడం గాని, తగ్గించడంగాని చేయవలసి వచ్చింది.

డీలిమిటేషన్ చట్టం ప్రకారం వెనుకబడిన జాతులు, కులాలు ఎక్కువగా కేంద్రీకరించబడి ఉన్నచోట వారికి ప్రత్యేక స్థానాలు కేటాయించాలి. ఈ నిబంధనకు అనుగుణ్యంగా వెనుకబడిన కులాల, జాతుల కేంద్రీకరణనుబట్టి ఏకసభ్య నియోజక వర్గాలను ద్విసభ్య నియోజక వర్గాలుగ మార్చవలసి వచ్చింది.

కలెక్టరు ఆంక్షలు

(1 వ పేజీ తరువాయి)

అవకాశం ఇప్పించవలసిందని కార్మికులు జిల్లా కలెక్టరును అభ్యర్థించగా ఆ అభ్యర్థనను కలెక్టరు నిరాకరించాడు.

తుంగభద్ర ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ మూతపడిందనీ, తమగోడు మంత్రిగారికి వినిపించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కార్మికులు విన్నవించుకొన్నారు.

దానిపై ఇక్కడకువచ్చిన మంత్రి సామాన్యుడు కాదని, ఈయన కేంద్ర మంత్రి అని ఆ కలెక్టరు జవాబు చెప్పాడు. మంత్రిగారికి బొత్తిగా తీరికలేనందున ఆయన కార్మిక ప్రతినిధులను కలుసుకోవడానికి వీలులేదన్నారు. ఫ్యాక్టరీ మూతపడితే దానివిషయంలో తానుగాని కేంద్రమంత్రిగాని చేసేదేమీ లేదన్నారు.

ఆంధ్ర క్రైస్తవ కన్వెన్షన్, పోరంకి

బెజవాడ తాలూకా పోరంకి గ్రామంలో ఆంధ్ర క్రైస్తవ కన్వెన్షన్ 15-6-1954 నుండి 17-6-54 వరకు జరుగును. తమరెల్లరు హాజరు కాగలందులకు ప్రార్థించు చున్నాను.

ప్రసంగీకులు : 1. రెవ. ఎ. బి. మాసిలామణిగారు కాకినాడ, 2. రెవ. సి. ఎస్. సుందరేశంగారు డోర్నకల్లు, 3. రెవ. పి. ఎస్. సంజీవరావుగారు బందరు. 17 వ తేదీ రాత్రి 8 గం॥ హరికథా కాలక్షేపము గలదు. వాయిద్యము కమల, వసంతముగార్లు, గుడివాడ. పోరంకి, విజయవాడ-బందరు రోడ్డులోవున్నది. నెం 1 సిటీ బస్సులో రావచ్చును.

ఇట్లు,
ఆర్గనైజింగు కమిటీ సెక్రటరీ,
మత్తె బెంజమెన్. పోరంకి.

శ్రీ లక్ష్మీ టాకీస్
బ్రతుకు తెరువు
నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు
3 వ వారం 3 ఆటలు

శ్రీ మారుతి సినిమా
టాక్సీ డ్రైవర్
దేవ్ ఆనంద్, కల్పనాకార్తిక్
ఉదయంతో 4 ఆట

శేష్ మహాల్
ఆర్-పార్
గురుదత్తు, శ్యామ, శకీల
ఉదయంతో 4 ఆట

శ్రీ దుర్గా కళామందిరం
విజయావారి
పెళ్ళి చేసి చూడు
రామారావు, సావిత్రి, రంగారావు
5 వ వారం 3 ఆట

శ్రీ విజయ టాకీస్
పరోపకారం
వరలక్ష్మి, ముక్కామల
3 వ వారం 3 ఆట

శ్రీ ఈశ్వర మహాల్
జ్యోతి
జి. వరలక్ష్మి, సావిత్రి, శ్రీరామమూ
6 వ వారం 3 ఆట

శ్రీ లీలా మహాల్
YOUNG BESS
పంచరంగుల చిత్రం
ఉదయం ఆటలో 4 ఆట

గుంటూరు సినిమాలు

శ్రీ లక్ష్మీపిక్చర్ ప్యాలెస్
బ్రతుకు తెరువు
వ వారం 3 ఆట

ప్రభాకర్ టాకీస్
అంతా మోసం (అరవం)
నారైరాజ్, బాలయ్య, పి. కె. సరస్వ
రోజూ 3 ఆటలు

న్యూ ఇండియా కేఫ్
కాఫీ అండ్ మిలటరీ భోజన హోటల్
మెయిన్ రోడ్ - గుంటూరు.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ : ప్రజాశక్తి ప్రింటింగు ప్రెస్సు, [illegible], విజయవాడ. సంపాదకవర్గం:— మాటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.